www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 27-5-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 41 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య ఉ.8.31 తదుపరి జ్యేష్ఠ శు. పాడ్యమి తె.5.02, నక్షత్రం: రోహిణి రా.2.50 తదుపరి మృగశిర, వర్జ్యం: రా.7.44-9.09, దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.17-11.00, అమృతఘడియలు: రా.11.59-1.24 రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.40 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


VVIT UNIVERSITY
ADMISSIONS OPEN FOR
BBA (HONS.) – 4 YEARS
MBA, MCA – 2 YEARS
కన్వీనర్ కోటాలో
ప్రవేశాలు పొందేందుకు
EAPCET
ప్రవేశ పరీక్ష రాస్తున్న అభ్యర్థులందరికీ
మా శుభాకాంక్షలు

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 27-5-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మానవ బాంబులుగా స్లీపర్ సెల్స్!



దేశంలో భారీ పేలుళ్లకు సిరాజ్ పథకం
డబ్బు ఆశ చూపి 12 మంది యువకులకు ఎర
పేలుళ్లకు విజయనగరమే తొలి టార్గెట్?
విచారణలో కీలక విషయాల గుర్తింపు

విజయనగరం/క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): దేశంలో భారీ పేలుళ్లకు సిరాజ్ కుట్రలు పన్నాడని, ఇందుకోసం పలు రాష్ట్రాల్లో అమాయక, నిరుద్యోగ ముస్లిం యువకులకు డబ్బులు ఎరవేసి ఉగ్రవాద ఉచ్చులోకి దించాడని ఎన్ఐఏ, కౌంటర్ ఇంటెలిజెన్స్, పోలీసు అధికారులు విచారణలో గుర్తించినట్లు తెలిసింది. ఇందుకోసం సిరాజ్, సమీర్‌లు సిగ్నల్ యాప్‌ను ఎంచుకున్నారు. ఇతర యాప్‌లను వినియోగిస్తే నిఘా సంస్థలు పసిగట్టే అవకాశం ఉందని.. అందుకే సిగ్నల్ యాప్‌ను ఎంచుకున్నట్లు విచారణలో వారు వెల్లడించినట్లు

మిగతా 12వ పేజీలో...


మహానాడు ప్రాంగణం వద్ద జెండాల రెపరెపలు

నేటి నుంచే పసుపు పండుగ

కడపలో మహా సంబరానికి సర్వం సిద్ధం



మూడ్రోజుల మహానాడు కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు
మొదటి రోజు 23 వేల మంది ప్రతినిధులతో సభ
సంస్థాగత నిర్మాణం, భావి కార్యాచరణపై చర్చ
రేపు వివిధ తీర్మానాలపై సమాలోచనలు
ఏపీవి 14, తెలంగాణవి 5, ఉమ్మడి తీర్మానాలు 4
ఎల్లుండి 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ
కడప చేరుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
ఇప్పటికే మంత్రులు, పలువురు నేతల మకాం

అమరావతి/కడప, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప గడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహించే పసుపు పండుగకు సర్వం సిద్ధమైంది. కర్నూలు-కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని రింగు రోడ్డు వద్ద సువిశాలమైన 125 ఎకరాల్లో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. కడప నగరం ఫ్లెక్సీలు, బ్యానర్లతో పసుపుమయంగా మారింది. సోమవారం రాత్రి సీఎం చంద్రబాబు ప్రత్యేక విమానంలో చేరుకోగా.. టీడీపీ జాతీయ

మిగతా 13వ పేజీలో...

కడపలో ఏర్పాటు చేసిన మహానాడు స్వాగత ద్వారం.. (ఇన్‌సెట్) ప్రతినిధుల సమావేశానికి సిద్ధమైన వేదిక

తెలుగు తమ్ముళ్ల మహా వేడుక!

1983లో తొలి మహానాడుకు బెజవాడ వేదిక
పలు కారణాల వల్ల ఆరుసార్లు బ్రేక్
కరోనా సమయంలో జూమ్ ద్వారా నిర్వహణ


సోమవారం కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తీసుకెళ్తున్న పోలీసులు

క్వార్ట్జ్ అక్రమ తవ్వకంలో కాకాణే సూత్రధారి

రుస్తుం మైన్స్‌లో 138 కోట్ల ఖనిజం తరలింపు

అధికార్లను, గిరిజనులను భయపెట్టారు
ఆయనకు పెద్ద నేరచరిత్రే ఉంది
11 క్రిమినల్ కేసులు పెండింగ్
విచారణకు పిలిచినా రాలేదు
2 నెలలు తప్పించుకుని తిరిగారు
బెయిల్ ఇస్తే సాక్ష్యాలు తారుమారు
కోర్టుకు పోలీసుల నివేదన
సుదీర్ఘ రిమాండ్ రిపోర్టు సమర్పణ
మాజీ మంత్రికి 14 రోజులు రిమాండ్
నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలింపు
కస్టడీ కోసం నేడు కోర్టులో పిటిషన్ వేయనున్న పోలీసులు

నెల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌లో మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డే సూత్రధారి అని పోలీసులు స్పష్టంచేశారు. అప్పట్లో మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని పొదలకూరు మండలం పరిధిలోని రుస్తుం మైన్స్‌లో ఈయన రూ.138 కోట్ల విలువైన క్వార్ట్జ్ ఖనిజాన్ని అక్రమంగా తరలించారని వెల్లడించారు. ఇందుకోసం అధికారులను, క్వారీ కింద నివసించే గిరిజనులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారని కోర్టుకు సమర్పించిన సుదీర్ఘ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. కాకాణికి సుదీర్ఘ నేరచరిత్ర ఉందని.. 11 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కర్ణాటకలోని చింతామణిలో ఆదివారం రాత్రి ఆయన్ను

మిగతా 14వ పేజీలో...


సోమవారం ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో భారీ వర్షానికి చేరిన నీటిలో జనం పాట్లు

ముంబైపై కుంభవృష్టి

- 29.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు.. 107 ఏళ్లలో ఇదే తొలిసారి
- నీటమునిగిన పలుప్రాంతాలు.. రైలు, మెట్రో, బస్సు సర్వీసులు రద్దు
- మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో వర్షాలు.. కేరళ, కర్ణాటకలోనూ వానలు

ముంబై, మే 26: ముంబై నగరాన్ని సోమవారం భారీవానలు ముంచెత్తాయి. రుతుపవనాలు ప్రవేశించిన తొలిరోజే ఏకంగా 29.5 సెంటీమీటర్ల వాన కురిసిందని భారత వాతావరణ విభాగాని(ఐఎండీ)కి చెందిన కొలాబా అబ్జర్వేటరీ వెల్లడించింది. ఇది

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రంలోకి 'నైరుతి' 3

సీమలో ప్రవేశం.. కావలి వరకూ విస్తరణ
ఈ ఏడాది ముందుగానే పలకరించిన తొలకరి
నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం


కోనసీమ జిల్లా కమినిలంక వద్ద గోదావరి నదిలో యువకులు గల్లంతైన ప్రదేశం

గోదావరి 'లంక'లో ఘోరం

8 మంది యువకులు గల్లంతు

ఇద్దరిని రక్షించే ప్రయత్నంలో ముగ్గురు.. ఆపై మరో ముగ్గురు 14
గల్లంతైన వారిలో ఇద్దరు అన్నదమ్ములు
అంతా కాకినాడ, కోనసీమ జిల్లా వాసులే.. 21 ఏళ్లలోపువారే
ఓణీల వేడుకకు వచ్చి ప్రమాదంలోకి..

పేరుకే ప్రైవేటు డాబు!

వసతుల కల్పనలో ప్రైవేటు స్కూళ్లు అంతంతే

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల సంఖ్య 9,953

- వాటిలో ఒక్కటి కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేదు.
- అత్యంత నాసిరకంగా వసతుల ప్రమాణాలున్న 95 పాఠశాలలకు సింగిల్ స్టార్ రేటింగ్ మాత్రమే దక్కింది. అంతంతమాత్రంగా ప్రమాణాలున్న పాఠశాలలు ఏకంగా 3,420 ఉన్నాయి. వీటికి టూ స్టార్ రేటింగ్ లభించింది.
- మధ్యస్థంగా ప్రమాణాలున్న త్రీస్టార్ రేటింగ్ పాఠశాలలు 5,730. కొంత మెరుగ్గా ప్రమాణాలున్న ఫోర్ స్టార్ రేటింగ్ పాఠశాలలు 708 ఉన్నాయి.

రాష్ట్రంలో ఒక్క స్కూల్‌కూ దక్కని ఫైవ్‌స్టార్ రేటింగ్



నాలుగు స్టార్లు ఉన్నవీ చాలా తక్కువే
95 బడుల్లో అత్యంత ఘోర ప్రమాణాలు
అంతంతమాత్రంగా ఉన్న బడులు 3,420
మధ్యస్థంగా ప్రమాణాలు ఉన్నవి 5,730
అయినా ఫీజుల్లో వెనక్కి తగ్గని వైనం
విద్యాహక్కు ఫీజుల కోసం ఇన్‌ఫ్రాపై పాఠశాల విద్యా శాఖ వివరాల సేకరణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
'అత్యాధునిక లైబ్రరీ, విశాలమైన ఆట స్థలం, అన్ని సౌకర్యాలూ ఉన్న లేబొరేటరీలు, హైస్పీడ్ ఇంటర్నెట్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు.. ఒక్కటేంటి అసలు మా బడిలో లేనిదే లేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలన్నీ ఉన్నాయి' అని ప్రైవేటు పాఠశాలలు ఊదరగొడుతుంటాయి. ఆహా, ఓహో.. అనేలా ప్రచారమే తప్ప వాస్తవంగా

మిగతా 12వ పేజీలో...


12

పూర్తిస్థాయి డీజీపీగా హరీష్ గుప్తా

యూపీఎస్సీ సిఫారసు.. ప్రభుత్వ ఉత్తర్వులు.. 28న బాధ్యతలు
రెండేళ్లపాటు సేవలు
పదేళ్ల తర్వాత పూర్తిస్థాయి డీజీపీ

పవన్ కల్యాణ్ మాకు పెద్దన్న



ఆయన తిట్టినా పడతాం: దిల్‌రాజు
థియేటర్ల మూసివేతపై విచారణ జరుగుతుంది: మంత్రి దుర్గేశ్

సినిమా పేజీలో

విశాఖలో హౌస్ సర్జన్‌కు కరోనా? 2

పోలీసుల ఆధ్వర్యంలో.. నంబాల అంత్యక్రియలు

మరో ఐదుగురు నక్సల్స్ మృతదేహాలకూ..
ఎండుకట్టెల మధ్య వేసి కిరోసిన్‌తో దహనం చేసిన బలగాలు!
బంధుమిత్రులు లేకపోవడంతో.. తామే అంత్యక్రియలు చేశామన్న పోలీసులు
మృతదేహాలను అప్పగించమంటే.. ఇచ్చేది లేదని బెదిరించారు: బంధుమిత్రులు

చర్ల/హసన్‌పర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతదేహానికి ఛత్తీస్‌గఢ్ పోలీసులు అంత్యక్రియలు జరిపారు. అయినవారు మృతదేహాన్ని అప్పగించాలంటూ ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లినా.. ప్రజా సంఘాలు డిమాండ్లు చేసినా.. ఆ మేరకు హైకోర్టుకు అడ్వొకేట్ జనరల్ స్పష్టమైన హామీ ఇచ్చినా.. నారాయణపూర్ పోలీసులు ఖాతరు చేయలేదు. నంబాలతో పాటు.. మరో ఐదుగురు నక్సలైట్ల మృతదేహాలను సోమవారం దహనం చేశారు. ఆ వీడియోలను

మిగతా 12వ పేజీలో...



నంబాలను సజీవంగా పట్టుకుని చంపారు

విప్లవ ద్రోహుల సమాచారంతోనే..
కాపాడుకునేందుకు 27 మంది త్యాగం
ఐనా ఆయన్ని కాపాడుకోలేకపోయాం
తప్పించుకొని వెళ్లిపోవాలన్నా వినలేదు
25 వేల బలగాలతో 35 మందిమి తలపడ్డాం.. మావోయిస్టు పార్టీ ప్రకటన


విజయవాడ రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు పీఎస్ఆర్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

అధికారముంది.. చేశానంతే!

కమిషన్ నిర్ణయాలే అమలు చేశాను
కస్టడీలో పీఎస్ఆర్ సమాధానాలు
కొన్నింటికి మౌనం, తెలియదని జవాబు
రెండో రోజు 32 ప్రశ్నలు 14
కాసేపు పోలీసు కమిషనర్ విచారణ
ఏపీపీఎస్సీ గ్రూపు-1 కేసులో ముగిసిన పీఎస్ఆర్, మధుసూదన్ కస్టడీ

'జమిలి'తో దేశ ప్రగతి

ఇది భారత జీడీపీకి ఊతమిచ్చే విధానం



'ఒకే దేశం-ఒకే ఎన్నిక'ను కరుణ కోరుకున్నారు
ఆయన నిర్ణయాన్ని స్టాలిన్ వ్యతిరేకిస్తే ఎలా?
జమిలిపై ప్రతిపక్షాలది తప్పుడు ప్రచారం
అవసరమైతే తమిళనాట ఎన్నికల ప్రచారం
ఈసారి ఇక్కడ ఎన్‌డీఏ కూటమిదే విజయం
చెన్నైలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

చెన్నై, మే 26 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' విధానం దేశ ప్రగతికి చేయూతనిచ్చే సంస్కరణ అని, ఇది దేశ జీడీపీకి ఊతమిచ్చే విధానమని ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అనే అంశంపై చెన్నైలో సోమవారం జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రసంగించిన పవన్ కల్యాణ్.. అనంతరం విలేకరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు దేశానికి అవసరమైన మార్పని అన్నారు. ఎన్నికలనేవి ఒక నిరంతర ప్రక్రియలా మారి దేశ ప్రగతికి ఆటంకం

మిగతా 12వ పేజీలో...

పుతిన్ పిచ్చోడు: ట్రంప్



వాషింగ్టన్, మే 26: ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని, అవసరం లేకపోయినా చాలామందిని చంపేస్తున్నారని విమర్శించారు. పుతిన్‌తో తనకు సత్సంబంధాలే ఉన్నాయన్నారు. అయితే పుతిన్‌కు అప్పుడప్పుడు ఏమవుతుందో అర్థం కావడం లేదని, ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నారంటూ ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు. ఉక్రెయిన్‌ను పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవాలని పుతిన్ యత్నిస్తున్నారని, అలా జరిగితే రష్యా పతనం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై కూడా ట్రంప్ విమర్శలు ఎక్కుపెట్టారు. జెలెన్‌స్కీ మాట్లాడే తీరువల్లే ఉక్రెయిన్‌కు చేటు జరుగుతోందన్నారు. జెలెన్‌స్కీ నోరు విప్పితే చాలు సమస్యలు తలెత్తుతున్నాయని, ఆయన మౌనంగా ఉంటే మంచిదని ట్రంప్ సలహా ఇచ్చారు. తాను అధ్యక్షుడిగా ఉంటే ఈ యుద్ధం జరిగేది కాదని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా అనేక నగరాలపై రష్యా 367 డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడి జరపడంతో 14 మంది చనిపోయారు.

మెక్రాన్ చెంప చెళ్లుమనిపించిన భార్య!



న్యూఢిల్లీ, మే 26: ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌ను ఆయన భార్య చెంపమీద కొట్టారా? వియత్నాంలోని హనోయ్‌లో ఆదివారం మెక్రాన్ దంపతులు విమానంలోంచి దిగుతుండగా చిత్రీకరించిన వీడియోలోని దృశ్యాలను చూస్తే ఔను అనే అనిపిస్తోంది. విమానం ల్యాండైన కొద్దిసేపటికి.. తలుపులు తెరుచుకున్నాక మెక్రాన్, ఆయన భార్య బ్రిగట్టే కలిసి దిగేందుకు సిద్ధమయ్యారు. అంతలో బ్రిగట్టే చేయి.. మెక్రాన్ చెంపకు విసురుగా తగిలింది. దీనికి ఆయన ఎంతో ఇబ్బందికరంగా రియాక్షన్ ఇవ్వడంతో అది చెంపదెబ్బే అని రూఢీ అయింది. అయితే.. వెంటనే తేరుకున్న మెక్రాన్, ముఖంలో నవ్వు పులుముకొని కింద తన కోసం వేచి ఉన్నవారివైపు చేతిని ఊపారు. తర్వాత ఆయన కిందకు దిగుతున్న క్రమంలో భార్య చేతిలో చేయి వేసేందుకు ప్రయత్నించగా ఆమె తిరస్కరించింది. ఈ వీడియోపై స్పందించేందుకు మెక్రాన్ కార్యాలయం తొలుత నిరాకరించినా, తర్వాత దీన్ని ఆ దంపతుల మధ్య 'ఆటవిడుపు చర్య'గా పేర్కొంటూ తీవ్రతను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేసింది. ఈ ఘటనపై మెక్రాన్ కూడా స్పందించారు. "మేం కేవలం పరాచకాలాడుకున్నాం అంతే" అని చెప్పారు.

లోకం తీరు



దాడి తర్వాతే పాకిస్థాన్‌కు సమాచారం

పాక్ అభ్యర్థన మేరకే ఆపరేషన్ సిందూర్ ఆపేశాం: విదేశాంగ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ, మే 26: ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఉగ్రస్థావరాలపై భారత్ జరిపిన దాడి గురించి పాకిస్థాన్‌కు ముందుగా తెలియజేయలేదని, దాడులు పూర్తయ్యాకే ఆ దేశానికి సమాచారం అందించామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. దాడుల అనంతరం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేశాకే పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు ఈ విషయం తెలియజేశామని ఆయన పార్లమెంటరీ సలహా కమిటీకి వెల్లడించారు. మంత్రి జైశంకర్ అధ్యక్షతన సోమవారం విదేశాంగ శాఖకు చెందిన పార్లమెంటరీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ.. ఉగ్రస్థావరాలపై దాడులకు ముందే పాకిస్థాన్‌కు సమాచారం అందించారంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని అన్నట్టు తెలిసింది. దాడుల విషయాన్ని ముందుగానే ఇస్లామాబాద్‌కు తెలియజేయాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గతంలో విమర్శించిన సంగతి తెలిసిందే. కాగా, ఆపరేషన్ సిందూర్ నిలిపివేత, అమెరికా జోక్యం గురించి సమావేశంలో ఎంపీలు అడిగిన అనేక ప్రశ్నలకు జైశంకర్ సమాధానమిచ్చారు. పాకిస్థాన్ వైపు నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయాలని ద్వైపాక్షికంగా నిర్ణయం తీసుకున్నామని జైశంకర్ ఎంపీలకు స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసేలా చూడాలని పాకిస్థాన్ అమెరికా సాయం కోరిందని, అయితే.. నేరుగా భారత్‌తో మాట్లాడుకోవాలని అమెరికా వారికి స్పష్టం చేసిందని తెలిపారు. మరోవైపు పాక్‌తో మాట్లాడాలని అమెరికా కూడా తమను కోరిందని తెలిపారు.

పాకిస్థాన్.. బాధిత దేశం కాదు
ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న దేశం: ఒవైసీ



న్యూఢిల్లీ, మే 26: పాకిస్థాన్ ఉగ్రవాద బాధిత దేశం కాదని, ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న దేశమని మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బీజేపీ ఎంపీ బిజయంత్ పాండా నేతృత్వంలోని అఖిలపక్ష బృందం ప్రస్తుతం బహ్రెయిన్‌లో పర్యటిస్తోంది. ఈ బృందంలో ఒవైసీ, గులాం నబీ ఆజాద్, నిశికాంత్ దూబే తదితరలు సభ్యులుగా ఉన్నారు. ఆదివారం ఒవైసీ బహ్రెయిన్‌లో ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడారు. ఉగ్రవాదంపై పాక్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై బహ్రెయిన్‌కు పూర్తి సమాచారం ఇచ్చామన్నారు. ముంబై, పుల్వామా, పఠాన్‌కోట్ దాడుల గురించి చెప్పామని, వీటన్నింటిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని తెలిపారు. పాకిస్థాన్‌ను తిరిగి ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్చేలా మద్దతు ఇవ్వాలని బహ్రెయిన్, ఇతర మిడిల్ ఈస్ట్ దేశాలను కోరినట్లు ఒవైసీ చెప్పారు. మరోవైపు, పాకిస్థాన్‌లో ఉన్నంత మంది ఉగ్రవాదులు ప్రపంచం మొత్తమ్మీద కూడా లేరని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం గులాం నబీ ఆజాద్ అన్నారు. "వివిధ పార్టీలకు చెందిన నేతలమంతా ఉగ్రవాదంపై పోరులో ఇప్పుడు ఒకటిగా, భారతీయులుగా బహ్రెయిన్ వచ్చాం" అని ఆయన తెలిపారు. బహ్రెయిన్‌లో అన్ని మతాల వాళ్లు ఉన్నారని, బహ్రెయిన్ తనకు మినీ ఇండియాలా అనిపిస్తోందన్నారు.



జ్యోతి మల్హోత్రా చుట్టూ ఆరుగురు గన్‌మెన్

» పాకిస్థాన్ పర్యటనలో అసాధారణ భద్రత

న్యూఢిల్లీ, మే 26: గూఢచర్యం కేసులో అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా(33) పాకిస్థాన్ పర్యటనలో ఉన్నప్పటి మరో వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లాహోర్‌లోని అనార్కలీ బజార్‌లో ఆమె పర్యటించినపుడు చుట్టూ ఆరుగురు సాయుధులు భద్రతగా ఉన్నారు. స్కాట్లాండ్ యూట్యూబర్ కాలమ్ మిల్ తీసిన ఈ వీడియో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. జ్యోతి మల్హోత్రా లాహోర్‌కు వెళ్లిన సమయంలో మిల్ కూడా అక్కడే ఉన్నాడు. అనార్కలీ బజార్‌లో జ్యోతి వీడియో తీస్తుండగా.. మిల్ తీసిన వీడియోలో ఆమె కనిపించారు. ఈ సందర్భంగా జ్యోతిని మిల్ పలకరించాడు. తాను భారతీయురాలినని జ్యోతి పరిచయం చేసుకుంది. పాకిస్థాన్‌కు రావడం ఇదే తొలిసారా? అని జ్యోతి ప్రశ్నించగా.. ఐదు సార్లు వచ్చానని మిల్ చెప్పాడు. పాక్‌లో ఆతిథ్యం బాగుందా? అని మిల్ అడగగా.. చాలా బాగుందని జ్యోతి చెప్పింది. ఆమె చుట్టూ అందరూ యువకులే తుపాకులు పట్టుకుని భద్రతగా ఉండటంతో ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'చూడండి.. ఆమె చుట్టూ ఆరుగురు గన్‌మెన్ ఉన్నారు. ఇంత భారీ భద్రత ఉండటం చూస్తే.. ఈ ప్రాంతం సురక్షితం కాదు' అని వ్యాఖ్యానించాడు. మిల్ ఈ వీడియోను తన చానల్‌లో పోస్టు చేశాడు. పాక్ పర్యటనలో జ్యోతికి అసాధారణ భద్రత కల్పించడంపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మైన్‌స్వీపర్ల నిర్మాణానికి రూ.44 వేల కోట్లు!

» చైనా దూకుడుతో భారత నేవీ అప్రమత్తం

న్యూఢిల్లీ, మే 26: శత్రు దేశాలు నీటి లోపల పెట్టే మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేయగలిగే అడ్వాన్స్‌డ్ మైన్ స్వీపర్లను భారత్ తయారు చేయనుంది. నేవీ కోసం దేశీయంగా వీటిని నిర్మించే యోచన చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. మొత్తం 44 వేల కోట్ల రూపాయలతో 12 అడ్వాన్స్‌డ్ మైన్ స్వీపర్లను నిర్మించేందుకు రక్షణ ఉత్పత్తుల సేకరణ మండలి అనుమతిచ్చే అవకాశాలున్నాయి. అనుమతి లభించాక ఇవి నేవీకి అందుబాటులోకి రావడానికి 7 నుంచి 8 ఏళ్లు పట్టే అవకాశం ఉంది. భారత్‌లో 7,516 కిలోమీటర్ల తీర ప్రాంతంతో పాటు 200 చిన్న, 13 పెద్ద నౌకాశ్రయాలు ఉన్నా ఇప్పటివరకూ ఈ తరహా మైన్ స్వీపర్లు అందుబాటులో లేవు. పైగా సముద్ర జలాల్లో చైనా దూకుడుగా ఉంది. ఈ తరుణంలో మైన్ స్వీపర్లను సమకూర్చుకోవడం భారత నేవీకి కీలకంగా మారింది.

పాక్ గూఢచారిగా మారిన సీఆర్‌పీఎఫ్ జవాన్

న్యూఢిల్లీ, మే 26: దేశానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నాడన్న ఆరోపణలతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్‌ను అరెస్టు చేసింది. మోతీ రామ్ జాట్ అనే సీఆర్‌పీఎఫ్ జవాన్ 2023 నుంచి పాకిస్థాన్ నిఘా అధికారులకు జాతీయ భద్రతకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం అతడు వివిధ మార్గాల ద్వారా వారి నుంచి డబ్బులు కూడా తీసుకున్నాడని వెల్లడించారు. మోతీ రామ్‌ను ఢిల్లీలో అరెస్టు చేసిన ఎన్ఐఏ అధికారులు అక్కడి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి జూన్ 6 వరకు ఎన్ఐఏ కస్టడీ విధించింది. సీఆర్‌పీఎఫ్ కూడా అతడిని విధుల నుంచి తొలగించింది. కేంద్ర సంస్థల సమన్వయంతో, మోతీ రామ్ సోషల్ మీడియా కార్యకలాపాలను పరిశీలిస్తుండగా ఈ వ్యవహారం బయటపడిందని సీఆర్‌పీఎఫ్ తెలిపింది.

దేశవ్యాప్తంగా వెయ్యి దాటిన కరోనా కేసులు

న్యూఢిల్లీ, విశాఖపట్నం, మే 26: దేశవ్యాప్తంగా కొవిడ్-19 కేసులు పెరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో గతవారం 99 కేసులతోపాటు మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య వంద దాటింది. దేశవ్యాప్తంగా గత వారం 752 కొత్త కేసులతోపాటు మొత్తం కొవిడ్ పాజిటివ్ కేసులు 1,009 దాటాయని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. మహమ్మారి బారిన పడ్డ పడిన మరణించిన వారి సంఖ్య ఏడుగురికి చేరుకున్నది. ఇక కొవిడ్-19 చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరిన వారిలో 354 మంది డిశ్చార్జ య్యారు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో కొత్త కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కొత్తగా నమోదవుతున్న కేసుల్లో అత్యధికం ఎన్‌బి.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్‌వే అని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ సార్స్-కోవ్-2 జెనోమిక్స్ కన్సార్టియం (ఐఎన్ఎస్ఏసీవోజీ) తెలిపింది. ఎన్‌బి.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లు అంత ప్రమాదకరం కాదని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. కాగా, విశాఖపట్నం నగర పరిధిలోని గోపాలపట్నం 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలోని హౌస్ సర్జన్‌కు కరోనా వచ్చినట్టు తెలిసింది. హోమ్ క్వారంటైన్‌లో ఆమె ఉన్నట్టు సమాచారం.

పీఎం అప్రెంటిస్ శిక్షణార్థులకు స్టైపెండ్ పెంపు

న్యూఢిల్లీ, మే 26: కేంద్ర ప్రభుత్వం రెండు పథకాల కింద శిక్షణార్థులకు నెలవారీ ఇచ్చే కనీస స్టైపెండ్‌ను పెంచాలని నిర్ణయించింది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌధరి నేతృత్వంలోని కేంద్ర అప్రెంటిస్‌షిప్ మండలి (సీఏసీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. శిక్షణార్థులకు ఇప్పుడు ఇస్తున్న రూ.5,000 నుంచి రూ.9,000 స్టైపెండ్‌ను రూ.6,800 నుంచి రూ.12,300కు పెంచాలని నిర్ణయించారు.

ఉగ్రవాదం అంతానికి పాక్ ప్రజలు ముందుకు రావాలి

లేదంటే మా సైన్యం ఆగ్రహానికి గురికాక తప్పదు.. ఉగ్ర దాడి జరిగితే మోదీ మౌనంగా ఉంటాడా?

» మా చెల్లెళ్ల బొట్టు చెరిపేవారిని అంతమొందించి తీరతాం: మోదీ



దాహోద్/భుజ్, మే 26: ఉగ్రవాదం అంతానికి పాక్ ప్రజలు ముందుకు రావాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. వారి ప్రభుత్వం, ఆర్మీ తమ స్వార్థం కోసమే టెర్రరిజానికి మద్దతిస్తున్నాయని తెలిపారు. శాంతిమార్గం ఎంచుకోకపోతే వారు భారత సైన్యం ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధిలో భారత్ ముందంజలో ఉంటే.. దానిపై విద్వేషం పెంచడం.. కీడు చేయడమే పాకిస్థాన్ ఏకైక లక్ష్యంగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. పహల్గాంలో అమాయక టెర్రరిస్టులపై ఉగ్రవాదులు దాడిచేస్తే ఇండియా, మోదీ మౌనంగా ఎలా కూర్చుంటారని ప్రశ్నించారు. మన అక్కచెల్లెళ్ల నుదుట బొట్టు చెరిపే సాహసం ఎవరు చేసినా వారిని అంతం చేసి తీరతామని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం గుజరాత్ వచ్చిన ఆయన తొలి రోజు సోమవారం వడోదరాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబ సభ్యులు కూడా దీనికి హాజరయ్యారు. అనంతరం దాహోద్, భుజ్‌లో జరిగిన బహిరంగ సభల్లో ప్రధాని మాట్లాడారు. టెర్రరిజాన్ని పాక్ టూరిజంగా భావిస్తోందన్నారు. ఇది ప్రపంచానికే ప్రమాదమని చెప్పారు. 'పాక్ ప్రజలను ఒకటి అడుగదలచుకున్నాను. ఇన్నేళ్లలో మీరు ఏం సాధించారు? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినవారు మీ జీవితాలను నాశనం చేశారు. ఉగ్రవాదం మీ ప్రభుత్వానికి, సైన్యానికి సంపాదన మార్గం. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి మీరే ముందుకు రావాలి' అన్నారు. ఇదిలా ఉండగా, భారతీయ పండుగల సందర్భంగా విదేశాల్లో తయారైన టపాసులు, గణేశ ప్రతిమలు కొనడంపై ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి దిగుమతి వస్తువులను కొనడం ఆపాలని మీరు యోచించరా అని ప్రజలను ప్రశ్నించారు. దేశ ప్రగతి కోసం దేశీయంగా తయారయ్యేవాటినే కొంటామని అందరూ సంకల్పం తీసుకోవాలని పిలుపిచ్చారు. దాహోద్‌లో రూ.24 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.

మహిళా సాధికారతకు మోదీ ఎంతో చేశారు: సోఫియా సోదరి

ఎయిర్‌పోర్టు నుంచి వైమానిక దళ కేంద్రం వరకు కిలోమీటరు వరకు మోదీ రోడ్‌షో సాగింది. కల్నల్ సోఫియా ఖురేషీ స్వస్థలం వడోదరా అన్న సంగతి తెలిసిందే. రోడ్‌షోకు ఆమె తల్లిదండ్రులు, కవల సోదరి షైనా ఖురేషీ, సోదరుడు మొహమ్మద్ సంజయ్ ఖురేషీ కూడా హాజరయ్యారు. షైనా ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానిని కలవడం సంతోషంగా ఉందన్నారు. మహిళల సాధికారతకు ఆయన ఎంతో చేశారని కొనియాడారు.

దేశంలో తొలి 'బాహుబలి' విద్యుత్ ఇంజన్‌కు పచ్చజెండా

సీమెన్స్ కంపెనీ నిర్మించిన దేశంలోనే అత్యంత శక్తివంతమైన 9000 హార్స్‌పవర్ విద్యుత్ ఇంజన్‌కు ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించారు. దేశంలో రైల్వే ద్వారా వస్తు రవాణాను ప్రస్తుతం ఉన్న 27% నుంచి 45 శాతానికి పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఇది కీలకంగా నిలుస్తుంది. దేశంలో ఇంత భారీ సామర్థ్యం గల విద్యుత్ లోకోమోటివ్‌ను తయారుచేయడం ఇదే ప్రథమం. రైల్వే శాఖ నుంచి ఇలాంటి 1200 లోకోమోటివ్‌ల డిజైన్, తయారీ, నిర్వహణకు సంబంధించి లభించిన ఆర్డర్‌కు అనుగుణంగా దహోడ్‌లోని ఫ్యాక్టరీలో సీమెన్స్ దీన్ని నిర్మించింది. గంటకి 120 కిలోమీటర్ల వేగంతో 5800 టన్నుల బరువును సునాయాసంగా తరలించ గల సామర్థ్యం ఈ ఇంజన్‌కు ఉంది.

జస్టిస్ వర్మపై దర్యాప్తు నివేదికల వెల్లడికి సుప్రీంకోర్టు నిరాకరణ

» రహస్య పత్రాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 26: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లభించిన నగదుకు సంబంధించిన దర్యాప్తు నివేదికలను బయటపెట్టేందుకు సుప్రీంకోర్టు పరిపాలన విభాగం తిరస్కరించింది. సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత దర్యాప్తు కమిటీ జస్టిస్ యశ్వంత్ వర్మను తప్పుపడుతూ ఇచ్చిన నివేదిక, ఆయనను అభిశంసించి పదవి నుంచి తొలగించాలని కోరుతూ అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా..రాష్ట్రపతి, ప్రధానికి రాసిన లేఖలను సమాచార హక్కు చట్టం కింద ఇచ్చేందుకు నిరాకరించింది. ఇవన్నీ రహస్య పత్రాలని, బయటవారికి వెల్లడిస్తే పార్లమెంటు హక్కులకు భంగం కలుగుతుందని పేర్కొంది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో మార్చి 14వ తేదీ రాత్రి ఆయన నివాసంలో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షల రూపాయల నగదు లభించినట్టు వార్తలు వచ్చాయి. దీనిపై ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ్ ప్రాథమికంగా విచారణ జరిపారు. అనంతరం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులుగల అంతర్గత కమిటీ విచారణ జరిపింది. ఈ నెల మూడో తేదీన నివేదిక సమర్పించింది. జస్టిస్ వర్మ తీరును తప్పుపట్టింది. నగదు తీసుకున్నట్టు నిర్ధారించింది. ఈ నివేదిక వివరాలన్నింటినీ ఇవ్వాలని సమాచార హక్కు కార్యకర్త కోరగా సుప్రీంకోర్టు నిరాకరించింది.

సుప్రీంకోర్టు జడ్జిలుగా ముగ్గురి పేర్లు సిఫార్సు

జస్టిస్ అంజారియా, జస్టిస్ విజయ్, జస్టిస్ చందూర్కర్‌లకు పదోన్నతి



జస్టిస్ అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ చందూర్కర్

» సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదన

న్యూఢిల్లీ, మే 26: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, మరో హైకోర్టు జడ్జికి పదోన్నతులు కల్పించాలని కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ అధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల కొలీజియం సోమవారం ఇక్కడ భేటీ అయి ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. కర్ణాటక హైకోర్టు సీజే జస్టిస్ అంజారియా, గువాహటి హైకోర్టు సీజే జస్టిస్ విజయ్‌బిష్ణోయ్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చందూర్కర్‌లను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని ప్రతిపాదించింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌ల పదవీ విరమణ కారణంగా ఏర్పడిన ఖాళీల్లో వీరిని భర్తీ చేయనున్నారు.

జస్టిస్ అంజారియా స్వస్థలం అహ్మదాబాద్

కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంజారియా 1965లో అహ్మదాబాద్‌లో జన్మించారు. 1989లో అక్కడి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి మాస్టర్ డిగ్రీ పొందిన ఆయన తొలుత గుజరాత్ హైకోర్టులో తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2024 ఫిబ్రవరి 25 నుంచి కర్ణాటక హైకోర్టు సీజేగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

జస్టిస్ విజయ్‌ది రాజస్థాన్

గువాహటి హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ది రాజస్థాన్. 1964లో జన్మించిన ఆయన 1989లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 2013లో రాజస్థాన్ హైకోర్టులో తాత్కాలిక జడ్జిగా, 2015లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2024 ఫిబ్రవరి 5 నుంచి గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు.

చందూర్కర్ నాగ్‌పూర్ నుంచి ఢిల్లీకి...

1965లో జన్మించిన జస్టిస్ చందూర్కర్ 1988లో న్యాయవాదిగా చేరారు. 1992 నుంచి నాగ్‌పూర్‌లో స్థిరపడి అక్కడ పలు కోర్టుల్లో వాదనలు వినిపించారు. 2013లో బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా, అనంతరం శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

ఐదు హైకోర్టులకు కొత్త సీజేలు

మరో అయిదు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది. మధ్యప్రదేశ్, కర్ణాటక, గువాహటి, పట్నా, ఝార్ఖండ్ హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు రానున్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాను అదే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ విభు బఖ్రును కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించాలని ప్రతిపాదించింది. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అశుతోష్ కుమార్‌ను గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సూచించింది. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ విపుల్ మనుబాయ్ పంచోలీని అదే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. హిమాచల్ హైకోర్టు జడ్జి జస్టిస్ తార్లోక్ సింగ్ చౌహాన్‌ను ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని ప్రతిపాదించింది.

భారతీయ నర్సుల విదేశీ బాట!

» అధిక వేతనాల కోసం ఇతర దేశాలకు వెళ్తున్న హెల్త్‌కేర్ నిపుణులు



న్యూఢిల్లీ, మే 26: ప్రపంచవ్యాప్తంగా హెల్త్‌కేర్ నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సిఫారసుల ప్రకారం ప్రతి వెయ్యి మంది ప్రజలకు ముగ్గురు నర్సులు ఉండాలని చెబుతుంటే.. భారత్‌లో మాత్రం కేవలం 1.96 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న హెల్త్‌కేర్ నిపుణుల కొరతను ఉపయోగించుకుంటూ.. భారత్‌లోని నర్సులు అధిక జీతం, మెరుగైన పని పరిస్థితులను కోరుకుంటూ విదేశాల బాట పడుతున్నారు. ఈ సంఖ్య ఇటీవలి కాలంలో ఎక్కువగా ఉంది. జర్మనీ, ఐర్లాండ్, మాల్టా, యూఏఈ, బెల్జియం వంటి దేశాలకు వెళ్తున్నారు. ఆయా దేశాలు పోటీపడి మరీ అధిక వేతనాలు, ఇతర అదనపు ప్రయోజనాలను ఆఫర్ చేస్తూ వారిని నియమించుకుంటున్నాయి. 'బోర్డర్‌ప్లస్' అనే వర్క్‌ఫోర్స్ మొబిలిటీ సంస్థ డాటా ప్రకారం.. జర్మనీలో కొత్తగా నియామకమైన ఒక నర్సు నెలకు 2,700 యూరోల (సుమారు రూ.2.6 లక్షలు) జీతాన్ని ఆశించవచ్చు. లైసెన్స్ పొందిన తర్వాత రూ.3.2 లక్షల వరకు పోయే అవకాశం ఉంది. అదే భారత్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే నర్సులకు వేతనం రూ.20 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉంటుంది. ఐర్లాండ్ రూ.1.7 లక్షలు-రూ.2.5 లక్షల వేతనాన్ని ఆఫర్ చేస్తోంది. యూఏఈలో ప్రారంభ వేతనం రూ.75 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఉంది. దీంతో పాటు ఆదాయం పన్ను రాయితీ, ఇతర ప్రయోజనాలను కల్పిస్తోంది.

విదేశాల్లో భారతీయ నర్సులకు డిమాండ్

మెరుగైన వైద్య నైపుణ్యాలు, ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యం, ఎక్కడికైనా వెళ్లేందుకు సమ్మతి వంటి అంశాలతో భారతీయ నర్సులకు ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. క్రిటికల్ కేర్, జెరియాట్రిక్స్ (వృద్ధుల ఆరోగ్య సంరక్షణ), ప్రినేటల్ (ప్రసవానికి ముందు) సేవల్లో మనవాళ్లకు అధిక డిమాండ్ ఉంది. అయితే, నర్సులు విదేశాలకు వెళ్లడం దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికే భారత్‌లో డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన నర్సుల సంఖ్య కంటే చాలా తక్కువగా ఉన్నారు. నర్సుల వలసలు ఈ కొరతను మరింత పెంచుతాయి. ఈ నేపథ్యంలో నర్సింగ్ నైపుణ్యాన్ని దేశంలోనే నిలుపుకోవడానికి దేశీయంగా పని పరిస్థితులను మెరుగుపరచడం, పోటీ వేతనాలు ఆఫర్ చేయడం, శిక్షణా సదుపాయాలను విస్తరించడం వంటి చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ముంబైపై కుంభవృష్టి

(మొదటి పేజీ తరువాయి)



గత 107 ఏళ్లలోనే రికార్డు. ఇంతకు ముందు 1918లో ముంబైలో 279.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. దానికంటే ఎక్కువ వర్షపాతం నమోదవటం ఇదే తొలిసారి. సాధారణ వానలు కురిస్తేనే తడిసిముద్దయ్యే నగరం.. ఈ కుంభవృష్టితో నీట మునిగింది. పలు రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫాంలు నీటిలో మునిగిపోయి ఉండటం, ఎస్కలేటర్ల పైనుంచి వరద కిందికి పడటం వంటి దృశ్యాలతో కూడిన వీడియోలు పరిస్థితికి అద్దం పట్టాయి. పలుచోట్ల సబర్బన్ రైలు సర్వీసులను, మెట్రో రైళ్లను, బస్సులను అధికారులు నిలిపివేశారు. కొన్ని చోట్ల సర్వీసులను దారి మళ్లించి నడిపారు. రోడ్ల మీద చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ముంబైతోపాటు మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాల్లోనూ భారీగా వానలు కురిశాయి. ఇందాపూర్ సమీపంలో పుణె-సోలాపూర్ జాతీయ రహదారి నీట మునిగి ట్రాఫిక్ నిలిచిపోయింది. అధికారులు, సిబ్బంది నీటిని తోడివేయటంతో రెండు గంటల అనంతరం వాహనాల రాకపోకలు తిరిగి మొదలయ్యాయి. వర్షబీభత్స ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయకచర్యలు చేపట్టాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. రాయ్‌గఢ్ జిల్లాలో పిడుగు పడిన ఘటనలో ఒక వ్యక్తి మరణించారు. భారీవర్షాల నేపథ్యంలో ముంబైతోపాటు థానె, రాయ్‌గఢ్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

కేరళ, కర్ణాటకల్లోనూ జోరు వానలు

రుతుపవనాల ప్రభావంతో కేరళ, కర్ణాటకల్లోనూ భారీ వర్షాలు పడ్డాయి. కేరళలోని త్రిసూర్, వయనాడ్, పాలక్కాడ్, కొజికోడ్ జిల్లాలపై వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. నదులు ఉప్పొంగుతుండటంతో సమీపప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కర్ణాటక తీరప్రాంతంలో సోమవారం కూడా వానలు భారీగా కురిశాయి. సులియా జిల్లాలోని బెల్లారెలో 200.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక తీరప్రాంతానికి జారీ అయిన రెడ్ అలర్ట్ మరో 5రోజులు అమలులో ఉంటుంది.


ఘాట్‌రోడ్డు పిట్టగోడపై పరుగులు తీస్తున్న చిరుత

తిరుమల మొదటి ఘాట్‌లో చిరుత కలకలం

- రోడ్డు పిట్టగోడపై పరుగులు
- భయబ్రాంతులకు గురైన వాహనదారులు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో సోమవారం రాత్రి చిరుత సంచారం కలకలం సృష్టించింది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని వినాయక స్వామి ఆలయానికి సమీపంలో ఓ చిరుత రోడ్డుపక్కనే ఉన్న పిట్టగోడపై బైఠాయించింది. కార్లు శబ్దం చేస్తూ వస్తున్న క్రమంలో చిరుత పిట్టగోడపై పరుగులు తీసింది. కొంతదూరం పరుగులు తీశాక లోయలోకి దూకింది. దీంతో చిరుతను చూసిన వాహనదారులు హడలిపోయారు. అలిపిరి చెక్ పాయింట్‌లోని భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఫారెస్ట్ సిబ్బందితో కలిసి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే చిరుత అడవిలోకి వెళ్లిపోయింది. అయినప్పటికీ తిరిగి వచ్చే అవకాశముందనే అంచనాతో భారీ శబ్దాలు చేశారు. అలాగే ద్విచక్రవాహనదారులను అప్రమత్తం చేసి పంపారు. ఆదివారం రాత్రి అలిపిరి కాలినడకమార్గంలోని 350వ మెట్టు వద్ద కూడా ఓ చిరుత సంచరించిన విషయం తెలిసిందే.

టీటీడీ సొంత చాట్‌బాట్

- చాట్ జీపీటీ తరహాలో రూపకల్పనకు ఐటీ విభాగం కసరత్తు
- జియో, టీసీఎస్ ప్రతినిధులతో కమిటీ

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత చాట్ జీపీటీ తరహాలో 'చాట్‌బాట్'ను రూపొందించే పనికి టీటీడీ శ్రీకారం చుట్టింది. టీటీడీ పరిధిలోని ఏ సమాచారాన్నయినా భక్తులు సులువుగా, సంక్షిప్తంగా, అత్యంత వేగంగా తెలుసుకునేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. భక్తులు ఏ భాషలో అడిగినా, కోరిన సమాచారం క్షణాల్లో అందేలా దీన్ని రూపొందిస్తారు. టైపింగ్ తోనే కాకుండా వాయిస్ కమాండ్‌తో కూడా సమాచారాన్ని పొందవచ్చు. అలాగే దర్శనం, ఆర్జితసేవలు, గదులు, కల్యాణ వేదిక, ప్రసాదాల బుకింగ్, విరాళాలు చెల్లింపులు, వివిధ రకాల పేమెంట్లు వంటి సౌకర్యాలు కూడా ఈ చాట్‌బాట్ ద్వారా లింక్స్ రూపంలో పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు సూచనలతో టీటీడీ ఐటీ విభాగం ఇప్పటికే ఇందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. టీటీడీ చాట్‌బాట్ రూపకల్పన కోసం ఐటీ విభాగం జీఎం, డీజీఎంలతో పాటు జియో, టీసీఎస్ ప్రతినిధులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' పేరుతో దాదాపు పది సంస్థలు ఇచ్చిన డెమోలను ఈ బృందం పరిశీలించింది. మరికొన్ని సంస్థల డెమోలను కూడా పరిశీలించిన తర్వాత తుది రూపంతో కూడిన నివేదికను బృందం సమర్పిస్తుంది. అనంతరం ఈసేవలను అందించే సంస్థలనుంచి టెండర్లకు ఆహ్వానిస్తారు.


జస్టిస్ టీసీడీ శేఖర్

శ్రీవారి సేవలో జస్టిస్ టీసీడీ శేఖర్

తిరుమల, మే26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ దర్శించుకున్నారు. న్యాయమూర్తికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, కర్ణాటక లోకాయుక్తా జస్టిస్ బీఎస్ పాటిల్ కూడా శ్రీవారిని సోమవారం దర్శించుకున్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.11 లక్షల విరాళం



తిరుమల, మే26(ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్టులకు సోమవారం రూ.11 లక్షలు విరాళంగా అందింది. ఇందులో రూ.10 లక్షలు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు, రూ.లక్ష ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు వినియోగించాలని అమెరికాలో నివాసముంటున్న ఎన్‌ఆర్‌ఐలు వేదాల రంగనాథ్, కృష్ణకుమారి దంపతులు కోరారు. విరాళాన్ని తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి: ఆప్టా

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్ రావు కోరారు. దీనిపై మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులకు సోమవారం లేఖలు రాశారు. వంద వరకు ఆప్షన్స్ పెట్టుకోవాల్సి ఉంటే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ బాగుంటుందని, కానీ ఎస్జీటీలు ప్రతి జిల్లాలో వేల సంఖ్యలో ఆప్షన్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక్కో టీచర్ 2 నుంచి 3వేల ఆప్షన్లు పెట్టుకోవడం ఆన్‌లైన్‌లో సాధ్యం కాదన్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్‌లో అయితే ప్రత్యక్షంగా ఖాళీలను ఎంపిక చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు

తెలుగు ప్రజలు పోరాటం చేయాలి

- బీవీ రాఘవులు



విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ముందస్తు పథకం ప్రకారమే విశాఖ స్టీల్ ప్లాంటు కార్మికులను తొలగిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంటులో మూడు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, తక్షణం వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ డిమాండ్‌ల సాధనకు సమ్మెకు దిగితే, యాజమాన్యంతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఉద్యోగం నుంచి తొలగించినవారికి ఎలాంటి పరిహారం అందజేయకపోవడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కాంట్రాక్టు కార్మికుల్లో నిర్వాసితులు కూడా ఉన్నారని, వారిని రోడ్డునపడేయడం అన్యాయమన్నారు. అనకాపల్లి జిల్లాను స్టీల్‌హబ్‌గా తయారుచేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెబుతున్నారని, కానీ విశాఖలో ఉన్న స్టీల్‌ప్లాంటును నాశనం చేయడం ఎంతవరకు న్యాయమని రాఘవులు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా ప్రైవేటుకు అప్పగించే వ్యూహం కేంద్రప్రభుత్వం అమలుచేస్తోందని ఆరోపించారు. స్టీల్ ప్లాంటు భూములను కూడా ప్రైవేటుకు ఇచ్చే ఉద్దేశం కనిపిస్తున్నందున దానిని అడ్డుకోవడంతోపాటు కర్మాగారానికి సొంత గనులు కేటాయించేలా తెలుగు ప్రజలంతా పోరాటం చేయాలన్నారు.

రాష్ట్రంలోకి 'నైరుతి'

- సీమలో ప్రవేశం.. కావలి వరకూ విస్తరణ

విశాఖపట్నం, అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నెల 13న అండమాన్‌కు వచ్చిన రుతుపవనాలు 24న కేరళను తాకాయి. అనూహ్యంగా సోమవారమే రాయలసీమ ప్రాంతంలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అంచనాలకు భిన్నంగా 10 రోజుల ముందే తొలకరి పలకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రుతుపవనాలు సీమలో ఎక్కువ ప్రాంతాలు, దక్షిణ కోస్తాలో కావలి వరకూ విస్తరించాయి. సాధారణంగా జూన్ ఐదో తేదీ నాటికి రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉంది. అయితే ఈ ఏడాది అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో అనుకూల వాతావరణం నెలకొనడంతో పది రోజుల ముందుగానే వచ్చాయి. గత ఏడాది జూన్ రెండో తేదీన రాయలసీమ, దక్షిణ కోస్తాల్లోకి రుతుపవనాలు ప్రవేశించాయి. సోమవారం అరేబియా సముద్రంలో అనేక ప్రాంతాలు, కర్ణాటకలో బెంగళూరు, మహారాష్ట్రలో ముంబై వరకూ, తమిళనాడులో మిగిలిన భాగం, తెలంగాణలో కొద్ది ప్రాంతం, బంగాళాఖాతంలో అనేక ప్రాంతాలు, ఈశాన్య భారతంలో త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. రానున్న మూడు రోజుల్లో అరేబియా సముద్రం, కర్ణాటకలో మిగిలిన ప్రాంతం, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీలో కొన్ని ప్రాంతాలు, బంగాళాఖాతం, ఈశాన్య భారతంలో మిగిలిన ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్ వరకూ రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా మే చివరి వారంలో రోహిణి కార్తె ప్రారంభమై జూన్ తొలి వారం వరకూ కొనసాగుతుంది. ఆ సమయంలో గాడ్పుల ప్రభావం, వర్షాలు లేకపోవడంతో పంటలపై ప్రభావం చూపిన సందర్భాలున్నాయి. రుతుపవనాలు ఆలస్యమైతే మెట్ట పంటల సాగు, వరి నారుమడులు పోసుకోవడంలో జాప్యం, మరోవైపు వడగాడ్పుల తీవ్రత కొనసాగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా మే లో రాష్ట్రంలో రోజు ఎక్కడో ఒకచోట వర్షం కురుస్తుండడం, చివరి వారం రుతుపవనాలు రావడంతో ఖరీఫ్ పంటలు వేగంగా సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందని వాతావరణ నిపుణులు వ్యాఖ్యానించారు.

రానున్న మూడు రోజులూ వర్షాలే!

మధ్య మహారాష్ట్ర, కర్ణాటక పరిసరాల్లో భూ ఉపరితలంపై ఉన్న తీవ్ర అల్పపీడనం సోమవారానికి అల్పపీడనంగా బలహీనపడి మరట్వాడా పరిసరాల్లో కొనసాగుతోంది. ఇది మరింత బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా మారి తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా పశ్చిమ బంగాళాఖాతంలో ప్రవేశించనుంది. దీని ప్రభావంతో మంగళ లేదా బుధవారం పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అది ఒడిశా తీరానికి ఆనుకుని ఉత్తర వాయువ్యంగా తర్వాత ఉత్తరంగా పయనిస్తుందని, ఈ ప్రభావంతో రుతుపవనాలు ఉత్తర కోస్తా, ఒడిశా మీదుగా తూర్పు భారతం వరకూ విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇంకా తూర్పు మధ్య అరేబియా సముద్రం నుంచి కొంకణ్, మరట్వాడా, తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న మూడు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. తెలిపింది. కోస్తా తీరం వెంబడి 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

ముందుగానే నైరుతి శుభపరిణామం

- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని సీఎం చంద్రబాబు సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'చాలా ఏళ్ల తర్వాత మే నెలలోనే రాష్ట్రానికి నైరుతి పలకరింపు శుభ పరిణామం. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ అంచనాలు నిజం కావాలని.. రైతులకు, రాష్ట్రానికి మేలు జరగాలని కోరుకుంటున్నాను. వ్యవసాయాధారిత రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే రైతన్న బాగుంటాడు. అన్నదాత సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది' అని సీఎం పేర్కొన్నారు.

నాలుగు రోజుల్లో శ్రీవారిని దర్శించుకున్న

3.28 లక్షల మంది భక్తులు



తిరుమల, మే26(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తున్న క్రమంలో తిరుమల శ్రీవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు. గురు, శుక్ర, శని, ఆదివారాల్లో 3,28,702 మంది భక్తులు శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. ప్రత్యేకించి శనివారం 90,211 మంది, ఆదివారం 91,538 మంది రికార్డుస్థాయిలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక, ఈ నాలుగురోజుల్లో 10.98 లక్షల మంది అన్నప్రసాదాలు స్వీకరించగా, 4.55 లక్షల మందికి టీ, కాఫీ, పాలు, మజ్జిగ అందజేశారు. 1.52 లక్షల మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్షకు 53,124 మంది హాజరు

జేఎన్టీయూకే, మే 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీ ఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగం ఆన్‌లైన్ పరీక్షలు సోమవారం కొనసాగాయి. ఏపీ, హైదరాబాద్‌ల్లోని 145 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఈఏపీసెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఉదయం సెషన్‌లో 28,071 మంది విద్యార్థులకు 26,436 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం 28,163 మంది విద్యార్థులకు 26,688 మంది హాజరయ్యారని తెలిపారు. 94.47 శాతం హాజరు నమోదైంది.

విద్యుత్తు సేవలపై ప్రజల్లో సంతృప్తి పెరగాలి

- డిస్కమ్‌ల సీఎండీలతో సమీక్షలో సీఎస్

అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ అన్నారు. సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరించడం లేదన్న ఫిర్యాదులపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్టీజీఎస్) కార్యాలయంలో డిస్కమ్‌ల సీఎండీలతో వర్చువల్ రివ్యూ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. 'రియల్ టైమ్‌లో సమస్యలు పరిష్కారమవ్వాలి. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఎదురుగాకుండా చూడాలి. గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య, పట్టణ ప్రాంతాల్లో కరెంటు కోతలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు లేకుండా చూడాలి. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించాలి. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు. విద్యుత్తు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిరంతరం సేవలందించాలి' అని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4 టీఎంసీలు ఎందుకూ చాలవు

- దాహార్తి తీర్చడానికి మరో నాలుగు కేటాయించండి.. కేఆర్‌ఎంబీకి ఏపీ లేఖ

అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నాలుగు టీఎంసీల కృష్ణా జలాలు ఎందుకూ చాలవని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మరో నాలుగు టీఎంసీలు కేటాయించాలని కోరుతూ కృష్ణా నదీ యాజమాన్య సంస్థ (కేఆర్‌ఎంబీ)కి ఈఎన్‌సీ నరసింహమూర్తి లేఖ రాశారు. 'ఈ నెల 21న తెలంగాణకు 10 టీఎంసీలు, ఏపీకి నాలుగు టీఎంసీలు విడుదల చేస్తూ కేఆర్‌ఎంబీ ఆదేశాలు ఇచ్చింది. ఈ జలాలు చివరిదాకా ప్రవహించడం లేదు. కొంత భూమిలోకి ఇంకిపోతోంది. మరికొంత మధ్యలోనే ఆవిరైపోతోంది. కృష్ణా ఆయకట్టు ప్రజల గొంతు తడవడం లేదు. శ్రీశైలం జలాశయంలో ఈ నెల 19 నుంచి 2.32 టీఎంసీల జలాలు అందుబాటులోకి వచ్చాయి. ఏపీకి ఇంకా 5.662 టీఎంసీలు రావాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా వాటిని విడుదల చేయాలి. ఆలోగా జలాలు విడుదల కాకుంటే ఈ నెలాఖరుతో నీటి సంవత్సరం ముగుస్తున్నందున మేమిచ్చిన ఇండెంట్ మురిగిపోతుంది. కావున నాలుగు టీఎంసీల జలాలను తక్షణమే విడుదల చేయండి' అని ఈఎన్‌సీ కోరారు.


ఈశ్వరరావు, కృష్ణ మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

విద్యుద్దీపాల అలంకరణ వైర్లే.... మృత్యుపాశాలయ్యాయి!

- విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- గ్రామదేవత ఉత్సవాలు ముగిసిన వెంటనే విషాదం

కంచిలి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం తలతంపర పంచాయతీ పరిధిలోని సామంత పుట్టుగ (చిల్లాపుట్టుగ)లో విద్యుదాఘాతంతో సోమవారం ఉదయం ముగ్గురు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ నెల 17వ తేదీ నుంచి తొమ్మిది రోజులపాటు గ్రామ దేవత సింధుపత్రాణి సంబరాలు తలతంపర పంచాయతీతో పాటు పరిసర గ్రామాల్లో కూడా జరిగాయి. సామంతపుట్టుగ గ్రామ వీధుల్లో విద్యుద్దీపాలతో అలంకరించారు. వీటికి సమీప ఇళ్ల నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. ఆదివారం రాత్రితో సంబరాలు ముగిశాయి. సోమవారం ఉదయం గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణను తొలగించారు. అయితే బల్బుల కోసం ఏర్పాటు చేసిన ఇనుప వైర్లు ఇంకా తొలగించాల్సి ఉంది. చిల్లా ఈశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలోపల నుంచి బయట అలంకరణల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లకు సంబంధించిన స్విచ్‌ను అనుకోకుండా వేయడంతో ఇనుప తీగకు విద్యుత్ సరఫరా జరిగింది. ఈసందర్భంలో అక్కడ ఆడుకుంటున్న నౌళియా కృష్ణ , బహడపల్లి నందిని, పొడియా మనోజ్ అనే రెండేళ్ల బాలుడికి విద్యుత్ షాక్ తగిలింది. ఇది గమనించిన ఈశ్వరరావు వెంటనే తన మేనల్లుడైన కృష్ణను రక్షించే క్రమంలో వైర్లను తప్పించేందుకు వాటిని పట్టుకున్నాడు. దీంతో షాక్ తగిలి ఈశ్వరరావు (28), బహడపల్లి నందిని (12), నౌళియా కృష్ణ (3) అక్కడికక్కడే చనిపోయారు. బాలుడు మనోజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో సోంపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అనంతరం బరంపురం తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు ఈశ్వరరావు అక్క కుమారి వచ్చి వైర్లను తప్పించేందుకు ప్రయత్నించింది. ఆమెకు కూడా షాక్ తగిలి చేతికి గాయాలయ్యాయి. చిన్నారులను కాపాడేందుకు ప్రయత్నించిన చిల్లా తరిణి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.


నందిని మృతదేహం వద్ద బంధువుల రోదన

బ్యాంకు ఉద్యోగికి ట్రాప్!

- లోను అర్జీ పెట్టి.. ఇంటికి పిలిచి నిర్బంధం
- దుస్తులు తీయించి దాడి.. వీడియోలు చిత్రీకరణ
- వాటిని తొలగిస్తామని రూ.6.50 లక్షలు వసూలు
- నేరగాళ్లకు సహకరించిన మరో బ్యాంకు ఉద్యోగి
- చీరాల వన్‌టౌన్‌లో కేసు నమోదు.. రూ.5.70 లక్షలు స్వాధీనం
- ఏడుగురి అరెస్ట్, పరారీలో మరో మహిళ

చీరాల, మే 26 (ఆంధ్రజ్యోతి): లోన్ కావాలంటూ పిలిచి ఓ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌పై అమానుషంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దాడిని రికార్డు చేసి బెదిరింపులకు పాల్పడి.. తిరిగి ఆయన వద్దే తిరిగి నగదు వసూలు చేసిన ఘరానా వ్యవహారమిది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు తారకరామానగర్‌కు చెందిన మద్దారపు విజయసారథి బాపట్ల జిల్లా చీరాల స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచిలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. బ్యాంకులో చీరాలకు చెందిన గరిక హేమలత రుణం తీసుకొని తిరిగి చెల్లించింది. తనకు మరోసారి ఇంటి రుణం కావాలని కోరింది. దీంతో ఆమె ఇంటి చిరునామాను బ్యాంకులో సీనియర్ మెసెంజర్‌గా పనిచేస్తున్న వేటపాలెం మండలం సంపత్‌నగర్‌కు చెందిన తెనాలి నెహ్రూను సారథి అడిగారు. కొద్దిసేపు ఆగండి కనుక్కుని చెబుతానని నెహ్రూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత పక్కా పథకం ప్రకారం పట్టణ పరిధిలోని గంజిపాలెంలో ఓ ఇంటికి ఈనెల 7వ తేదీన సారథిని పిలిపించారు. ఆయన అక్కడికి వెళ్లగా బయట ఉన్న ఓ మహిళ లోపల కూర్చోబెట్టి ఎక్కడికో వెళ్లింది. నలుగురు వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేశారు. బలవంతంగా అధికారి దుస్తులు తీయించి అర్ధనగ్నంగా కూర్చోబెట్టి దాడి చేశారు. ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు. అధికారి ఫోన్‌పేలో ఉన్న రూ.72వేలు నగదు వారి ఖాతాకు మళ్లించుకున్నారు. మరో రూ.10లక్షలు ఇవ్వకుంటే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు కేసు పెడతామని బెదిరించారు. సారథి అక్కడి నుంచి వెళ్లి ఆ ఇంటికి తనను పంపిన సహోద్యోగి నెహ్రూకు అంతా వివరించారు. అయితే వారితో నేను మాట్లాడి ఫొటోలు, వీడియో డిలీట్ చేయిస్తానని నమ్మబలికి అందరికి కలిపి రూ.6.50లక్షలు ఇవ్వాలని ఒత్తిడి పెంచాడు. దీంతో సారథి ఈనెల 8న అడిగిన మొత్తాన్ని నెహ్రూకు ఇచ్చాడు. ఇది కాకుండా సమస్యను పరిష్కరించినందుకంటూ నెహ్రూ మరో రూ.75వేలు తీసుకున్నాడు. ఒప్పందం ప్రకారం ఫోన్లో రికార్డు చేసిన వీడియో, ఫొటోలు డిలీట్ చేసి, తిరిగి తన జోలికి రాకుండా ఉండేలా ఒప్పందపత్రం ఇవ్వాలని సారథి అడిగారు. కొంతజాప్యం జరగడంతోపాటు నిందితులు మరో రూ.5లక్షలు డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన ఫీల్డ్ ఆఫీసర్ ఈనెల 21న వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. గరిక హేమలత, చందు, విజయ్, పూజారి జాషువ, తెనాలి నెహ్రూ, నల్లగట్ల ఏకలవ్య, గరిక మహేంద్ర, గరిక ప్రదీప్‌లపై కేసు నమోదు చేశారు. ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.5.70లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరో మహిళ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

లక్ష్మీపేట దళితుల హత్యకేసు విచారణపై హైకోర్టు స్టే

- 16 వరకూ నిలిపేస్తూ ఉత్తర్వులు

అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): 'లక్ష్మీపేట దళితుల హత్య కేసు'లో సాక్షులకు సహేతుక సమయం ఇవ్వకుండా ప్రత్యేక కోర్టు హడావుడిగా విచారణను మూసివేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. సముచిత సమయం ఇవ్వకుండా సాక్ష్యాల నమోదును మూసివేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. సాక్ష్యాలు చెప్పేందుకు ప్రత్యేక కోర్టు మరికొంత సమయం ఇచ్చి ఉండాల్సింది అభిప్రాయపడింది. దళితుల హత్య కేసుతో పాటు మరో కేసును కలిపి విచారించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, వీటికి ప్రత్యేక కోర్టు న్యాయాధికారి కట్టుబడి వ్యవహరించలేదని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో లక్ష్మీపేటలోని ప్రత్యేక కోర్టులో విచారణను జూన్ 16 వరకు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా, వంగర మండలం, లక్ష్మీపేట గ్రామంలో భూమి సాగుకు సంబంధించి 2012లో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. ఓ సామాజిక వర్గానికి చెందినవారు జరిపిన దాడిలో 5 గురు దళితులు మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసు విచారణ కోసం లక్ష్మీపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం సాక్షుల విచారణ జరుగుతుంది. అయితే సాక్ష్యాల నమోదును మూసివేస్తూ మే 19న ప్రిసైడింగ్ అధికారి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి, సాక్ష్యం ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ బాధితులు గంగయ్య మరో ఐదుగురు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జీవీ శివాజీ వాదనలు వినిపిస్తూ.. ప్రత్యేక కోర్టు న్యాయాధికారి హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోలేదన్నారు. కేవలం 17 రోజుల్లోనే 86 మంది సాక్షులను విచారించారన్నారు. కేసులో ప్రధాన సాక్షులైన పిటిషనర్లకు సాక్ష్యం చెప్పేందుకు అవకాశం ఇవ్వకుండా విచారణను మూసివేశారన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి... లక్ష్మీపేట ప్రత్యేక కోర్టులో విచారణపై జూన్ 16 వరకు స్టే విధిస్తూ ఉత్తర్వు ఇచ్చారు.

నమాజ్ ఘటనలో ఫొటోగ్రాఫర్‌పై కేసు నమోదు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా నమాజ్ చేసిన ఘటనలో తిరుమలకు చెందిన ఓ ప్రైవేట్ ఫొటోగ్రాఫర్‌పై కేసు నమోదైంది. ఈనెల 22న చెన్నైకు చెందిన అబ్బాస్ అనే వ్యక్తి తిరుమలలోని కల్యాణవేదికలో నమాజ్ చేయగా, దాని వీడియో విపరీతంగా వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో విజిలెన్స్, పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. కల్యాణ వేదికలో ఫొటో స్టూడియో లైసెన్స్‌తో ఫొటోగ్రాఫర్‌గా ఉన్న గోవర్ధన్ అనే వ్యక్తి వద్దకు అబ్బాస్ వెళ్లి.. ఇక్కడ నమాజ్ చేయవచ్చా అని అడిగిన క్రమంలో, చేసుకోవచ్చని అతడు చెప్పినట్టు పోలీసు విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా నమాజ్ చేస్తుండగా గోవర్ధన్ వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈమేరకు గోవర్ధన్‌పై తిరుమల టూటౌన్‌లో కేసు నమోదైంది. అతడి లైసెన్సును సీజ్ చేశారు. నమాజ్ చేసిన అబ్బాస్‌పైనా కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వర్షాగమనం...!

నైరుతి రుతుపవనాలు ముందే వచ్చేశాయి. ఇంకాచెప్పాలంటే, వాతావరణశాఖ అంచనాలను కూడా త్రోసిరాజని జల్లులు కురుస్తున్నాయి. ఉగ్రవేసవి అధికారికంగా ముగియడానికి ఇంకా అనేకరోజులు ఉండగానే, ఏకంగా ఎనిమిది రోజుల ముందే రుతుపవనాలు కేరళను తాకాయి, తెలుగురాష్ట్రాలు కూడా వర్షాలకు తడిసి తరిస్తున్నాయి. రుతుపవనాలు ఇలా హడావుడిపడటం పాతికేళ్ళలో ఇది మూడోసారి, పదహారేళ్ళలో తొలిసారి. 2023లో వారంరోజులు ఆలస్యంగా కేరళను తాకి దేశాన్ని అల్లాడిపోయేట్టు చేసినందుకు కాబోలు, మరుసటి ఏడాది మే 30నే నైరుతి వచ్చి మనకు ఉపశమనాన్ని ఇచ్చింది. ఈ పలకరింపులో ఏ మాత్రం జాప్యం జరిగినా ఎంతటి క్షోభ కలుగుతుందో తెలుసు కనుకనే రైతే కాదు, సామాన్యుడు సైతం పవనాల రాకను స్వాగతిస్తున్నాడు, ముందేవచ్చినందుకు ముచ్చటపడుతున్నాడు.

రానున్నరోజుల్లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణశాఖ శుభవార్త వినిపించింది. వ్యవసాయాధారిత దేశం కనుక అది నిజం కావాలనీ, అన్నదాత ఆనందించాలనీ నాయకులంతా కోరుకుంటున్నారు. జపాన్‌ను దాటి ప్రపంచ నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారతదేశం ఆవిర్భవించిందని శనివారం నీతి అయోగ్ ప్రకటించింది. ఆర్థికవ్యవస్థ పురోగమనానికి రుతుపవనాలు ఊతాన్నిస్తాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు పడతాయన్నది ఖరీఫ్ పొంగిపొర్లేందుకు అవశ్యకమైన శుభవార్త. 2027లో జర్మనీని సైతం అధిగమించి అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ప్రభవిస్తుందన్న అంచనాలకు అనుగుణంగా, ఆ అద్భుత పురోగతి సుసాధ్యం కావడానికి రాబోయే సంవత్సరాల్లో సైతం వర్షాలు ఇదేరీతిలో ఉండాలని కోరుకోవాలి.

ఆహారధాన్యాల నిల్వలకు లోటేమీలేదు కనుక, మూడునెలల రేషన్ ముందుగానే ప్రజలకు పంచేసి, ఇబ్బడిముబ్బడిగా రాబోతున్న ఉత్పత్తికి గిడ్డంగులను సిద్ధం చేయమంటూ రాష్ట్రాలను కేంద్రం ఇప్పటికే ఆదేశించింది. గత ఏడాది దేశవ్యాప్తంగా మిగులు వర్షపాతం ఉన్నా పంజాబ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ఇత్యాది రాష్ట్రాల్లో లోటు నమోదుకావడం, మరోపక్క రాజస్థాన్, గుజరాత్ వంటివి మునిగిపోవడం చూశాం. పంటదిగుబడి ఇంకా అధికంగా వర్షాలమీదే ఆధారపడుతున్న ఈ దేశంలో చినుకుపడితే ఆనందం, ఆగితే విషాదం పక్కపక్కనే ఉంటాయి. ఒకచోట కుంభవృష్టి, మరొకచోట అనావృష్టి సహజమైపోయాయి. వాతావరణ మార్పు కారణంగా వర్షపురోజుల సంఖ్య క్రమంగా తగ్గుతూ, కుంభవృష్టితో ప్రళయాలు వచ్చిపడే పాడుకాలం దాపురించింది. ఇరిగేషన్ సౌకర్యాల విస్తరణ జరగకుండా దేశంలో ఎక్కువమంది రైతన్నలు ఇంకా మేఘాలనే నమ్ముకొని వ్యవసాయం చేయడం వారిని ఆర్థిక కష్టాల్లోకి నెట్టేసి, ఆత్మహత్యల వరకూ తీసుకుపోతున్నది. నీటి సౌకర్యాలను మెరుగుపరచి, విత్తనాలనుంచి గిడ్డంగుల వరకూ అన్నింటా అండగా నిలిచి, ప్రకృతిప్రకోపాలకు ప్రత్యక్షంగా బలైపోయే పరిస్థితులనుంచి వారిని బయటకు తీసుకురావాలి. రుతుపవనాలు ముందుగా వచ్చిన ఉత్సాహాన్ని ఢిల్లీ, ముంబై, బెంగుళూరు వంటి మహానగరాలు మునిగిపోతున్న దృశ్యాలు నీరుగారుస్తున్నాయి. మూడోవంతుకంటే ఎక్కువ జనాభా నివసిస్తున్న నగరాలు నాలుగు చినుకులకే అల్లాడిపోతున్నాయి. కాస్తంత తక్కువ వర్షం పడితే, భూగర్భజలాలు అడుగంటిపోవడం, నీటికి అల్లాడిపోవడం, మరోపక్క మేఘాలు కాస్తంత దయతలిస్తే చిగురుటాకుల్లా వొణికిపోవడం సర్వసాధారణమైపోయింది. ఇక, ఈ రుతువులతో సంబంధం లేకుండా నగరాలను ముంచేస్తున్న కుంభవృష్టులకు మన వ్యవస్థలను సంసిద్ధం చేయాల్సిన బృహత్తర కర్తవ్యం మిగిలే ఉంది. వాతావరణమార్పును నివారించడంతో పాటు, సాగు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరుచుకోవాలి.

రుతుపవనాల వల్ల వర్షాన్ని పొందుతున్న దేశాల్లో మనదే ప్రధానమైనది, పెద్దదీ అంటారు. దేశం అన్ని రంగాల్లో ఎంత ఎదుగుతున్నా డెబ్బయ్‌శాతం సాగు, తాగునీటిని అవసరాలను తీరుస్తూ, జనాభాలో తొలిస్థానంలో ఉన్న ఈ దేశానికి ప్రాణాన్నిస్తున్న రుతుపవనాల ప్రాధాన్యం లెక్కకు అందనిది. 2009లో పవనాలు ఇప్పటికంటే ముందే వచ్చినా, 23శాతం వర్షలోటుతో దేశాన్ని పాడిబార్చిన సంగతి తెలిసిందే. రాకపోకలే కాదు, విస్తరణలోనూ అనిశ్చితిని కనబరచే రుతుపవనాలకు ఈ ఏడాది ఏ అడ్డంకులు ఏర్పడకూడదని, గత పదిహేనేళ్ళకాలంలో వీటి మంచిచెడులను మరికాస్తంత కచ్చితత్వంతో చెప్పగలుగుతున్న వాతావరణశాఖ అంచనాలకు అనుగుణంగా వాటి పురోగతి, ప్రభావం ఉండాలని కోరుకుందాం.

యుద్ధలాభం ఆయుధ వ్యాపారులకే!

పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత సంభవించిన పరిణామాలు విస్తృత చర్చకు దారితీశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకోడమే తమ ధ్యేయమన్న బీజేపీ నాయకుల సారథ్యంలో భారత్ వెనక్కి తగ్గిందనే ప్రచారం సాగింది. దీనిని తుడిచిపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటుతూ దేశమంతా ఊరేగింపులు జరిగాయి. వాస్తవంలో పూర్తిస్థాయి యుద్ధం దరిదాపులకు వెళ్లిన భారత, పాకిస్థాన్‌లు ఉన్నపళంగా ఘర్షణలను విరమించుకున్నాయి. ఇది సిమ్లా ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య చర్చల ద్వారానే జరిగిందని తాజాగా ప్రకటించుకున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతోనే యుద్ధం ఆగిందన్న సమాచారం మెరుపు వేగంతో వ్యాపించింది. అప్పుడు దానిని రెండు దేశాల పాలకులూ తక్షణమే ఖండించలేదు.

యుద్ధమే జరిగితే సంభవించబోయే ఘోర పరిణామాల గురించి వివరించనక్కరలేదు. అటువంటి భయానక స్థితిని తొలగించినందుకు, భారత పాకిస్థాన్ పాలకులను ఇందుకు ఒప్పించినందుకు అమెరికా అధ్యక్షుడిని అభినందించడంలో తప్పు లేదు. అయితే ఇంతటితో యుద్ధ భాష ఆగకపోడమే ఆందోళనకరం. పరస్పరం పిప్పి, పిండి చేసుకోవాలన్న 'మీసాల' మెలివేత కొనసాగుతూనే ఉంది. ఇది రెండు దేశాల పాలకులు తమ ప్రజల్లో పొరుగు దేశం పట్ల ద్వేషాన్ని మరింతగా పెంచి రాజకీయంగా లాభపడడానికి పాటిస్తున్న వ్యూహమే. దీనివల్లనే శాశ్వత చర్చలకు ఆటంకం కలుగుతున్నది.

ఇక్కడే మరొక బాధాకర పరిణామం—1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరాగాంధీతో మోదీని పోల్చుతున్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ల మధ్య తలెత్తిన ఆ యుద్ధం వల్ల లక్షలాదిమంది తూర్పు పాకిస్థానీయులు మన దేశంలోకి పారిపోయి రాడంతో ఇందిరాగాంధీ భారత దళాలతో ముక్తిబాహినిని సృష్టించి బంగ్లాదేశ్ అవతరణకు తోడ్పడ్డారు. అయితే ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించ లేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఇది తమ ఓటు బలాన్ని తగ్గిస్తుందని, చేరువలో ఉన్న బిహార్ ఎన్నికల్లో దెబ్బ తింటామని బీజేపీ భయపడుతున్నది. అంతేగాని పూర్తి స్థాయి యుద్ధానికి వెళ్లకుండా నిగ్రహం పాటించినందుకు సంతోషించడం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మోదీ పాకిస్థాన్ పీచమణిచారన్న అభిప్రాయాన్నీ బలంగా నాటుతున్నారు. పాకిస్థాన్‌ను మోకాళ్ళ మీదకు తెచ్చామని ఆయన కూడా ప్రకటించారు. ఈ అవకాశం, ఈ స్వేచ్ఛ తమకు ఇచ్చినందుకు భారత దళాలు ప్రధాని మోదీకి మొక్కుతున్నాయి అనేవారూ బయలుదేరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంతవరకూ జరిగిన నాలుగు యుద్ధాల్లో అసంఖ్యాకంగా సైనికులు మరణించారు. ఆయుధాలకోసం రెండు దేశాలు విశేషంగా డబ్బు తగలబెట్టాయి.

భారత ఉపఖండంలో రాజకీయం ఇప్పటికీ మతోన్మాదం ప్రాతిపదికనే కొనసాగుతున్న మాట కాదనలేని సత్యం. కశ్మీర్ పరిణామాలకూ అదే ఇంధనమవుతున్నది. హిందుత్వ రాజకీయాల మత కోణం దేశ ప్రజల మధ్య సృష్టిస్తున్న విభజన గురించి వివరించనక్కరలేదు. మతపరంగానో, సరిహద్దు వివాదం పరంగానో యుద్ధం తలెత్తితే అవతలి దేశాన్ని చీల్చి చెండాడాలని, దాన్ని నామరూపాలు లేకుండా చేసేయాలని పళ్ళు పటపటా కొరకడాన్ని అటూ ఇటూ గల ప్రజలకు అలవాటు చేశారు. భారత సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే యుద్ధాన్ని గురించి కొద్ది రోజుల క్రితమే మంచి మాటలు చెప్పారు. యుద్ధాలు బాలీవుడ్ సినిమాలు కావన్నారు, యుద్ధాల్లో ఎంతమంది చనిపోతారో, మరెంతమంది వికలాంగులై జీవితాంతం ఎడతెగని వ్యథను అనుభవిస్తారో గుర్తు చేశారు. కురుక్షేత్రం లాంటి యుద్ధ గాథలు సినిమాల్లో, నాటకాల్లో చూడ్డానికే బాగుంటాయి. ఒకరినొకరు నరుక్కోడం, శత్రువు రొమ్ము చీల్చి రుధిరమ్ము తాగడం వాస్తవంలో ఎంతమాత్రం కోరదగినవి కావు. ఇప్పుడు సరిహద్దుల రక్షణలో కన్నార్పకుండా కాపలా కాస్తున్నవారిలో, యుద్ధాల్లో ప్రాణాలు విడుస్తున్నవారిలో అత్యధికులు పేద బహుజనులే. ఉపాధి కరువై పొట్ట కూటి కోసం సైన్యంలో చేరుతున్నవారే ఎక్కువమంది.

పహల్గాం ఉగ్ర దాడి బహు హేయమైనది. ఈ ఉన్మాదులు భారత, పాకిస్థాన్‌లు చేరువ కాకుండా అన్ని తంత్రాలను ప్రయోగిస్తున్నారు. రెండు దేశాల మధ్య మతపరమైన దూరాన్ని పెంచి దాన్ని అధిగమించడానికి వీలు లేని స్థాయికి తీసుకువెడుతున్నారు. భారత వ్యతిరేక ఉగ్రశక్తులకు పాకిస్థాన్ సైన్యం అండదండలు లభిస్తున్నాయి. అది పాక్ ప్రేరిత ఉగ్రవాదమే. అయితే ఈ విషయాన్ని మనం నమ్ముతున్నంతగా మిగతా ప్రపంచం నమ్మడం లేదు. మిగతా దేశాలు భారత్, పాకిస్థాన్లను ఒకేలా చూస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పాలకులు తెలుసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌ను భారత్ గట్టి దెబ్బే తీసింది. అంతటితో ఆగకుండా పాకిస్థాన్ నిజస్వరూపాన్ని తెలియజేయడానికి దేశ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించడం బాగుంది. అయితే అది కూడా రాజకీయ విభేదాలకు దారి తీయడం బాధాకరం. పాకిస్థాన్‌పై బలంగా విరుచుకుపడ్డాం గాని పహల్గాం దాడి ముష్కరులను కనుక్కోడంలో జాప్యం జరుగుతున్నది. వారెవరో స్పష్టంగా తెలిస్తే బాగుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో వూగిపోడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది.

వాస్తవానికి టెర్రరిజం సమస్య చాలా లోతైనది. ప్రపంచ పాలకులు ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్ వంటి దేశాలు చిత్తశుద్ధితో ఆలోచిస్తే వాటి అసలైన మూలాలు కనిపిస్తాయి. భారత పాకిస్థాన్‌లకూ ఇదే వర్తిస్తుంది. టెర్రరిజం గాని, వామపక్ష ఉగ్రవాదం గాని ఊరకే ఆకాశం నుంచి ఊడిపడేవి కావు. మెజారిటీ, మైనారిటీలు హాయిగా శాంతియుత సహజీవనం చేస్తున్న చోట సెక్యులరిజం వర్ధిల్లుతున్న దేశంలో మతపరమైన మెజారిటీని మైనారిటీల మీదికి రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యమనిపించుకోదు. పాక్‌కు జీలం నది నీటిని ఆపడం గాని, ఘర్షణలకు కారణమయ్యారని భావించి వారి ఇళ్లు కూల్చి తల మీద కప్పు లేకుండా చేయడం గాని మానవీయమైన పనులు కావు. కక్ష కక్షనే ఇస్తుంది. ఉగ్రవాదానికి అది కూడా దారి తీస్తుంది. మన దేశంలో అధిక సంఖ్యాకుల మతస్వామ్యం వంటిదే రాజ్యమేలుతున్నది. వక్ఫ్ బిల్లులో మోదీ ప్రభుత్వం తేదలిచిన మార్పులను సెక్యులర్ రాజ్యాంగ రక్షకురాలైన సుప్రీంకోర్టు తీవ్రంగా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం. ఉగ్రవాదం క్రూరమృగం కంటే ప్రమాదకరమైనది. దాని నిజమైన మూలాలు తెలుసుకొని వాటిని నిర్మూలించినంతవరకూ పేట్రేగుతూనే ఉంటుంది. బలమైన శత్రువు నేరుగా బరి మీదికి వస్తాడు. తగిన బలం లేనివాడు దొంగదెబ్బ తీస్తాడు. హమాస్ ఒకసారి తమపై దాడి చేసిందని ఇజ్రాయెల్ గాజాలో ఇప్పటివరకు దాదాపు అరవై వేలమందిని హతమార్చింది. వారిలో ముక్కుపచ్చలారని పసి పిల్లలు, మహిళలే అధికులు. అయినా హమాస్ కాకపోతే మరో ఉగ్రవాద సంస్థ పుడుతూ ఉండడానికే ఆస్కారం ఎక్కువ.

యుద్ధాలు అత్యంత ఖరీదైన ఆధునిక ఆయుధాల కొనుగోలును పెంచుతున్నాయి. దాని వల్ల కోట్లాది ప్రజలు బలవుతున్నారు. అమెరికన్ ఆయుధ కంపెనీల ఆదాయం ఆకాశానికి అంటుతున్నది. ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా వల్ల 2024లో అమెరికన్ లాక్ హీడ్ కంపెనీ లాభాలు 14శాతం పెరిగాయి. ట్రంప్ పర్యటనలో అమెరికా నుంచి 152 బిలియన్ డాలర్ల ఆయుధాల కొనుగోలుకు సౌదీ అరేబియా ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ కొనుగోలును 600బిలియన్ డాలర్ల వరకూ తీసుకుపోడానికి ఒప్పందం కుదిరింది. భారతదేశం కూడా ఈ ఉచ్చులో చిక్కుకున్నది. ప్రధాని మోదీ అమెరికా ఆయుధ మార్కెట్లో చక్కర్లు కొడుతున్నారు. 2020 నుంచి 2025 వరకు భారతదేశం రక్షణ కోసం 350 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. పాకిస్థాన్ మిలిటరీ దేశం అని యెత్తి చూపే మనం ఎంత శాంతి కాముకులమో దీనిని బట్టి తెలుస్తున్నది. ఇంత చేసీ కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని తొలగించగలిగామా, లేదు. 2020 నుంచి కశ్మీర్‌లో టెర్రరిజం నిరాఘాటంగా సాగిపోతున్నది. వందలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. టూరిజం దారుణంగా దెబ్బ తిని లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఆపిల్ వ్యాపారం మూతబడిపోతున్నది. గతంలోకి వెడితే 2015 డిసెంబర్‌లో ఆఫ్ఘానిస్తాన్ పర్యటన నుంచి తిరుగు ప్రయాణంలో ప్రధాని మోదీ ఊహించని విధంగా లాహోర్‌లో దిగి అప్పటి పాక్ అధినేత నవాజ్ షరీఫ్‌తో సమావేశమయ్యారు. నవాజ్ మనుమరాలి పెళ్ళికి హాజరయ్యారు. మళ్ళీ అటువంటి సన్నివేశాలను చూడలేమా, రెండు దేశాల మధ్య అతి చేరువ వ్యాపారం తిరిగి వర్ధిల్లదా, ఆయుధాల కొనుగోలుతో దేశాలకు దేశాలు ఆకలి అవిద్య జబ్బుతో, మందుల కరవుతో ఆత్మహత్య మార్గం పట్టడం ఆగదా, శాంతి పుంజం ప్రసరించదా?

■ గార శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్



బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరా గాంధీతో మోదీని పోల్చుతున్నారు. కానీ ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించలేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో ఊగిపోవడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది.

ఎన్‌కౌంటర్లలో మరణించేది మానవత్వం, ప్రజాస్వామ్యం కూడా!

ఇటీవల జరిగిన 'ఎన్‌కౌంటర్'లో 27 మంది మావోయిస్టులు చనిపోయారని, వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు కూడా మృతి చెందారని కేంద్ర హోం మంత్రి ప్రకటించారు. హోం మంత్రి, ప్రధానమంత్రి ఇద్దరూ ఈ 'ఘనత'కు కారణమైన తమ బలగాలను బహిరంగంగా అభినందించారు. విజయోత్సాహంతో తమ విధానాన్ని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని నెలలుగా మావోయిస్టు పార్టీ మీద యుద్ధం ప్రకటించి, ఏకపక్షంగా దాడి చేస్తూ వారిని తుదముట్టిస్తోంది.



మావోయిస్టుల మార్గంతో చాలామంది విభేదించవచ్చు. ఈ అత్యాధునిక సాంకేతికతల నేపథ్యంలో, దేశంలోని సగటు ప్రజలు గతంలో కంటే సాపేక్షికంగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో మావోయిస్టు పార్టీ ఇప్పుడు అవలంబిస్తున్న మార్గం బహుశా కాలం చెల్లిపోయినది కూడా కావచ్చు. మావోయిస్టుల కారణంగా ఒకానొక కాలంలో ప్రత్యక్షహింస పెరిగి ఉండవచ్చు. అదే సమయంలో వారు పాల్పడ్డ నిరర్థక హింస కంటే వారు అనుభవించిన హింస శాతమే ఎక్కువ. సమసమాజ స్థాపనకు ఎంత దూరంలో ఉన్నా, తమ మార్గంలో వారెప్పుడూ నోరులేని, అత్యంత బలహీనవర్గాల పక్షమే అనేది ఎవరూ కాదనలేని సత్యం. మరి ఈ రోజు పరిపాలకులుగా ఉన్న వారి చరిత్ర ఏమిటి? వారు కాపాడుతున్న కార్పొరేట్ల చరిత్ర ఏమిటి?

ప్రభుత్వంతో చర్చిస్తామని, అందుకు అవకాశం కల్పించాలని మావోయిస్టులు రెండు నెలలుగా అభ్యర్థిస్తున్నారు. మావోయిస్టులతో ప్రభుత్వం చర్చించి ఈ వివాదానికి ఒక శాంతియుత, రాజకీయ పరిష్కారాన్ని సాధించాలని తెలంగాణ సహా దేశంలోని ప్రజాస్వామిక వాదులందరూ కోరుతున్నారు. మావోయిస్టులు ఈ యుద్ధంలో పూర్తిగా ఓడిపోతున్న సందర్భంలో మాత్రమే చర్చల ప్రస్తావన తీసుకువస్తున్నారని, వారేమీ శాంతికాముకులు కాదు కాబట్టి చర్చలు చేయాల్సిన అవసరం లేదని పాలక పార్టీ మేధావులు తీర్పులిస్తున్నారు. అవును, వారు బలహీనపడే అడుగుతున్నా, వారితో మాట్లాడితే తప్పేమిటి? యుద్ధానంతర ఒడంబడికలన్నీ అలాగే కదా జరిగేది. ఇక్కడా అదే నీతి వర్తిస్తుంది. అది సాధ్యమైతే ఇప్పటికైనా మరింత రక్తపాతం ఆగుతుంది కదా! అది సాధించిన వారు చరిత్రలో చాలా రక్తపాతాన్ని ఆపిన ఉత్తమ పరిపాలకులుగా నిలిచిపోతారు కదా! బలహీన పక్షంపైన బలంగా ఉన్న ప్రభుత్వం ఎన్ని షరతులైనా పెట్టవచ్చనేది లోకజ్ఞానంలోని విషయమే. తమ ఆధిపత్యానికి అడ్డంకిగా ఉన్న వారిని అంతం చేసి మాత్రమే అడ్డు తొలగించుకోవడం ఆటవిక జాతుల నీతి. ఆ సమస్యను చర్చించి, రాజకీయంగా పరిష్కరించుకోవటం మానవీయ, ప్రజాస్వామ్య నీతి. మావోయిస్టులు తిరిగి బలపడతారనేది మరో వాదన. వారు రాజకీయంగా బలపడితే బలపడవచ్చు. కానీ సాయుధంగా బలపడతారనేది చర్చలకు వెళ్లకుండా ఉండటానికి చెప్పే సాకు మాత్రమే.

కొన్ని సార్వజనీన, మానవీయ, ప్రజాస్వామ్య విలువలను, సూత్రాలను పరిపాలకులైనా, వారిని ధిక్కరించే వారైనా పాటించి తీరాలని కోరుకోవడం, ఆ రకమైన విమర్శ చేయడం పౌరసమాజం బాధ్యత. చైతన్యం గల పౌరసమాజాన్ని కలిగిన దేశాల్లోని ప్రభుత్వాలే ప్రజలకు జవాబుదారీగా ఉండగలవు. ఆ దేశాల్లోనే ప్రభుత్వాలు తమ సొంత ప్రజలపై యుద్ధం చేయవు. అటువంటి దేశంలోనే ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, భద్రత, జీవ వైవిధ్యం, పర్యావరణం, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు సజీవంగా ఉంటాయి. మన మధ్య అలాంటి విలువలను నెలకొల్పుకోగలమా? పాలకులను ప్రజాస్వామ్యం అనే దారిలోకి తేగలమా?!

– డా. ఎస్.తిరుపతయ్య, మానవ హక్కుల వేదిక

ప్రభుత్వోద్యోగులు జవాబుదారీగా ఉండాలి

పబ్లిక్ సర్వెంట్లు అధికార దుర్వినియోగం, చట్టాలు నిర్వీర్యం చేయకుండా నిరోధించడానికి ఆటంకం కలిగిస్తున్న 'సదుద్దేశ్య చర్యలకు రక్షణ' పేరుతో అవినీతి నిరోధక చట్టం, నేర విచారణ చట్టం తదితర చట్టాలలో ఉన్న నిబంధనలను రద్దు చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలల గడిచినా, ఇంకా పాత–కొత్త భూ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం నిత్యం బాధితులు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు. వీరు ఆ అర్జీలను సంబంధిత అధికారులకు తగు చర్యల నిమిత్తం పంపిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన సమస్యల కోసం కొద్ది సంఖ్యలో ప్రజలు వీరి వద్దకు రావాలి. దానికి విరుద్ధంగా చిన్న సమస్యల నుంచి పరువు–మర్యాదలు, జీవన్మరణ సమస్యల దాకా వీరి వద్దకు వచ్చి మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి చిన్న పనికీ రాజకీయ జోక్యం, పని భారం, వ్యక్తిగత ప్రయోజనాలు ప్రభావం చూపిస్తున్నాయి.

వాస్తవానికి పబ్లిక్ సర్వెంట్లలో అధిక శాతం సేవాభావంతోనే విధులు నిర్వహిస్తున్నారు. కాని దారితప్పిన కొంతమందితో ప్రభుత్వ సేవకుల పరువుప్రతిష్ఠలు దిగజారుతున్నాయి. పబ్లిక్ సర్వెంట్లు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తమ సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉద్యోగులు ప్రజల్ని వేధిస్తున్నారు. పబ్లిక్ సర్వెంట్లకి 'రక్షణ' పేరుతో ఉన్న నిబంధనలు వారికి కవచాలుగా ఉన్నాయి. ఒక ఉద్యోగి నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో తన విధి నిర్వహిస్తే అందుకు తగిన ఆధారాలు ఉంటాయి. చేయని నేరాలను అంటకట్టి తప్పుడు కేసులు పెట్టే బాపతు సామాన్య ప్రజానీకంలో నూటికి ఒక్కరు ఉంటారు. ఆ సందర్భంలో అన్ని రుజువులు పబ్లిక్ సర్వెంట్లకు అందుబాటులో ఉంటాయి. కాబట్టి నిరూపించుకుని, బయటపడడం సులువు. ప్రభుత్వోద్యోగి అధికార దుర్వినియోగాన్ని లేదా చట్టం నిర్వీర్యం చేయడాన్ని నిరూపించాలంటే సామాన్య ప్రజానీకానికి చాలా కష్టమైన పని.

అందువల్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు తమ వద్దకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారం చేయడంతో పాటు అసలు తమ వద్దకు సమస్య వచ్చేదాకా పరిష్కారం చేయకపోవడానికి కారణాలు ఏమిటో అధికారుల నుంచి సంజాయిషీ కోరాలి. అందులో నిర్లక్ష్యం లేదా కారణాలు సరిగా లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమిస్తే, భవిష్యత్తులో ఈ తప్పిదాలు పునరావృతం కావు.

– డి.వి. లక్ష్మీనారాయణ, గుంటూరు

ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం మహానాడు

పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ ప్రతియేటా మే 27, 28, 29 తేదీలలో మూడు రోజులపాటు రాష్ట్ర పార్టీ ప్రతినిధుల సభ 'మహానాడు' నిర్వహించడం ఆనవాయితీ. రాజకీయాలలో పలు సంచనాలకు చిరునామా అయిన ఎన్టీఆర్.. వివిధ పథకాలకు, కార్యక్రమాలకు వినూత్నమైన పేర్లు పెట్టి అందర్నీ ఆశ్చర్యపరిచిన కోవలోనే పార్టీ ప్రతినిధుల మహాసభకు 'మహానాడు' అని నామకరణం చేశారు. తొలి మహానాడును 1982, సెప్టెంబర్‌లో నిర్వహించినా.. పార్టీ నేతలు, కార్యకర్తల అభీష్టం మేరకు 1983లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మే 27, 28, 29 తేదీలను ఖరారు చేశారు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో మినహాయిస్తే.. దశాబ్దాలుగా 'మహానాడు' నిర్విఘ్నంగా కొనసాగుతోంది.

పార్టీ శ్రేణులు పండగగా భావించే తెలుగుదేశం 'మహానాడు'కు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. అత్యున్నత కమిటీ 'పొలిట్‌బ్యూరో'తో పాటు రాష్ట్ర, జిల్లాల కార్యవర్గం; అనుబంధ సంఘాల కార్యవర్గాలు, ప్రత్యేక ఆహ్వానితులతో కూడిన పార్టీ ప్రతినిధుల సభ 'మహానాడు' అధినేత నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన మూడు రోజులపాటు కొలువుతీరి వివిధ అంశాలపై చర్చిస్తుంది. ఏడాది కాలంలో పార్టీ చేపట్టిన కార్యక్రమాల్ని సమీక్షిస్తుంది. ప్రభుత్వపరంగా చేపట్టిన కార్యక్రమాలు, పథకాలు, సాధించిన విజయాలు, వాటి లోటుపాట్లు, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై తీర్మానాలను ప్రవేశపెట్టి చర్చించి ఆమోదిస్తుంది. పార్టీకి, ప్రభుత్వానికి దశ, దిశను నిర్దేశిస్తుంది. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామి చేయడం లక్ష్యంగా జరిగే 'మహానాడు'లో పార్టీ శ్రేణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవడం; ప్రజల ఆకాంక్షల మేరకు విధానాలను సవరించుకోవడం, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకొని ప్రజా సేవకు పునరంకితం కావడం లక్ష్యంగా మహానాడు సాగుతుంది. పార్టీలో పారదర్శకత, పార్టీ శ్రేణుల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ అంతర్గత ప్రజాస్వామ్యానికి పెద్దపీట వేయడం తెలుగుదేశం పార్టీలో మొదటి నుంచి కనిపిస్తుంది.

మహానాడు తొలిరోజున ఆ ఏడాదిలో దివంగతులైన పార్టీ నేతలకు నివాళులు అర్పించే తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం ఓ విశేషం. ఇటువంటి ఆనవాయితీ చాలా రాజకీయ పార్టీలలో కన్పించదు. అదేవిధంగా ప్రతి రెండేళ్లకొకసారి 'మహానాడు'లోనే పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహిస్తారు. మే 28న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనకు నివాళులు అర్పించే తీర్మానం ప్రవేశపెడతారు. ఆ సందర్భంగా ఎన్టీఆర్ సినీ, రాజకీయ విశేషాలను, ప్రత్యేకించి ఆయన రాజకీయరంగ ప్రవేశం; యువత, మహిళలు, చదువుకొన్నవారు, బడుగు, బలహీన వర్గాలకు ఆయన అందించిన రాజకీయ ప్రోత్సాహం.. అధికారంలోకి వచ్చాక చరిత్రను తిరగరాసిన పథకాలు, కార్యక్రమాలు మొదలైన అంశాలతో వక్తల ప్రసంగాలు ఉంటాయి.

మహానాడులో ప్రవేశపెట్టే రాజకీయ తీర్మానానికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఇందులో తెలుగుదేశం పార్టీ చరిత్రకు సంబంధించి.. 1982 నుంచి 1995 ఆగస్టు మాసం వరకు నందమూరి తారకరామారావు; 1995 సెప్టెంబర్ నుంచి నేటి వరకు నారా చంద్రబాబునాయుడి సారథ్యంలో పార్టీ సాగిస్తున్న ప్రస్థానంలో రాష్ట్ర, దేశ రాజకీయాలలో పోషించిన క్రియాశీల పాత్ర, ముఖ్యంగా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి; దేశ లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలు బలోపేతం కావడానికి తొలుత ఎన్టీఆర్, తదుపరి చంద్రబాబు నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సాగించిన ఉద్యమాలు—పోరాటాలు, ఎదురైన సవాళ్లు, చేసిన త్యాగాలు మొదలైన కీలక అంశాల ప్రస్తావన ఉంటుంది. ఇక వర్తమాన రాజకీయాలకు సంబంధించి పార్టీ విధానాన్ని స్పష్టం చేస్తుంది. జాతీయ పార్టీగా రూపాంతరం చెందకముందు నుంచీ తెలుగుదేశం పార్టీ దేశ, విదేశాంగ విధానం ఏ విధంగా ఉంటే దేశ ప్రయోజనాలు గరిష్ఠంగా నెరవేరుతాయో తెలియజేస్తూనే ఉంది. ఈసారి కూడా ఆ అంశాల ప్రస్తావన ఉంటుందని భావించవచ్చు.

దేశంలో రెండో దశ సంస్కరణలను సాహసోపేతంగా ప్రవేశపెట్టి సంస్కరణల పట్ల ప్రజల్లో కలిగిన దురభిప్రాయాలను పారద్రోలి మిగతావారికి మార్గదర్శకంగా నిలిచిన చంద్రబాబు... విద్యుత్‌తో సహా ఇతర రంగాలలో సాధించిన విజయాలు, తన విజన్‌తో అందరికంటే ముందుగా ఐటీ, బయోటెక్నాలజీ వంటి రంగాల ప్రాధాన్యాన్ని గుర్తించి, వాటికి అందించిన ప్రోత్సాహం కారణంగా యువతకు అందివచ్చిన అవకాశాలు; విజన్ 2020, పేదరిక నిర్మూలనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొన్న వైనం, ప్రజల్ని సాధికారుల్ని చేయడానికి ప్రవేశపెట్టిన వివిధ పథకాల ప్రస్తావన ఉంటుందని చెప్పవచ్చు.

తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ మూల సిద్ధాంతాలను మార్పు చేయకుండానే, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను, కాలానుగుణంగా వస్తున్న మార్పులను గమనంలోకి తీసుకొని తదనుగుణమైన మార్పుల్ని చేసుకొంటూ ముందుకు సాగుతోంది. అందుకే దేశంలోనే కార్యకర్తల పునాది గల పార్టీగా పేరుపొందింది. ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయడానికి, పార్టీ శ్రేణుల శక్తి సామర్థ్యాలను గరిష్ఠంగా ఉపయోగించుకొనేందుకు పార్టీ క్యాలెండర్‌ను మహానాడులో ప్రకటించే అవకాశం ఉంది.



43 ఏళ్ల చరిత్రగల తెలుగుదేశం దాదాపు 20 ఏళ్ల పాటు ప్రతిపక్షంలో ఉంది. అప్పుడు పార్టీ అనేక సంక్షోభాలు ఎదుర్కొంది. 1984 ఆగస్టులో ఎన్టీఆర్‌ను అక్రమంగా అధికారం నుంచి దింపినప్పుడు నెలరోజుల పాటు సాగించిన ప్రజాస్వామ్య పోరాటం, తిరిగి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కావడం ఓ ఉజ్వల అధ్యాయం. అలాగే 1989–94, 2004–2014, 2019–24 మధ్య కాలంలో ప్రతిపక్షనేతగా చంద్రబాబు చేసిన ఉద్యమాలు, నిరాహార దీక్షలు, అసెంబ్లీ వేదికగా నాటి ప్రభుత్వాల వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన తీరు, రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం జాతీయ స్థాయిలో వివిధ పార్టీల మద్దతుతో సాగించిన పోరాటాలు.. ఆ క్రమంలో ఎదుర్కొన్న అక్రమ కేసులు, అరెస్టులు.. ప్రతికూల పరిస్థితులలో పార్టీ శ్రేణులను ముందుకు నడిపించిన తీరు అపూర్వం. ప్రాంతం, కులం, మతం వంటి సంకుచిత భావాలకు అతీతంగా తెలుగు ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని చంద్రబాబు కాంక్షించారు. అందుకోసం నిరంతరం కృషి చేశారు. రాష్ట్ర విభజన సమయంలో రాజకీయ ప్రత్యర్థులు ఎంత రెచ్చగొట్టినా, ద్వేషం వెళ్లగక్కినా సంయమనం పాటించారు. రాష్ట్ర విభజనలో ఏ ప్రాంతానికీ అన్యాయం జరక్కూడదని చెప్పారు. అయితే ఇటీవల బీఆర్ఎస్ అధ్యక్షులు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ సభలో మాట్లాడుతూ "చంద్రబాబు నాయుడు సీఎంగా ఉండగా తెలంగాణ పదాన్ని వాడకుండా అసెంబ్లీలో నిషేధించారు" అని చెప్పారు. ఇది పూర్తిగా అవాస్తవం. చంద్రబాబు అనని మాటల్ని అన్నట్టుగా దుష్ప్రచారం చేయడం ఇది కొత్త కానప్పటికీ.. వాటిని తగిన రీతిలో ఖండించకపోతే అవే వాస్తవాలుగా స్థిరపడిపోతాయి. ఇటువంటి అంశాలను ఈ 'మహానాడు' స్పృశించి, వాస్తవాల్ని ప్రజలకు తెలియజెప్పాలి.

రాష్ట్ర విభజన వల్ల కలిగిన నష్టాలు, 2014–19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం మొదలుపెట్టిన అమరావతి, పోలవరం తదితర కార్యక్రమాల్ని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏ విధంగా విధ్వంసం చేసిందో చర్విత చరణం అయినా చెప్పకతప్పదు. ఐదేళ్ల ఆ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో నడవడం; వ్యవస్థలు కుప్పకూలడం; నాటి పాలకుల అవినీతి వల్ల ప్రజలపై పడిన ఆర్థికభారం, తదితర అంశాల ప్రస్తావన కూడా ఉంటుందని ఆశించవచ్చు. ఆ నేపథ్యంలోనే యువనేత నారా లోకేష్ చేపట్టిన నాలుగువేల కిలోమీటర్ల పాదయాత్ర; దానికి లభించిన స్పందన, ఆ సమయంలోనే చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టు, దరిమిలా ప్రజల్లో వచ్చిన తిరుగుబాటు, రాజకీయంగా తెలుగుదేశంతో కలిసి పోటీ చేస్తామన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటన, తదనంతరం బీజేపీ కలిసి రావడంతో ఎన్డీఏ కూటమి ఏర్పాటు కావడం తదితర అంశాలు ప్రస్తావనకు వస్తాయి.

2024 ఎన్నికలలో కూటమికి ప్రజలు అందించిన ఘనవిజయం, అధికారంలోకి వచ్చిన తదుపరి ఈ 11 నెలల కాలంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సాధించిన విజయాల ప్రస్తావనతోపాటు ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణం, ఆంధ్రుల కలల ప్రాజెక్టు పోలవరం తిరిగి పట్టాలెక్కడం.. వాటికి కేంద్రం అందించిన సాయం మొదలైన అంశాలు ఉంటాయని చెప్పవచ్చు. ఈ మహానాడు విశాల వేదిక నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందించిన 'విజన్ 2047' లక్ష్యాల సాధనతో పాటు పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతల తగ్గింపునకు చేపట్టిన పి–4 పథకాన్ని విజయవంతం చేయాలన్న సందేశాన్ని బలంగా పంపించవచ్చు.

పార్టీ సంస్థాగత విషయాలకొస్తే– ఈ మహానాడులోనే ప్రతిపాదిత మార్పులకు అనుగుణంగా తీర్మానం రూపొందించి ఆమోదిస్తారు. ఎప్పటికప్పుడు పార్టీలోకి కొత్త రక్తం రావాలని యువనేత నారా లోకేష్ ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడానికి ఇప్పటికే పార్టీ ఆమోదం తెలిపింది. సీనియర్ల అనుభవాన్ని వదులుకోకుండానే పార్టీ పునర్‌నిర్మాణం చేయడం అసాధ్యమేమీ కాదు. తెలుగుదేశం పార్టీ మొదట్నుంచీ మూల సిద్ధాంతాలను మార్పు చేయకుండానే, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను, కాలానుగుణంగా వస్తున్న మార్పులను గమనంలోకి తీసుకొని తదనుగుణమైన మార్పుల్ని క్రమంగా చేసుకొంటూ ముందుకు సాగడం వల్లనే భారతదేశంలోనే.. క్యాడర్ బేస్డ్ (కార్యకర్తల పునాది) గల పార్టీగా పేరుపడింది. ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణుల శక్తి సామర్థ్యాలను గరిష్ఠంగా ఉపయోగించుకొనేందుకు పార్టీ క్యాలెండర్‌ను ప్రకటించే అవకాశం కూడా ఉంది. మొత్తం మీద 'కడప మహానాడు' తెలుగుదేశం పార్టీ శ్రేణులలో నూతనోత్సాహం నింపుతుందని, రాష్ట్ర ప్రజానీకం ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని ఆశించవచ్చు.

● టి.డి. జనార్ధన్, విక్రమ్ పూల


ఆరోగ్య యోగం

యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులోని శారదా కాలేజీ జంక్షన్ వద్ద సోమవారం యోగాసనాలు వేశారు. కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు పాల్గొన్నారు.

8



• ఆగమేఘాలు



నైరుతి ఆగమనాన్ని సూచిస్తూ ప్రకాశం బ్యారేజీ వద్ద నగరాన్ని కమ్మేసిన నల్లటి మబ్బులు

విస్తారంగా..

నేటి నుంచి జిల్లాలో భారీ వర్షాలు

- జూన్ 2 వరకూ ఇదే పరిస్థితి
- ఉమ్మడి కృష్ణాకు ఎల్లో అలెర్ట్
- వారం రోజుల ఫోర్‌కాస్ట్ విడుదల చేసిన వాతావరణ శాఖ

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం, నైరుతి రుతుపవనాల దృష్ట్యా ఉమ్మడి కృష్ణాజిల్లాలో వచ్చే వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు వాతావరణ శాఖ సోమవారం ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం నుంచి వారం పాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. చిరుజల్లులతో మొదలై కుంభవృష్టిగా మారే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు ఉంటాయి. శివారు ప్రాంతాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఏటా జూన్ 10వ తేదీన తాకే నైరుతి రుతుపవనాలు ఈసారి జూన్ 2కు ముందే వస్తున్నాయి. రుతుపవనాలు ఇప్పటికే రాయలసీమను తాకినట్టు వాతావరణ శాఖ చెబుతోంది. కాగా, వాతావరణ శాఖ వారం రోజులకు ఫోర్‌కాస్ట్ ప్రకటించగా, జిల్లాలో పది రోజులపాటు వర్ష ప్రభావం ఉంటుందని అంచనా వేశారు.

ఓపిక పోతోంది!

- జీజీహెచ్ రిజిస్ట్రేషన్ సేవల్లో తీవ్ర అంతరాయం

6

చేపల మేతకు కోళ్ల వ్యర్థాలు వేస్తే చర్యలు

- పోలీస్, రెవెన్యూకు జిల్లా మత్స్యశాఖ అధికారి ఫిర్యాదు

8

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మానవత్వమా నువ్వెక్కడ?

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : మనుషుల్లో మానవత్వం రోజురోజుకూ కనుమరుగవుతుందనడానికి ఈ చిత్రమే నిదర్శనం. సోమవారం జీజీహెచ్‌లోని జనరల్ ఓపీ ఇచ్చే ప్రాంగణంలో రోగుల కోసం వేసిన బల్లల మధ్యలో ఓ వృద్ధురాలు ప్రాణాపాయ స్థితిలో గంటలకొద్దీ కొట్టుమిట్టాడినా అటు వైద్య సిబ్బంది కానీ, ఇటు ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులు కానీ పట్టించుకోలేదు. కనీసం ఆ వృద్ధురాలిని తీసుకెళ్లి వార్డుల్లో చేర్పించి వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోలేదు. ఆ వృద్ధురాలి ఒంటిపై ఆసుపత్రికి




చెందిన బెడ్‌షీట్ కప్పి ఉండగా, పక్కనే మందులు పెట్టి ఉన్నాయి. నాలుగు జిల్లాలకు పెద్దాసుపత్రిగా ఉన్న విజయవాడ జీజీహెచ్‌లో ఇలాంటి దయనీయ ఘటన చోటుచేసుకోవడం బాధాకరం.

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక జూన్ 2న

తిరువూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక జూన్ 2న నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ నోటీసు జారీ చేసింది. ఈ విషయాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ జి.లోవరాజు తెలిపారు. వైసీపీ కౌన్సిలర్ల మధ్య నెలకొన్న ఒప్పంద వివాదంతో ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. తొలుత ఈనెల 19న చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు చేయగా, సరిపడా సభ్యులు హాజరుకాలేదు. దీంతో ఎన్నిక వాయిదా వేశారు. 20వ తేదీన కూడా అదే పరిస్థితి ఉండటంతో ఎన్నిక రద్దయ్యింది. తాజాగా జూన్ 2న ఉప ఎన్నిక నిర్వహించాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

ఎవరి బలమెంత..?

వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు కూటమికి మద్దతు ఇస్తున్నారు. దీంతో పాలకవర్గంలో టీడీపీకి బలం పెరిగింది. మొత్తం 20స్థానాల్లో మిగతా 6లో..



తగలబడుతున్న ఆధారాలు, రికార్డులు

మూలపాడు పీఏసీఎస్‌లో నిధులు గోల్‌మాల్

రూ.కోటికి పైగా పక్కదారి పట్టిందంటున్న రైతులు

- ఇటీవల రిటైర్ అయిన కార్యదర్శి పనేనని ఆరోపణ
- పీఏసీఎస్‌లో ఒక్కసారిగా తగలబడిన రికార్డులు
- ఆధారాలు లేకుండా చేశారనే విమర్శలు

ఇబ్రహీంపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పీఏసీఎస్)లో భారీ ఎత్తున మిగతా 6లో..

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డుగోడలు

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో చీఫ్ ఇంజనీర్ల (సీఈల) వార్ నడుస్తోంది. ఓపక్క, జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పథకంలో భాగంగా భారీ ఎత్తున పనులు చేపట్టాల్సి ఉంది. పనిచేయించే ఉన్నతాధికారుల అవసరం ఉంది. కానీ, స్వలాభం, రాజకీయాలతో అట్టుడికిపోతున్న గొల్లపూడిలోని కార్యాలయంలో మాత్రం కొందరికే ప్రవేశం అన్నట్టుగా వ్యవహరిస్తూ.. ఇతర అధికారులు రాకుండా అడ్డుకుంటున్నారు.

చీఫ్ ఇంజనీర్ పోస్టు భర్తీ కాకుండా పన్నాగాలు

- ఈఎన్‌సీలో అన్నీ తామేనంటూ వ్యవహారాలు
- పదోన్నతి పొందిన సీఈకి ప్రవేశం కల్పించకుండా అడ్డంకులు
- ఉన్నతాధికారులు చెబుతున్నా వినని పరిస్థితి
- సిబ్బంది లేకపోవడంతో పనులు ముందుకు సాగని దుస్థితి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం భ్రష్టుపట్టింది. వందల కోట్ల రూపాయల అవినీతికి చిరునామాగా మారింది. జల్‌జీవన్ మిషన్ (జేఏఎం) పనులను అడ్డం పెట్టుకుని మెటీరియల్ ఎక్కడ కొనుగోలు చేయాలో కూడా అధికారులే సొంత నిర్ణయాలు తీసుకుని కాంట్రాక్టర్లతో కొనుగోలు చేయించారు. కమీషన్ల వ్యవహారాలు నడిపారు. అంతేకాదు.. అడ్డగోలుగా డిప్యూటేషన్లు ఇవ్వటం, ఆ మాటున భారీ ఎత్తున ముడుపులు అందుకోవడం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేయాల్సిన డీఈఈలు, ఇంజనీర్లు ఇతర డిపార్ట్‌మెంట్లకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేయటానికి డీఈఈలు, ఈఈలు, ఎస్ఈల కొరత ఏర్పడింది. నాడు కాసుల కోసం కక్కుర్తి పడి అడ్డగోలుగా డిప్యూటేషన్లు ఇవ్వటంతో ప్రస్తుతం ఈ శాఖలో పనిచేయటానికి అధికారులు లేకుండాపోయారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు డీఈఈగా వచ్చిన విద్యాసాగర్‌కు ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలతో పాటు ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పగించారు. అయితే, ఇక్కడ ఒక్క పని కూడా ముందుకు వెళ్లట్లేదని, సిబ్బంది లేరని, సెలవు పెట్టి వెళ్లిపోతానని ఏకంగా కలెక్టర్ లక్ష్మీశ దగ్గర మొర పెట్టుకున్నారంటే మిగతా 6లో..



మట్టి మాటలు కట్టిపెట్టోయ్..

పోలవరం మట్టిమాయంపై జలవనరుల శాఖ దిద్దు'పాట్లు'

- లెక్కలు సరిచేసే పనిలో చిత్ర విచిత్రాలు
- గన్నవరంలో పోయిన మట్టి ధవళేశ్వరానికి తరలించారట!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పోలవరం కుడికాల్వ మట్టి నిల్వలు కొల్లగొట్టడంపై జలవనరుల శాఖ అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగుతున్నారు. ఓవైపు విజిలెన్స్ తనిఖీలు, మరోవైపు ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తులు వస్తుండటంతో అధికారుల్లో కలవరం మిగతా 6లో..

గన్నవరంలో మట్టి హాంఫట్

గన్నవరం పరిధిలో కనిపించకుండా పోయిన పోలవరం మట్టికి అధికారులు కొత్త అర్థం చెబుతున్నారు. చైనేజీ నెంబర్లు 143లో 2,31,245 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 144లో 1,49,897 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 145లో 2,25,025 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 146లో 2,60,489 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 146.285లో 65,796 క్యూబిక్ మీటర్లు.. ఇలా మొత్తంగా 9,32,452 క్యూబిక్ మీటర్ల మట్టి దొంగతనానికి గురైందని సమాధానం ఇచ్చారు. అసలు ఇంత మట్టి దొంగతనానికి గురవుతుంటే, అధికారులు ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి.

ఓపిక పోతోంది!



రోగులతో నిండిపోయిన జీజీహెచ్ మెడికల్, ఓపీ కౌంటర్లు

- రిజిస్ట్రేషన్ సేవల్లో తీవ్ర అంతరాయం
- గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి
- టెస్టులకు ఒక రోజు.. రిపోర్ట్స్ సంగతి దేవుడెరుగు
- వైద్యానికి ముందే నీరసించిపోతున్న రోగులు
- వృద్ధుల పట్ల సిబ్బంది దురుసు ప్రవర్తన
- జీజీహెచ్‌లో పేదలకు తప్పని తిప్పలు

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి)

ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వాసుపత్రికి వస్తున్న రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఉదయం 10 గంటలకు వచ్చినవారు సాయంత్రానికి కానీ ఇంటికెళ్లే పరిస్థితి లేదు. వైద్యం జరుగుతుందా అంటే అదీ లేదు. కేవలం ఓపీ, రిజిస్ట్రేషన్.. అదీ కాదంటే ఏదో ఒక్క పరీక్ష అంతే.. సాధారణ జ్వరానికి చికిత్సకు వచ్చినా గంటల తరబడి నిరీక్షించాల్సిందే. ఓపీ సేవల నుంచి రిజిస్ట్రేషన్, మందులు తీసుకునే వరకు అన్ని రకాల సేవలకు కాలయాపన తప్పడం లేదు. నీరసంతో వస్తున్న రోగులకు ఆసుపత్రిలో సేవలు ఆలస్యం కావడంతో ఉన్న కాస్త ఓపిక నశించి పడిపోయే పరిస్థితి ఉందని రోగి బంధువులు, సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికిత్సకు వస్తున్న రోగులు కనీసం మధ్యాహ్నం భోజనం చేయలేని పరిస్థితి. వైద్యం మరింత ఆలస్యం అవుతుందేమోనని భయంతో రోగులు, వారి సహాయకులు తిండి తినకుండా వైద్యం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీనికి తోడు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోగితో పాటు వారి సహాయకులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులకు ఓపీ దగ్గరే ఓపిక పోతోంది. గంటల తరబడి క్యూలో వేచి ఉండడంతో పాటు పరీక్షలకు ఎటు వెళ్లాలో తెలీక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. మంగళ, శనివారం తప్ప మిగతా రోజుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఓపీ కౌంటర్లు, సిబ్బంది సంఖ్య పెంచి రోగులకు సత్వర వైద్యం జరిగేలా చూడాల్సిన అధికారులు అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బ్లాకుల్లో అయితే రిజిస్ట్రేషన్ చేసే దగ్గర ఒకే కంప్యూటర్ ఉండటంతో క్యూలు బారులు తీరి ఉంటున్నాయి. రిజిస్ట్రేషన్ వద్ద మరింత సమయం పడుతోంది. టెస్టులకు సంబంధిత రోగులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి కనీసం గంటన్నరకు పైగా వేచి చూడాల్సిందే. దీంతో రోగులు వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటికే అనేక సమస్యలతో ఆసుపత్రికి వస్తున్న రోగులు గంటల తరబడి వేచి ఉండలేక అవస్థలు పడుతున్నారు.



జనరల్ ఓపీ వద్ద బారులు తీరిన రోగులు

పరీక్షలకు 'టెస్టు'.. రిపోర్ట్స్ తర్వాత రోజే..

ఓపీ, రిజిస్ట్రేషన్ కోసం కాలయాపన చేసి సంబంధిత పరీక్షలు చేయించుకోవడానికి వస్తే అక్కడా కాలయాపన తప్పడం లేదు. ఇవన్నీ దాటుకుని పరీక్షలకు వచ్చేసరికి మధ్యాహ్నం అవుతుంది. ఉదయం రక్త పరీక్ష చేయించుకుంటే రిపోర్ట్స్ సాయంత్రానికి వస్తున్నాయని రోగుల బంధువులు వాపోతున్నారు. దూరప్రాంతాల నుంచి ఎలాగోలా టెస్టులు చేయించుకుని రోగానికి సంబంధిత వైద్యుడిని సంప్రదించాలనో.. లేక వ్యాధికి తగ్గ మందులు తీసుకుని ఇంటికి పోదామనుకున్న వారు చాలామంది ఉంటారు. ఇది కాకుండా కొంతమంది మూడు నాలుగు పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఆసుపత్రిలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక టెస్టు చేయించుకోవడానికే రోజు పడుతుంది. అలాంటిది అన్ని పరీక్షలు చేయించుకోవాలంటే ఇంకెన్ని రోజులు పడుతోందోనని రోగులు, వారి సహాయకులు భయపడుతున్నారు. వేలల్లో ఖర్చుపెట్టి కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని పరిస్థితి వారిది. దీంతో ఎన్నిరోజులైనా ప్రభుత్వాసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాల్సిందే. తిరువూరుకు చెందిన ఓ వృద్ధుడి పరిస్థితి ఇదే. మూడు టెస్టులు రాస్తే కేవలం రక్తపరీక్ష మాత్రమే చేశారు. ఈ పరీక్ష రిపోర్టు కూడా సాయంత్రానికి ఇస్తామనడం, మిగతా రెండు టెస్టులకు మరుసటి రోజు రమ్మనడంతో నిరాసగా వెనుదిరిగాడు.



మూడో బ్లాక్‌లో రిజిస్ట్రేషన్ లైన్

దుర్గంధం మధ్యే రోగులకు వైద్యం

ఆసుపత్రిలో ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. ప్రధానంగా మూడో బ్లాక్‌లో రిజిస్ట్రేషన్, రిపోర్ట్స్ ఇచ్చే ప్రాంతంలో రోగులకు ఏర్పాటు చేసిన కుర్చీల పక్కనున్న కిటికీల్లోంచి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోంది. రోగులు ముక్కు మూసుకుని మరీ వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే వారు శుభ్రతపై పెదవి విరుస్తున్నారు. కరోనా సమయంలో నగరంలో పెద్దాసుపత్రిలోనే ఇలాంటి పరిస్థితులు ఉండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



స్ట్రెచర్, వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న రోగుల బంధువులు, సహాయకులు

ఎండైనా, వానైనా భరించాల్సిందే..

ముఖ్యంగా ఎమర్జెన్సీ, కాళ్లు, చేతులు విరిగిన రోగులను జనరల్ ఆసుపత్రి వార్డులలో నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులను సూపర్ స్పెషాలిటీకి తీసుకెళ్లే సమయంలో భరించలేని ఎండ ఉన్నా, వర్షం పడినా వారు తట్టుకోవాల్సిందే. లేకపోతే ఎండ, వర్షం తగ్గే వరకు వేచిచూడాలి. ఈ లోగా వైద్యులు ఉంటారో, ఉండరో తెలీని పరిస్థితి. అప్పటికే జబ్బులు, విరిగిన ఎముకల నొప్పులతో బాధపడుతున్న రోగులను తీసుకెళ్లే సమయంలో కొంతమంది నొప్పిని భరించలేక విలవిల్లాడడం చూస్తున్న వారికి బాధ కలిగించింది. ముఖ్యంగా వర్షం పడే సమయంలో రోగులను తీసుకెళ్లలేక, డాక్టర్లు వెళ్లిపోతారేమోనని భయంతో సమయాన్ని వృధా చేయలేక ఇబ్బంది పడుతున్నారు. జనరల్ వార్డు నుంచి సూపర్ స్పెషాలిటీకి రోగులను చక్రాల కుర్చీ, స్ట్రెచర్‌పై తీసుకెళ్లడానికి రోగితో వచ్చిన వారే దిక్కు. రోగులను తీసుకెళ్లాల్సిన సిబ్బంది ఎక్కడా కనిపించరో లేక అసలు లేరో అర్థం కావడం లేదని రోగుల సహాయకులు అంటున్నారు. సోమవారం సూపర్ స్పెషాలిటీ నుంచి రోగిని బయటకు తీసుకువస్తున్న సమయంలో స్ట్రెచర్‌కు ఒక వీల్ ఊడిపోవడం గమనార్హం. జనరల్ ఆసుపత్రికి, సూపర్ స్పెషాలిటీకి మధ్య ఉన్న సుమారు 200 మీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ ప్రాంతంలో చదునైన రోడ్డు వేయడంతో పాటు షెడ్డు నిర్మించి రోగులకు రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలిని అనుపత్రికి వచ్చే రోగుల బంధువులు, సహాయకులు కోరుతున్నారు.



ఊడిపోయిన స్ట్రెచర్ వీల్‌ను సరిచేస్తున్న రోగి బంధువులు



బొప్పాయి కోస్తే లోన మరోకాయ

బాపయ్య ఇంట వింత బొప్పాయి!

- విస్తుగొల్పుతున్న కాయ లోపల కాయలు



గుడ్లవల్లేరులోని సూర్యదేవర బాపయ్య సంత వ్యాపారి. ఆయన ఇంటి పెరట్లో బొప్పాయి చెట్టుకి వింత కాయలు కాస్తున్నాయి. ఇంట్లో వారు బొప్పాయిని తినేందుకు కోయగా కాయలో ఇంకోకాయ, అదీ కోస్తే మరోకాయ ఉండటంతో తొలుత కంగారు పడ్డారు. తర్వాత మరోకాయ కోసినా అదే విధంగా ఉండటంతో ఆశ్చర్యానికి గురయ్యారు. కాయల్లో గింజలు ఉండటంలేదు. చెట్టుకు కాసిన కాయల్లో మూడొంతులు అదే విధంగా ఉంటున్నాయి. గతంలో ఇలా ఎపుడూ కాయలేదని బాపయ్య కుటుంబసభ్యులు చెబుతున్నారు. కాయలోని కాయ కూడా రుచి బాగానే ఉందని, లోపలి కాయకు తొక్క మాత్రం లేదని చెప్పారు. వింత బొప్పాయిలను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. - గుడ్లవల్లేరు

మూలపాడు పీఏసీఎస్‌లో నిధులు గోల్‌మాల్

(5వ పేజీ తరువాయి)

నిధులు గోల్‌మాల్ అయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూరేలా సోమవారం ఒక్కసారిగా కార్యాలయ ఆవరణలో కొన్ని పత్రాలు దహనమయ్యాయి. అసలు తగలబెట్టిన కాగితాలు ఏమిటి? నిధులు స్వాహాపర్వం బయటపడే ఆధారాలేనా? అసలు ఇప్పుడెందుకు వాటిని తగలబెట్టాల్సి వచ్చింది.. అనే ప్రశ్నలకు సిబ్బంది నుంచి సమాధానాల్లేవు. ఇక్కడే పనిచేసి, ఈ మధ్యకాలంలో రిటైరైన ఉద్యోగి (కార్యదర్శి) ఈ నిధులు గోల్‌మాల్ చేశాడని రైతులు ఆరోపిస్తున్నారు. కేవలం రెండు, మూడు నెలల్లోనే ఈ గోల్‌మాల్ జరిగినట్లు వారు చెబుతున్నారు. తాము సొసైటీ నుంచి తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను చెల్లించేశామని, వాటిని మాన్యువల్‌గా రసీదు రాసిచ్చి, రికవరీ చేసిన బకాయి సొమ్ము బ్యాంకులో జమ చేయకుండా, ఆన్‌లైన్ చేయకుండా మోసానికి పాల్పడినట్లు చెబుతున్నారు. ఇలా చేసిన ఆ ఉద్యోగి గత నెలాఖరున రిటైరయ్యారని, ఇన్‌చార్జికి బాధ్యతలు అప్పగించే సమయంలో బ్యాంకు నుంచి తెచ్చిన ఐదు రసీదు పుస్తకాల్లో నాలుగే అప్పగించి, ఒకటి తన వద్దే ఉంచుకున్నాడని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న ఆడిట్‌లో ఈ విషయం వెలుగు చూసినట్లు బాధిత రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, నిధులు గోల్‌మాల్ చేసిన ఉద్యోగిని నిలదీయగా, కొంత నగదు చెల్లించినట్లు తెలుస్తోంది.

పీఏసీఎస్‌లపై సడిలిపోతున్న నమ్మకం

ఒకప్పుడు పీఏసీఎస్‌లు అంటే రైతులకు ఎంతో నమ్మకం ఉండేది. కాలక్రమంలో అది సన్నగిల్లుతూ వస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో త్రీమ్యాన్ కమిటీ విధానం పీఏసీఎస్‌లను ముంచేలా చేసింది. అప్పటి వరకు పీఏసీఎస్‌లకు అధ్యక్షుడు, బాడీ ఉండేది. ఏదైనా జరిగితే వారు జవాబుదారీగా ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎన్నికలు లేకుండా ఏకంగా త్రీ మ్యాన్ కమిటీని పెట్టి ఐదేళ్లలో అనేక అక్రమాలు జరిగేందుకు దారి వేశారు. మూలపాడు పీఏసీఎస్‌లో జరిగిన కుంభకోణం వెనుక కూడా త్రీమ్యాన్ కమిటీ పాత్ర ఎంతవరకు ఉందనే సందేహాలు కలుగుతున్నాయి. గత ఏడాది రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ పీఏసీఎస్‌లో సుమారు రూ.1.5 కోట్ల నిధులు స్వాహా అయ్యాయి. అప్పట్లో అధికారులు ఆ డబ్బు రికవరీ చేయించారు. అంతకుముందు జి.కొండూరు పీఏసీఎస్‌లోను ఇలానే గోల్‌మాల్ వ్యవహారం బయటకు వచ్చింది. ఇప్పుడు మూలపాడు పీఏసీఎస్‌లో కూడా ఇలాగే జరగడంతో ఉన్నతాధికారులు ఎందుకు మిన్నకుంటున్నారనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీ చేశాక చెబుతాం..

ప్రస్తుతం సొసైటీలో ఆడిట్ జరుగుతోంది. రికార్డులు పూర్తిగా తనిఖీ చేశాక మాత్రమే నిధులు స్వాహా అయ్యిందీ, లేనిదీ చెబుతాం. ఇప్పుడు ఏ విషయం చెప్పలేం. ఒకవేళ నిధులు స్వాహా చేసి ఉంటే కచ్చితంగా చర్యలుంటాయి.

- స్వరూప, కేడీసీసీ బ్యాంకు మేనేజర్, ఇబ్రహీంపట్నం

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తా

- దేవస్థానంలో అభివృద్ధి పనులు వేగవంతం
- దుర్గగుడి ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మే 26 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులే పెన్నిధి అని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తానని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ తెలిపారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆరో అంతస్తులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవోగా బాధ్యతలు చేపట్టాక చాలా అంశాలను పరిశీలించి కొంత అవగాహనకు వచ్చానని, ఇంకా పరిశీలించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా దేవస్థానానికి సంబంధించి పార్కింగ్ సమస్య జటిలంగా ఉందని, దీనిని పరిష్కరించేందుకు వివిధ కోణాల్లో పరిశీలన చేస్తున్నామన్నారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, పున్నమిఘాట్ నుంచి దేవస్థానం బస్సులు ఏర్పాటు చేసి కొండపైన ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా నాలుగు ఎకరాల ఖాళీ స్థలం ఉందని, అక్కడ పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మరోవైపు కుమ్మరిపాలెం సెంటర్‌లో టీటీడీ స్థలాన్ని కూడా వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పున్నమిఘాట్ వద్ద భక్తులు వాహనాలను పార్కింగ్ చేసుకున్నట్టయితే అక్కడ నుంచి దేవస్థానం బస్సుల్లో కొండపైకి చేరుకోవచ్చన్నారు. భక్తులు ఈ విషయంలో పూర్తిగా సహకరించాలన్నారు. భక్తులు ఎక్కువ మంది నదిలో పుణ్యస్నానాలు చేసేందుకు దుర్గాఘాట్‌ను విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని, అందుకుగాను సంబంధిత ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. కేంద్ర పథకమైన పిలిగ్రిమేజ్ రెజువనేషన్ అండ్ స్పిర్చ్యువల్ ఆగుమెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) పథకం కింద పలు అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి సహాయం తీసుకునేందుకు దేవదాయశాఖ మంత్రి, విజయవాడ ఎంపీ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారని, త్వరలోనే కేంద్రం నుంచి సానుకూల స్పందన రావచ్చునన్న అభిప్రాయం ఉందని తెలిపారు. అమ్మవారి నైవేద్యం నిమిత్తం 11.30 నుంచి 1.30 గంటల వరకు వీఐపీ దర్శనాలను నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. దేవస్థానంలో రాతి యాగశాల, పూజామండపాలు, శ్రావణమాసంలోగా అందుబాటులోకి వస్తాయన్నారు. అన్నదాన భవనం, లడ్డూ తయారీ భవనం దసరా ఉత్సవాల నాటికి సిద్ధమవుతాయని, అప్పటికి వాటిని వినియోగంలోకి తేవటానికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టామని తెలిపారు. మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన నవగ్రహ మండపం పునఃప్రతిష్ఠ కార్యక్రమం జూన్ 3, 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ-గవర్నెన్స్ ద్వారా వాట్సాప్ సేవలు అందిస్తూ విరాళాలు చెల్లించటం, ఆర్జిత సేవల బుకింగ్‌లు భక్తులు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సహకారం, దాతల తోడ్పాటుతో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈవో తెలిపారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, ఉపప్రధాన అర్చకుడు కోటా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

దుర్గగుడి ఏఈఓ దుర్గారావు బదిలీ

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.దుర్గారావును ద్వారకా తిరుమలలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ సోమవారం దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ పి.చంద్రకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న బి.వెంకటరెడ్డిని దుర్గామల్లేశ్వర దేవస్థానానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

కామధేనుతో పాడిరైతులకు సకల శుభాలు

- దేవనాథ్ జీయర్‌స్వామి
- వీరవల్లి ప్రాజెక్టులో వైభవంగా సీతారామ, లక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి మహా కుంభాభిషేకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు బలవర్ధక ఆహారమైన పాలు, పాల ఉత్పత్తులను అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో అందిస్తూ 60 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ భగవత్ అనుగ్రహంతో అవాంతరాలను అధిగమించి పాడి రైతు కుటుంబాలతో పాటు ప్రజలకు సకల శుభాలను అందిస్తున్న వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(విజయ పాల ఫ్యాక్టరీ) మరింతగా వృద్ధి చెందాలని దేవనాథ్ జీయర్‌స్వామి అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ ఆవరణలోని సీతారామ, లక్షణ సమేత దాసాంజనేయస్వామి దేవస్థానంలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు దంపతులు నిర్వహించిన మండల పూజ, మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. వేద మంత్రోచ్చరణల మధ్య మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణులను భుజాలపై మోస్తూ భక్తులకు దర్శనమిచ్చే దాసాంజనేయస్వామి దేశంలోనే రెండవదని దేవనాథ్ జీయర్ స్వామి తెలిపారు. గో సంరక్షణ పాడిరైతు కుటుంబాలతో పాటు ప్రజలకు సకల శుభాలు అందిస్తుందని, అలాగే ప్రాజెక్ట్ కామధేను కూడా అందరికీ సకల శుభాలనందిస్తుందన్నారు. దైవశక్తి ద్వారా మాత్రమే ఎన్నో అవాంతరాలను అధిగమించి లక్షాయాభైవేల పాడిరైతుల సహకారంతో కృష్ణామిల్క్ యూనియన్ వ్యవస్థ మనగలుగుతున్నదని చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో దాసరి బాలవర్ధనరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





వీరవల్లి కామధేనులోని సీతారామ,లక్షణ సమేత దాసాంజనేయ స్వామి మహా కుంభాభిషేక పూజలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, దేవనాథ్ జీయర్‌స్వామి

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక జూన్ 2న

(5వ పేజీ తరువాయి)

టీడీపీకి ముగ్గురు, వైసీపీకి 17 మంది సభ్యులు ఉన్నారు. కానీ, వైసీపీ సభ్యుల్లో నెలకొన్న సంక్షోభం కారణంగా ఆ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు టీడీపీవైపు మొగ్గారు. ఎమ్మెల్యే ఓటుతో కలిపి టీడీపీ సంఖ్యాబలం 9కి చేరింది. మరికొందరు వైసీపీ సభ్యులు కూడా కూటమికి మద్దతు ఇచ్చే పరిస్థితి ఉండగా, ఈ నెల 19న జరగాల్సిన చైర్‌పర్సన్ ఎన్నికలో వారు పాల్గొనకుండా వైసీపీ నాయకులు నిర్బంధించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత టీడీపీ, వైసీపీ సభ్యుల సంఖ్యాబలంపై పట్టణంలో ఊహాగానాలు మొదలవగా, ఈ ఉప ఎన్నికలో చైర్‌పర్సన్ పదవిని ఎలాగైనా కైవసం చేసుకునేందుకు రెండు పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి.

పేర్ని వ్యాఖ్యలు వైద్యుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశాయి: ఏపీజీడీఏ

వన్‌టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు వైద్యుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశాయని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం పేర్కొంది. ఈమేరకు అధ్యక్షుడు డాక్టర్ వీవీ నారాయణరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జి శ్యామకుమార్, సంఘ సభ్యులు డాక్టర్ భానుకుమార్, డాక్టర్ ఇందిర, డాక్టర్ స్వరూప్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "వెధవ, చంచాగిరి... వంటి మాటలతో అవమానిస్తూ మాట్లాడారు. పేర్ని నాని వ్యాఖ్యల పట్ల తీవ్ర నిరసన తెలుపుతున్నాం. గౌరవ ప్రదమైన మంత్రి పదవిని నిర్వహించటంతో పాటు విద్యాధికుడు అయిన పేర్ని అలా మాట్లాడటం తగదు. వైద్యులు చేసే చికిత్సల్లో ఏదైనా లోపం ఉంటే పై అధికారులకుగాని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి గాని ఫిర్యాదు చేయవచ్చు. దానిని బట్టి చర్యలు ఉంటాయి. అంతేకాని ఇష్టానుసారం దూషణలకు దిగటం సరికాదు. వైద్యులు రాజకీయాలకు అతీతంగా రోగులకు సేవలు అందిస్తారు. విధి నిర్వహణలో వైద్యుల అలక్ష్యం ఏదీ ఉండదు. బాధతో వచ్చిన రోగులకు చికిత్స చేసి స్వాంతన చేకూర్చటమే మా ప్రధాన బాధ్యత. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని వారు పేర్కొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డుగోడలు

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

అడుగడుగునా అడ్డంకులు

ఈఎన్‌సీ కార్యాలయంలో ఒక ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ), నాలుగు చీఫ్ ఇంజనీర్ల (సీఈ) పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఈఎన్‌సీ కార్యాలయంలో గాయత్రి, నాయక్, భాషా, సత్యనారాయణ చీఫ్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఈఎన్‌సీగా పనిచేసిన కృష్ణారెడ్డి పదవీ విరమణ తర్వాత అప్పటి చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సంజీవ్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించారు. సంజీవ్‌రెడ్డి పదవీ విరమణ నేపథ్యంలో మరో చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న గాయత్రీకి ఈఎన్‌సీగా బాధ్యతలిచ్చారు. గాయత్రికి ఎలాగూ ఈఎన్‌సీ ఇన్‌చార్జి ఇచ్చారు కాబట్టి ఆమె ఆ పోస్టులో వేతనం తీసుకోవచ్చు. కానీ, అలా చేయట్లేదు. ఒకవేళ గాయత్రి ఈఎన్‌సీ పోస్టులో వేతనం తీసుకుంటే.. మరో సీఈ పోస్టును భర్తీ చేసుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా చీఫ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాలో నెక్కంటి వెంకట సత్యనారాయణ, ఏషన్ భాషా, వెంకట రమణ ఉన్నారు. ఈ ముగ్గురూ ఒకేసారి పదోన్నతి అందుకున్నారు. వీరిలో ఏషన్ భాషాపై చార్జెస్ ఉండటంతో ఆయన కోర్టుకెళ్లి పోస్టు తెచ్చుకున్నారు. నెక్కంటికి చీఫ్ ఇంజనీర్‌గా అవకాశం కల్పించిన ఈఎన్‌సీ కార్యాలయం ఉన్నతాధికారులు వెంకట రమణకు మాత్రం ఇవ్వడానికి ఇష్టపడట్లేదు. ఖాళీలు లేవని, ఆయన్ను తీసుకోవటం కుదరదని ఇన్‌చార్జి ఈఎన్‌సీ గాయత్రి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆమె ఈఎన్‌సీ హోదాలో జీతం తీసుకుంటే, సమస్య పరిష్కారమవుతుందని ఉన్నతాధికారులు సూచించినా ఆ పని చేయట్లేదు. కాగా, ఈఎన్‌సీ కార్యాలయంలో పని చేయడానికి వెంకట రమణ ఎంతో పోరాడినా అడుగడుగునా అడ్డు పడుతూ వచ్చారు. చేసేదేమీ లేక ఆయన మరో డిపార్ట్‌మెంట్‌కు వెళ్లిపోవడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈఎన్‌సీ కార్యాలయంలో తగినంతగా అధికారులు లేకపోతే, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు తీసుకెళ్లే పరిస్థితి లేకపోయినా.. ఇష్టానురీతిన వ్యవహరిస్తున్నారు.

మట్టి మాటలు కట్టిపెట్టోయ్..

(5వ పేజీ తరువాయి)

మొదలైంది. పోలవరం కాల్వగట్టు వెంబడి నిల్వ చేసిన మట్టిని వైసీపీ హయాంలో కొందరు అక్రమంగా తరలించుకుపోగా, వారికి కొందరు అధికారులు సహకరించారు. దీంతో ఈ వ్యవహారంలో బాధ్యత వహించాల్సి వస్తుందేమోనన్న భయంతో జలవనరుల శాఖ అధికారులు లెక్కలు సరిచేసుకునే పని మొదలుపెట్టారు. దీంతో సమాచార హక్కు దరఖాస్తులకు అధికారుల నుంచి చిత్రమైన సమాధానాలు వస్తున్నాయి. పోలవరంలో కరిగిపోయిన మట్టి గుట్టల పరిమాణాన్ని తగ్గించేందుకు పావులు కదుపుతున్నారన్న విమర్శలూ లేకపోలేదు.

విచిత్ర సమాధానాలు

కనిపించకుండా పోయిన మట్టి కొంత ఇరిగేషన్ అవసరాల కోసం తరలించాల్సి వచ్చిందని, కొంత దొంగతనాలకు గురైందన్న వివరాలను కూడా జలవనరుల శాఖ అధికారులు పొందుపరుస్తున్నట్టు సమాచారం. పోలవరం సీఈ ఆదేశాల మేరకు ధవళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం భారీగా మట్టిని తరలించినట్టుగా కూడా చూపటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బీబీగూడెం, గన్నవరంలో 19,86,333 క్యూబిక్‌మీటర్ల మట్టిని తరలించినట్టుగా చూపారు. ధవళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఇక్కడి నుంచి మట్టి తీసుకెళ్లడమేమిటో అర్థంకాని విషయం. అక్కడే స్థానికంగా పెద్ద ఎత్తున మట్టి లభిస్తుంది. ఇక్కడి నుంచి తరలించడం వల్ల అధిక రవాణా వ్యయమవుతుంది. ఇంత ఖర్చుచేసి ధవళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు మట్టి తీసుకెళ్లాల్సిన అవసరమేమిటో అధికారులే చెప్పాలి.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

గంజాయి స్వాధీనం: ముగ్గురిపై కేసు నమోదు

పాయకాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిపై నున్న రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన రాజేష్‌తో పాటు మరో మైనర్ బాలుడు కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా రాజేష్, మైనర్ బాలుడు వద్ద 1.2 కేజీ గంజాయి ఉండటాన్ని గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా కాలనీకి చెందిన రత్నబాబు అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు నిందితులు ఇద్దరు ఒప్పుకున్నారు. రత్నబాబు పరారీలో ఉండగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదులపై దృష్టి సారించాలి

అధికారులకు అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆదేశం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్

కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల నుండి ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని వేగంగా, సమర్ధవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికనం(పీజీఆర్ఎస్) అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం అందేలా చూడటమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజా ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు వాటి పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 20 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఈ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈలు పి. సత్యకుమారి, సత్యనారాయణ, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అనురాధ పాలిక్లినిక్ ఎదురుగా ఖాళీ ప్రదేశంలో పెరిగిన పొదలు

ఇళ్ల మధ్యలో పొదలు

పటమట, ఆంధ్రజ్యోతి: 10వ డివిజన్ ఆర్ఆర్ గార్డెన్ ప్రాంతంలో అనురాధ పాలిక్లినిక్ ఎదురుగా ఇళ్ల మధ్యలో దట్టంగా పొదలు పెరిగాయి. స్థల యజమాని పట్టించుకోకపోవడంతో ఆప్రాంతం అంతా చిట్టడవిని తలపిస్తోంది. దోమలకు, కీటకాలకు, విష సర్పాలకు ఆవాసం కాకముందే స్థల యజమాని, అధికారులు పిచ్చి మొక్కలను, పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



మహానాడుకు తరలివెళుతున్న రాణిగారితోట టీడీపీ నాయకులు

మహానాడుకు తరలిన పసుపు సేన

రాణిగారితోట, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న మహానాడు కార్యక్రమానికి రాణిగారితోట నుంచి పసుపు సేన తరలి వెళ్లింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా టీడీపీ నిర్వహిస్తున్న ఈ మహత్తర కార్యక్రమానిక ఎంతో ఉత్సాహంగా వెళుతున్నామని పార్టీ నాయకులు చెబుతున్నారు. రాణిగారితోట 17,18 డివిజన్ల నుంచి టీడీపీ నాయకులు కొప్పోలు శ్రీనివాస్ చౌదరి, వేముల దుర్గారావుల ఆధ్వర్యంలో తరలివెళ్లారు. 20వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా, 22వ డివిజన్ అధ్యక్షుడు అన్నారావు, పీరుబాబు, సాగర్, పగడాల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పటమట సెంటర్ కెనరా బ్యాంక్ పక్కనే ఉన్న ఓపెన్ డ్రెయిన్

డ్రెయినేజీపై మెస్ ఏర్పాటు చేయాలి

పటమట,ఆంధ్రజ్యోతి: కెనరా బ్యాంక్ పక్కన ఎన్టీఆర్ సర్కిల్‌లో చింతల ఓబయ్య వీధి ప్రారంభంలో ఓపెన్ డ్రెయినేజీ ప్రమాదకరంగా ఉంది. ఎలాంటి రక్షణ లేదు. ఏమరపాటుగా ఉంటే ఈ డ్రెయినేజీలో పడి ప్రమాదం బారిన పడతారు. దానిపై మెస్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో సమస్యలు కోకొల్లలు

పూడికతో నిండిన డ్రెయినేజీలు, రోడ్లపై నిల్వ ఉంటున్న వాన నీరు, తరచూ పొంగుతున్న మ్యాన్‌హోల్స్



పార్కు రోడ్డులో చెత్తతో నిండిన సైడు డ్రెయిన్, కాలనీ మెయిన్ డ్రెయిన్‌లో నిలిచిన వాన నీరు, లిప్ హాస్పిటల్ రోడ్డులో రెండు రోజుల నుంచి నిలిచిన వాన నీరు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: అసలే పల్లం రోడ్లు దానికి తోడు పూడికతో నిండిన సైడు కాలువలతో కనకదుర్గ గెజిటెడ్ఆఫీసర్స్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు .తూర్పు నియోజక వర్గంలోని నాల్గో డివిజన్ పరిధి కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని ప్రధాన సమస్యలపై గత కొంతకాలంగా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ప్రస్తుతం సమస్యల నిలయంగా మారింది. ప్రధాన, అంతర్గత రోడ్లో పూడికతో నిండిన డ్రెయినేజీ వ్యవస్థ, కాలనీ అంతర్గత రోడ్డుపై రోజుల తరబడి నిల్వ ఉంటున్న వాన నీరు, తరుచూ పొంగుతున్న మ్యాన్ హోల్స్ వంటి సమస్యలు కాలనీలోని ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ప్రజలు మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమం ప్రచారాలకే తప్ప ఆచరణలో కనిపించడం లేదని బహిరంగంగా విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గత కొంత కాలంగా కాలనీలో ఉన్న సైడ్ కాలువలు మొత్తం పూడికతో నిండిపోవడం వల్ల, రోడ్డు పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా అంతర్గతరోడ్లు నీటితో మునిగిపోతున్నాయి. ప్రధాన డ్రెయినేజీలలో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని స్థానికులు అంటున్నారు.

ఆధార్ కష్టాలు

- కార్వే వద్ద పడిగాపులు
- గంటల కొద్ది నిరీక్షణ
- ఇక్కడికి వచ్చేవారితో ట్రాఫిక్ సమస్య



కార్వే కార్యాలయం వద్ద బారులు తీరిన ప్రజలు

లబ్బీపేట, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు మరో 10రోజుల్లో స్కూల్స్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆధార్‌లోని సవరణ కోసం ప్రజలు ఆధార్ సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు. బందర్ రోడ్డులోని కార్వే వద్ద ఆధార్‌లోని మార్పులు, చేర్పులు, సవరణలకు నిత్యం ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఆధార్‌లోని సవరణల కోసం ప్రతిరోజు వందమందికి పైగా ఈ కార్యాలయం వద్ద రోడ్డుపై బారులు తీరుతున్నారు. నగరంలో కొన్ని బ్యాంకులు, పోస్టాఫీసులలో ఆధార్ సవరణ కేంద్రాలు అందుబాటులో ఉన్నా వందలాంది మంది కార్వే కార్యాలయాన్ని ఆశ్రయిస్తుండడంతో రద్దీ విపరీతంగా ఉండి గంటల తరబడి సమయాన్ని కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడకి వచ్చే వారితో మరో సమస్య ప్రధానంగా ఉత్పన్నమవుతుంది. వందలాదిగా వచ్చే వారితో పాటు వారు తీసుకువచ్చే వాహనాలకు సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా పెట్టే వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య ట్రాఫిక్ పోలీసులకు తలనొప్పిగా మారింది. నగరానికి ప్రధాన మార్గంతో పాటు, నిత్యం మంత్రులు, అధికారులతో పాటు ముఖ్యమైన వ్యక్తులు వెళ్లే మార్గం కావడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యతో తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు పక్కనే బ్యాంక్ ఉండడంతో అక్కడికి వచ్చే వారి వాహనాలతో సమస్య మరింత జటిలం అవుతుంది.

అవగాహన లేక..

ఆధార్ సవరణ కేంద్రాలపై అవగాహన లేకపోవడం వల్లే కార్వే వద్దకు బారులుతీరుతున్నారు. దీనికి తోడు ఆధార్ సేవలు అందించే బ్యాం కులు, పోస్టల్ కార్యాలయాల్లో ప్రతిరోజు ఉదయం 30నుంచి 50వరకు టోకెన్లు ఇచ్చి అనంతరం సవరణలు చేస్తారు. అయితే ఆధార్ సవరణ కేంద్రాలు సంఖ్య మరింత పెంచితే గాని ఈ సమస్యకు పరిష్కారం లభించదు. ఆ విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఎస్ఆర్‌కేలో ముగిసిన గణిత బోధన తరగతులు

టెన్త్‌లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు గద్దె సత్కారం



విద్యార్థినులను సత్కరించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ), అమరావతి బాలోత్సవ్ సంయుక్తంగా మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ పాఠశాలలో నెలరోజులు నిర్వహించిన వేసవి ఉచిత మ్యాథ్స్ బోధన తరగతుల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరయ్యారు. పదవ తరగతి పరిక్షల్లో అత్యధికమార్కులు సాధించిన ఎస్‌కే ఆయేషా, కె. లలిత,ఎస్. ప్రదీప్తి, కె.సంకీర్తనలతో పాటు ఉచిత శిక్షణా తరగతుల్లో మ్యాథ్స్ బోధించిన ఎస్. లెనిన్ బాబును ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కావూరి సత్యవతి, అమ్మ అధ్యక్షుడు గారపాటి సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు దోనేపూడి దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని దుర్గామల్లిఖార్జునరావు, మాజీ అధ్యక్షులు బొబ్బానారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణాన్ని సందర్శించిన కమిషనర్

మొగల్రాజపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలను తనిఖీ చేయడానికి నూతనంగా రూపొందించిన యాప్ పనితీరును రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్‌గౌర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. నగరంలో సర్కిల్-2 పరిధిలో పటమట 263 రేషన్ షాపును సోమవారం ఆయన సందర్శించారు. యాప్‌లో అప్‌లోడ్ చేసిన విధానం, అప్‌లోడ్ చేస్తున్న డేటా సక్రమంగా నమోదు అవుతుందా లేదా స్టాకు వివరాలు నమోదు విధానం స్వయంగా పరిశీలించారు. అనంతరం షాపు పరిశుభ్రంగా ఉందా లేదా, స్టాకు బోర్డు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో శ్రీనివాసులునాయుడు, ఆర్ఐ కిషోర్, డీలర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే గద్దె



చెస్ క్రీడాకారుడు శౌర్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మే 26 (ఆంధ్రజ్యోతి): క్రీడా రంగానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చి క్రీడాకారులను పోత్సహిస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. కరెన్సీ నగర్‌కు చెందిన చెస్ క్రీడాకారులు కొండ్రు శౌర్య స్టేట్ అండర్ - 11 బాలుర చెస్ టోర్నమెంట్‌లో బంగారు పతకం గెలిచిన సందర్భంగా సోమవారం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడాకారుడ్ని ఆయన అభినందించారు. ఆగస్టు 2 నుంచి 8 వరకు మహారాష్ట్రలో జరగనున్న అండర్ - 11 నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో శౌర్య ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. కోచ్‌ని ఎమ్మెల్యే అభినందించారు. శౌర్య తల్లిదండ్రులు పూర్ణచంద్రరావు - పావని, రచన బొప్పా పాల్గొన్నారు.

ప్రజలపై ఇంటి పన్నుల భారం

- సీపీఎం నేత బాబూరావు

గవర్నర్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పట్టణ ప్రజలపై రూ. 784 కోట్ల ఇంటి పన్నులు పెంపు భారం మోపిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్ బాబూరావు తెలిపారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయం శ్రీశ్రీ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 శాతం ఇంటి పన్ను పెంపు లక్ష్యంగా రాష్ట్రంలోని 123 పట్టణాలు, నగరాల్లోని 40 లక్షల 22 వేల గృహాలు, ఇతర కట్టడాల సర్వేను మున్సిపల్ అధికారులు చేపట్టారని తెలిపారు. ఏప్రిల్ నుంచి 15 శాతం ఇంటి పన్నులు ఇప్పటికే పెంచారని పేర్కొన్నారు. 35 శాతం తగ్గకుండా ఈ ఏడాది పన్ను పెంచడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. ప్రతి ఇంటికి 15 శాతం పెంపు పరిమితం కాకుండా పూర్తిగా ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్ను పెరుగుతుందని ఆరోపించారు. కడపలో జరిగే మహానాడులో టిడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఇంటి పన్నులు, విద్యుత్ భారాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. భారాలు రద్దు చేయాలని లేకుంటే ఆందోళన చేస్తామని, ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, నగర కార్యదర్శి బోయి సత్తిబాబు, నేతలు వి. రమణారావు, పి. కృష్ణ పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి

- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక



మావోయిస్టుల మృతదేహాలు బంధువులకు అప్పగించాలని కోరుతూ నిరసన

గవర్నర్‌పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టు మృతదేహాలను రక్త సంబంధీకులకు అప్పగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. వేదిక ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద నిరసన జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ఈనెల 21న అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి సంబల్ల కేశవరావు, చీరాలకు చెందిన సజ్జా నాగేశ్వరరావు, మరో ముగ్గురు మృతదేహాలను ఎలాంటి ఆంక్షలు లేకుండా బంధువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమై కాల్పుల విరమణ పాటించినా మిలిటరీ బలగాలు ఏకపక్ష కాల్పులు జరపడం సరికాదన్నారు. న్యూ డెమోక్రసీ పార్టీ కార్యవర్గ సభ్యుడు పోలారి మాట్లాడుతూ ఆదివాసీలకు అండగా ఉన్న విప్లవకారులను అంతిమ యుద్ధం పేరిట చంపివేస్తున్నారని అన్నారు. నిరసనలో ఐఎఫ్‌టీయూ నాయకులు రవీంద్ర, సీనియర్ జర్నలిస్టు డానీ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నేత కొండారెడ్డి, చైతన్య మహిళాసంఘం నేత రాధ, అమరవీరుల బంధుమిత్రుల సంఘం అంజమ్మ, న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, పీడీఎస్‌యూ రాజేష్, పౌరహక్కుల సంఘం విగ్నేష్, విరసం పాణి, జ్యోతి, అరసవిల్లి కృష్ణ పాల్గొన్నారు.

గుండెపోటుతో కారులోనే వృద్ధుడు మృతి

గుణదల, మే 26 (ఆంధ్రజ్యోతి): కారులో గుండె ఆగి ఒకరు చనిపోయిన ఘటన లయోల కళాశాల వద్ద ఆదివారం రాత్రి సంచలనం కలిగించింది. కానూరులో ఉంటున్న వెంకట కృష్ణారావు(64) గతంలో ఫౌల్ట్రీ వ్యాపారం చేసేవారు. ఆయనకు ఇరువురు సంతానం . వారు విదేశాల్లో సెటిల్ అయ్యారు. కృష్ణారావు ఆదివారం రాత్రి కానూరు నుంచి కారులో నాగార్జుననగర్‌లోని బంధువుల ఇంటికి వెళుతూ మార్గమధ్యలో లయోల కళాశాల వైపు వస్తుండగా దేవయ్య ఆడిటోరియం సమీపంలోని రాగానే ఒక్కసారిగా ఆయనకు గుండెపోటు రావడంతో కారును పక్కన నిలిపేశారు. ఆయనకు గుండె ఆగిపోయింది. కారులో ఎవరూ లేరు. దీంతో అటుగా వెళ్లేవారు గమనించి మాచవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గడచిన కొద్ది కాలం నుంచి ఆయన గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలపడంతో ప్రాథమికంగా ఆయన గుండెపోటుతో మరణించినట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మిక, పర్యాటక సమాహారం

టూరిజం సర్క్యూట్ కిందకు తీసుకొస్తే మరింత ప్రాచుర్యం

గరుడాచలం



కొండ పైన గరుడ స్వామి విగ్రహం

భక్తులకు దర్శనమిచ్చే స్వామి వారు



- త్రేతాయుగం నాటి క్షేత్రంగా గుర్తింపు
- 2006లో ఆంధ్రజ్యోతి కథనంతో వెలుగులోకి
- క్రమేణా అభివృద్ధి వైపు పరుగులు

తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆరాధ్య దైవం.. గరుడాచలం వీరనారసింహస్వామి క్షేత్రం! ఈ ప్రాంతం గురించి రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలకు తెలుసు! పెద్దగా అభివృద్ధి లేకపోవటంతో ఈ అరుదైన క్షేత్రం గురించి బాహ్య ప్రపంచానికి పెద్దగా తెలియదు. ఆధ్యాత్మిక సుగంధాలతో, పర్యాటకానుభూతులతో అలరారే ఈ ప్రాంతాన్ని టెంపుల్ టూరిజం, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే జగ్గయ్యపేటకు మహర్దశ పడుతుంది. గరుడాచలం క్షేత్రంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్

వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి పంచ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న గరుడాచలం వీరనారసింహ స్వామి క్షేత్రం ఆధ్యాత్మికంగా అలరారుతోంది. పచ్చటి అందాలకు నెలవైన ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తిస్తే ఆ ప్రాంత అభివృద్ధితో ఆధ్యాత్మిక గుబాళింపులు వీస్తాయి. వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామికి తూర్పు ముఖంగా 3 కిలోమీటర్ల దూరంలో బండిపాలెం, గుండబోయినపాలెం, పోచంపల్లి గ్రామాల పరిధిలో గరుడాచల కొండపై క్షేత్రం ఉంది. ప్రాచీన గరుడాచల వీరనారసింహ క్షేత్రం భక్తుల పాలిట కల్పతరువులా బాసిల్లుతోంది. ధర్మం, నిస్వార్థ సేవ, భక్తికి ప్రతీకైన ఆంజనేయుడు క్షేత్రపాలకుడిగా ఉన్నాడు.

ఆంధ్రజ్యోతి కథనంతో వెలుగులోకి..

త్రేతాయుగం నాటి ఈ క్షేత్రం పరిసర గ్రామాల ప్రజలకు మినహా మిగిలిన వారికి పెద్దగా తెలియదు. ప్రతి శనివారం దూపదీప నైవేద్యాలతో పాటు ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నాడు కల్యాణ మహోత్సవాన్ని తరతరాలుగా నిర్వహిస్తున్నారు. ఉత్సవానంతరం భక్తులు పెద్దగా ఇక్కడికి రారు. కొండపైకి వెళ్లేందుకు కష్టంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో 2006లో 'ఎవరీ బంగారు దంతాల బెంగాలీ బామ్మ' గరుడాద్రి గుహల్లో బసపై ఆంధ్రజ్యోతి కథనంతో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు క్షేత్రానికి రావటం ప్రారంభించారు. తగిన ఏర్పాట్లు లేకపోవటంతో కమిటీ సభ్యులు ఈశ్వరప్రగడ శేషగిరిరావు స్థానిక బండిపాలెంకు చెందిన రేపాల మోహనరావును సంప్రదించటంతో క్షేత్ర అభివృద్ధి కమిటీ పేరుతో తనకున్న పరిచయాలతో రాజకీయ, పారిశ్రామిక, స్థానిక దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి గదులు ఏర్పాటు చేశారు. పురాతన ఆలయం పునః నిర్మాణ ఆవశ్యకతను ఎమ్మెల్యే వసం త కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా రాజగోపురం, ము ఖ మండపం, ధ్వజస్థంభ ఏర్పాటుకు ముందుకు రావటంతో పనులు చేరుకుగా సాగుతున్నాయి. 2026 జనవరిలో ప్రతి ష్ఠా మహోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొండపైకి రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు.

బంగారు దంతాల బామ్మతోనే కొండకు వెలుగు: రేపాల మోహనరావు

బంగారు దంతాల బామ్మ ఒకరు ఈ ప్రాంతానికి వచ్చారు. ఆమె 2016లో మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థం కొండ పైన మ్యూజియంతో పాటు కొండ కింద ఆమె సమాధిని ఏర్పాటు చేశాం. ఆమె వల్లే ఈ కొండ వెలుగులోకి వచ్చింది. 2016లో ఆంధ్రజ్యోతి కథనంతో ఈ ప్రాంతం వెలుగులోకి వచ్చింది.



బంగారు దంతాల బామ్మ మ్యూజియం



కొండపైకి మెట్ల మార్గం

కమిషనరేట్లో బదిలీలకు నేరుగా కౌన్సెలింగ్

గుణదల, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో 5ఏళ్లు ఒకేచోట ఉన్నవారిని బదిలీలు చేసే విషయంలో నేరుగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు కౌన్సెలింగ్ చేశారు. బదిలీలపై సిబ్బంది మనోగతం తెలుసుకునేందుకు నేరుగా తన కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభించారు. కమషనరేట్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, ఎస్ఐలు నేడు సీపీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరయ్యారు. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి అభ్యర్థనల మేరకు బదిలీల విషయంలో నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీపీ సిబ్బంది తమ సమస్యలను నేరుగా విన్నవించుకునే అవకాశం కల్పించి అందుకనుగుణంగా బదిలీల విషయంలో నిర్ణయం తీసుకోవడంతో కమిషనరేట్లో పనిచేస్తున్న సిబ్బందికి సీపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో సీపీతో పాటు అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, ఏడీసీపీ ఎం రాజారావు, ఏసీపీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.



బదిలీల్లో పారదర్శక నిర్ణయం కోసం నేరుగా సమాచారం సేకరిస్తున్న కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర

విస్సన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ పర్యటన చేస్తున్న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెంది న ముత్తు సెల్వన్ సోమవారం విస్సన్నపేటకు చేరుకున్నా డు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ పర్యావరణ ప్ర పంచాన్నే చూడాలనేది తన ఆశయమని మొక్కలు నాటడం పై అవగాహన కల్పిస్తున్నానన్నారు. 2021 డిసెంబర్ 28న తన ప్రయాణం సైకిల్‌పై ప్రారంభమైందని ఈ ఏడాది డి సెంబరు 28కు మాత్ర ముగుస్తుందన్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో పర్యటన చేసినట్లు చెప్పారు. పర్యావర్ణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.



సైకిల్‌పై ముత్తు సెల్వన్

మంగినపూడి బీచ్‌లో ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్ ఉత్సవాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో జరిగే ఈ ఉత్సవాలకు పర్యాటకులకు కావలసిన ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. సాంస్కృతిక ప్రదర్శనల వేదికను రూపొందిస్తున్నారు. కొత్తగా రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. సాహస క్రీడలు, బీచ్ కబడ్డీ, జలక్రీడలు ఏర్పాట్లకు రంగం సిద్ధం చేస్తున్నారు.

రింగ్ సుందరీకరణకు రంగం సిద్ధం

ఇబ్రహీంపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - హైదరాబాద్, ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ రెండు జాతీయ రహదారులకు జాయింట్‌గా ఉండే ఇబ్రహీంపట్నం రింగ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇటీవల కళావిహీనంగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలో 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం రింగ్ పచ్చని చెట్లతో, సుందరమైన పూలమొక్కలతో ఎంత అందంగా ఉండేదో, వైసీపీ అధికారం చేపట్టాక పూర్తి నిర్లక్ష్యంతో రింగ్‌ను ఎలా కళ తప్పేలా చేశారో పూర్తిగా వివరించడంతో పాటు రంగులె వెలిచిపోయిన కొండపల్లి బొమ్మలు అని సవివరంగా తెలపడంతో అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిప్రదికన రింగ్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను, జిల్లేడు చెట్ల తొలగించారు. ఇసుక పోసి నేలను చదును చేసి మొక్కలను తెప్పించి అందులో నాటే పనులు చేపట్టారు. మొక్కలు నాటిన అనంతరం రింగ్‌లో ఉన్న కొండపల్లి బొమ్మలకు సైతం రంగులు వేయిస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలుపుతున్నారు.



పనులు చేస్తున్న కూలీలు

చేపల మేతకు కోళ్ల వ్యర్థాలు వేస్తే చర్యలు

- పోలీస్, రెవెన్యూ అధికారులకు జిల్లా మత్స్యశాఖ అధికారి ఫిర్యాదు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విస్సన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): చంద్రుపట్ల గ్రామంలోని చెరువులలో చేపల పెంపకం కోసం మాంసం వ్యర్థాలు వినియోగిస్తున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి వి.పెద్దిబాబు ధ్రువీకరించారు. సోమవారం ఈ చేపలు తింటే అంతే అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన చెరువులను పరిశీలించారు. చెరువుల వద్ద ఉన్న మాంసం వ్యర్థాలను పరిశీలించారు. చెరువులో సాగు చేస్తున్న చేపలకు కోళ్ల, మాంసం వ్యర్థాలు వాడుతుండటంతో పోలీసులకు, రెవెన్యూ అధికారులకు చేపలకు వ్యర్థాలు వేసి పెంచుతున్న వెంకన్నబాబు, లక్ష్మీనారాయణలపై ఫిర్యాదు చేశారు. ఇతరశాఖలతో సమన్వయం చేసుకొని ప్రత్యేక డ్రైవ్ ద్వారా అన్ని చేపల చెరువులను పరిశీలిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత చేపలను సాగు చేసినా, చేపలకు మాంసం వ్యర్థాలు వేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అగ్రికల్చర్ సచివాలయ అధికారి గోపి పాల్గొన్నారు.



చంద్రుపట్లలో చేపల చెరువులను పరిశీలిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి పెద్దిబాబు

కయాకింగ్, కెనాయింగ్
క్రీడాకారుడు జగదీష్ మృతి



విజయవాడ స్పోర్ట్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ కయాకింగ్, కెనాయింగ్ క్రీడాకారుడు వేమూరు జగదీష్ (38) గత రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. జగదీష్ తన పట్టుదల, శ్రమతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కయాకర్‌గా ఎదిగారు, నదులపై నావ నడపడంలో ఆయన ప్రావీణ్యంతో దేశవాళీ, జాతీయ స్థాయి పోటీల్లో పలు బంగారు పతకాలను అందించారు. అలాగే యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలవడమే కాకుండా, ఒక మార్గదర్శకుడిగా నిలవడం, క్రీడల పట్ల ఆయన చాటిన నిబద్ధతకు నిదర్శనం. ఆయన మృతి పట్ల క్రీడా సంఘాలు, అభిమానులు సహచర క్రీడాకారులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర కెనయింగ్, కయాకింగ్ కార్యదర్శి శివారెడ్డి సహ పలు క్రీడాసంఘాల ప్రతినిధులు జగదీష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విశాఖ ఉక్కు కాంట్రాక్ట్
కార్మికుల సమ్మెకు మద్దతుగా ధర్నా

ధర్నాచౌక్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ పక్రియను నిలుపుదల చేయాలని పలు కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోని తీసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా స్థానిక ధర్నాచౌక్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలోని కార్మికులను పథకం ప్రకారం కేంద్ర ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. దీన్ని అడ్డుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎం చంద్రబాబు, ప వన్ కల్యాణ్‌ను డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్య లు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. ఇప్పటికే 3వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, మరికొన్ని వేల మందిని తొలగించేందుకు ప్రయత్నించడం దుర్మార్గమై న చర్యని మండిపడ్డారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ రాష్ట్ర నేత లు వీవీఎల్ నరసింహులు, ఎస్ వెంకటసుబ్బయ్య, కే పోలారి ప్రసంగించారు. ఆయా సంఘాల నేతలు కే దుర్గారావు, సాంబశివరావు, ఏ వెంకటేశ్వరరావు, ఈవీ నారాయణ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నా కుమారుడి మృతిపై
విచారించి, న్యాయం చేయండి

- వెట్టి కార్మికురాలు అంకమ్మ

గాంధీనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడి మృతిపై సమగ్రంగా విచారించి నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యా యం చేయాలని చిత్తూరు జిల్లాలోని చవటపాలెంకు చెందిన అంక మ్మ అనే మహిళా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గాంధీనగర్‌లో ని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మా ట్లాడింది. తొమ్మిదేళ్ల క్రితం భర్తతో కలిసి ఓ బాతుల వ్యాపారి వద్ద ప నికి చేరామని, ఈ క్రమంలో వ్యాపారి నుంచి కొంత డబ్బు అప్పుగా తీ సుకున్నామన్నారు. 3నెలల క్రితం తమ 9 ఏళ్ల కుమారుడిని వ్యాపారి తీసుకెళ్లాడని, డబ్బు చెల్లించి కుమారుడిని తీసుకువచ్చేందుకు వెళ్లగా అక్కడ లేకపోవడంతో బాధితురాలు పోలీసుల ఫిర్యాదు చేసింది. బాలుడు అనారోగ్యంతో మరణించడంతో తమిళనాడులో పూడ్చినట్టు పో లీసులకు సమాచారం అందిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చే సింది. వెట్టి విమోచన వేదిక కన్వీనర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో యానాది వంటి అణగారిన వర్గాల ప్రజలు బాండెండ్ లేబర్‌కు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెట్టి బాండెడ్ లేబర్ బాధితుల కోసం ప్రత్యేక రాష్ట్రస్థాయి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. వెట్టి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని కోరారు.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడిభూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

బకాయిలు చెల్లించకపోతే సంక్షోభంలోకి విద్యా సంస్థలు

ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. లేనిపక్షంలో విద్యా సంస్థలు సంక్షోభంలో పడతాయని సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేసింది. విద్యా హక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిపాదించిన ఫీజులపై అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిపింది. ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందికరంగా ఫీజులు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. ఫీజులపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను తాము ఆమోదించలేదని తెలిపింది.

ప్రభుత్వ అనుమతిలేని ట్రెజరీ ఎన్నికలు చెల్లవు

- రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): రూసా నియమావళికి విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతి లేకుండా గత ఆదివారం జరిగిన ట్రెజరీ సంఘం ఎన్నికలు చెల్లవని ఏపీ ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రవికుమార్ తెలిపారు. ఈ విషయాన్ని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘం గరిష్ఠంగా మూడేళ్లు మాత్రమే అధికారంలో వుంటుందని, ఆంధ్రప్రదేశ్ టెజరీ సర్వీసెస్ అసోసియేషన్‌కు 2019 ఫిబ్రవరి 17న ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఆ తరువాత అనేక కారణాలతో ఎన్నికలు జరగకపోవడంతో మినహాయింపు కోరుతూ ప్రభుత్వానికి తాను అర్జీలు సమర్పించినా జీఏడీ నుంచి ఎటువంటి అనుమతులు రాలేదన్నారు. అయినా కొందరు అనధికార ఎన్నికల ఆధారంగా బదిలీల నుంచి మినహాయింపు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై ట్రెజరీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ అనుమతి రాగానే చట్టబద్ధంగా ఎన్నికలు జరుగుతాయని, ట్రెజరీ ఉద్యోగులు దీనిని గమనించాలని ఆయన తెలిపారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ బాలాజీ హెచ్చరిక

మచిలీపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజలిచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ బాలాజీ హెచ్చరించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో జేసీ గీతాంజలిశర్మ, ఇతర విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినట్టు చూపేందుకు తనవద్ద ఎండార్స్‌మెంట్‌పై సంతకాలు చేయించుకుంటున్నారని, కానీ అర్జీదారులకు ఎండార్స్‌మెంట్‌లు ఇవ్వడం లేదని గ్రహించానన్నారు. పలు సమస్యలపై పదే పదే అర్జీలు ఇస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే అధికారులు దురుసుగా మాట్లాడుతున్నారని, ఈ పద్ధతిని విడనాడాల్సిందేనన్నారు. అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని ఫోన్‌చేస్తే అధికారులు ఏం మాట్లాడుతున్నారో ప్రత్యేకయాప్‌లో రికార్డు అవుతోందన్నారు. ఇక నుంచి తాను నేరుగా అర్జీదారులకు ఫోన్ చేసి, మాట్లాడి వివరాలు తెలుసుకోవడం ప్రారంభిస్తానన్నారు. యోగాంధ్రలో ప్రతి ఒక్క ఉద్యోగి తమ పేరును నమోదు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. జేసీ గీతాంజలిశర్మ మాట్లాడుతూ త్వరలో 5వేల మందితో జిల్లాలో యోగాసనాలు వేయించేందుకు ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. ఐ గాట్ కర్మయోగి ఆన్‌లైన్ శిక్షణా తరగతులను నిర్వహించేందుకు డీఈవో, డీపీవో, పోలీస్ విభాగాలు చొరవ తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి యోగాంధ్రలో ప్రజలను భాగస్వాములుగా చేయాలన్నారు. 145 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

సత్యనారాయణపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా ఆయూష్‌శాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బీఆర్‌టిఎస్ రోడ్డు శారదా కాలేజీ జంక్షన్ వద్ద కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్యం కుటుంబ సంక్షేమం కమిషనర్ వీరపాండ్యన్‌తో కలిసి పాల్గొని యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 15లక్షల మందికి యోగాను నేర్పే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఆయూష్ డైరెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యం దృఢమవుతుందన్నారు. వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్, జిల్లా ఆయూష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, మెడికల్ ఆఫీసర్ వై.రత్నప్రియదర్శిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

గాంధీ కొండపై యోగాసనాలు

వన్‌టౌన్: ఆరోగ్యానికి అంత్యంత ప్రాధాన్యమిచ్చిన మహాత్ముని ఆశయాల కీర్తి శిఖరమైన గాంధీ కొండపై యోగాంధ్ర నిర్వహించినందుకు చాలా ఆనందంగా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా సోమవారం విజయవాడలోని గాంధీహిల్‌పై గాంధీహిల్ ఫౌండేషన్, జిల్లా యంత్రాంగం, ఏపీ టూరిజయం డిపార్టుమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర లో భాగంగా ప్రజలకు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించి జీవితాంతం ఆచరించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవానీ ద్వీపం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనం, కొండపల్లి ఖిల్లా తదితర ప్రాంతాల్లోనూ యో గాంధ్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ గాంధీ పీసీ కాజా, కార్యదర్శి వై.రామచంద్రరావు, ప్రతినిధులు శిల్ప, ప్రసన్న లక్ష్మి, కృష్ణచైతన్య, సుధీర్ పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



కలెక్టరేట్: దివ్యాంగుల ఆవేదనను ఆలకించి ఆపై సత్వరం స్పందించి మూడు చక్రాల సైకిలును అందచేసి జీవిత మార్గానికి బాటవేసిన జిల్లా అధికారులు, ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) దివ్యాంగుల జీవన మార్గానికి బాటలు వేసింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి పర్యటనకు బయలుదేరుతున్న సమయంలో దివ్యాంగుణ్ని చూసి అతడి వద్దకు వెళ్లి అర్జీని స్వీకరించి అదేరోజు మూడు చక్రాల సైకిల్‌ను అందించిన వార్తా కథనాన్ని చూసి అదే పరిస్థితిలో ఉన్న మరికొందరు తమకు కూడా న్యాయం జరుగుతుందనే ఆశతో మే 12న జరిగిన పీజీఆర్ఎస్‌లో నగరంలోని 21వ డివిజన్‌కు చెందిన సింహాద్రి క్షీరవర్ధి, విజయవాడ రూరల్ మండలం గొల్లపూడికి చెందిన అన్నవరపు వరప్రసాద్ తమకు మూడు చక్రాల సైకిళ్లను అందచేసి ఆదుకోవాలని అడిగారు. స్పందించిన జిల్లా యంత్రాంగం దివ్యాంగుల అర్హతలను పరిశీలించి దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను సమకూర్చడంపై జిల్లా రెవెన్యూ అధికారి దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల సహాయంతో సోమవారం కలెక్టరేట్‌లో ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లకు అందించారు. అతి తక్కువ సమయంలో తమకు ఉచితంగా వాహనాలు అందచేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇళ్లపట్టాల కేసులో వంశీ అనుచరుడు రంగాకు కస్టడీ

హనుమాన్‌జంక్షన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి రంగాను జంక్షన్ పోలీసులు రెండు రోజులు పాటు కస్టడీకి తీసుకున్నారు. అందులో భాగంగా సోమవారం విజయవాడ జిల్లా జైలు నుంచి మధ్యాహ్నం 12గంటల సమయంలో రంగాను జంక్షన్ పీఎస్‌కు ఎస్సై వీ సురేశ్ ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. జంక్షన్ సీఐ సత్యనారాయణ మూర్తి ఇళ్లపట్టాలు పంపిణీ కేసులో విచారణ నిర్వహించారు. ఈ కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న రంగాను మంగళవారం సాయంత్రం తిరిగి నూజివీడు కోర్టులో హాజరు పరచనున్నారు. ఇదేకేసులో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను సోమవారం కోర్టు తిరస్కరించింది. ఈ నెల 29 వరకు వంశీ రిమాండ్ విధించిన నేపథ్యంలో నూజివీడు సెకండ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బెయిల్ పిటీషన్ విచారణకు తిరస్కరించారు.



ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌కు చేరుకున్న రవిశంకర్ ప్రసాద్, దగ్గుబాటి పురందేశ్వరి తదితరుల బృందం

ప్యారిస్‌లో పురందేశ్వరి

» పాక్ ఉగ్రవాదాన్ని అక్కడ ఎండగట్టనున్న భారత బృందం

న్యూఢిల్లీ, మే 26(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎండగట్టేందుకు బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌కు చేరుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తదితరాలను ప్రపంచదేశాలకు వివరించేందుకు కేంద్రప్రభుత్వం ఏడు అఖిలపక్ష ఎంపీల బృందాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ నేతృత్వం వహిస్తున్న బృందంలో పురందేశ్వరి సభ్యురాలు. ఈ బృందం ప్యారిస్‌లో పర్యటిస్తోంది. ఉగ్రవాదంపై భారత దేశం చేస్తున్న పోరాటం, పహల్గాంలో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి తదితరాలను ఈ బృందం ప్యారిస్ ప్రతినిధులకు వివరించనుంది.

అధికారులూ స్వేచ్ఛగా పనిచేయండి:పెమ్మసాని



అర్జీదారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), మే 26 (ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దానిని సద్వినియోగం చేసుకుని, సమస్యలను పరిష్కరించాలి' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజతో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ... 'అవి సమస్యలు కావు.. వారి జీవితాలు. దీనిని దృష్టిలో పెట్టుకొని పని చేయాలి. ప్రభుత్వానికి మంచి పేరు రావాలన్నా, చెడ్డ పేరు రావాలన్నా అధికారుల చేతుల్లోనే ఉంటుంది' అన్నారు.

బాబు నాయకత్వంలో అభివృద్ధిపథాన ఏపీ

న్యూఢిల్లీ, మే 26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో, కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన ముందుకు సాగుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ అన్నారు. సోమవారం ఏపీ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని బీసీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

జిల్లాల్లో సెర్ప్ సిబ్బంది సర్దుబాటు

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లా వెలుగు కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది హెచ్చు తగ్గులు లేకుండా సమానంగా సర్దుబాటు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

నీటి వనరుల వద్ద హెచ్చరిక బోర్డులు: సీఎం ఆదేశాలు

రాష్ట్రంలోని నీటి వనరులున్న అన్ని ప్రాంతాల్లోనూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బోర్డులు కనిపించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశోధన ప్రగతి నామమాత్రం!

» ఇన్‌చార్జుల పాలనలో అగ్రి అనుబంధ వర్సిటీలు సతమతం

» రాజకీయాలు, ఆధిపత్య పోరుతో మసకబారిన ప్రతిష్ఠ

» అవకాశవాదులకు అడ్డాలుగా మారిన వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, మత్స్య విశ్వవిద్యాలయాలు వెలవెలబోతున్నాయి. రాజకీయాలు, ఆధిపత్య పోరుతో వాటి ప్రతిష్ఠ మసకబారుతోంది. ఇన్‌చార్జి వీసీలు, అధికార వ్యవస్థతో పాలన అస్తవ్యస్తంగా మారింది. అవకాశవాదులకు ఈ వర్సిటీలు అడ్డాగా మారాయి. నాలుగు వర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. పరిశోధన ప్రగతి లోపిస్తోంది. కనీసం కేంద్ర ప్రాయోజిత పథకాలను ఉపయోగించుకుని, మంచి ఫలితాలు సాధించాల్సిన వర్సిటీలు నామమాత్రంగా నడుస్తున్నాయి. వీటికి గత రెండేళ్లుగా రెగ్యులర్ వీసీలు లేరు. ఇన్‌చార్జులతోనే నడిపించేస్తున్నారు. ఈ వర్సిటీల్లోని కీలక విభాగాలకూ ఇన్‌చార్జి అధికారులనే కొనసాగిస్తున్నారు. వర్సిటీలకు డైనమిక్ వీసీలు, రెగ్యులర్ అధికారులు ఉంటే.. వారి దర్శకత్వంలో పని చేస్తే.. శాస్త్రవేత్తలు అద్భుతాలు సృష్టిస్తారన్న వాదన ఉంది. అయితే, ఎప్పుడో సాధించిన ప్రగతిని చెప్పుకుంటూ వర్సిటీలు కాలక్షేపం చేస్తున్నాయి. వ్యవసాయ పరిశోధనల్లో అఖిల భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐసీఏఆర్) ఏటా ఇచ్చే ర్యాంకుల్లో రాష్ట్రంలోని ఈ నాలుగు వర్సిటీలు చాలా కాలంగా మొదటి 10 ర్యాంకుల్లో నిలిచిన దాఖలాల్లేవు. సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఒక్కటీ లేదు. ఇతర రాష్ట్రాల్లోని వర్సిటీలు కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టులను విరివిగా అమలు చేస్తున్నాయి. మన వర్సిటీలు మాత్రం ఇందుకు భిన్నం. ఏ ప్రాజెక్టూ పూర్తి ఫలితాలిచ్చిన దాఖలా లేదు. ముఖ్యంగా ఇంక్యుబేషన్ సెంటర్, ఇన్నోవేషన్ సెంటర్ వంటివి రాష్ట్రంలోని



వర్సిటీల్లో లేవు. ఇతర రాష్ట్రాల్లో 2-3 జిల్లాలకు ఒక వర్సిటీ ఉంది. రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన వర్సిటీలు వేర్వేరుగా ఉండటంతో రైతులకు పూర్తి స్థాయిలో మెరుగైన సేవలు అందడం లేదు. మిర్చి పంటను రెండు వర్సిటీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఐసీఏఆర్ నిధులు 100% ఉన్న కేవీకేలకు తగిన సిబ్బందిని నియమించుకోలేకపోతున్నారు. ఒక వేళ ఎవరినైనా నియమిస్తే.. లంచాలు తీసుకుని, అనర్హులకు పోస్టులిస్తున్నారు. కేవీకేల్లో 70% పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. వీసీలు చేసే తప్పులకు మద్దతు పలకడం తప్ప.. యూజీసీ నిబంధనలు, చట్టాలకు అనుగుణంగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఎలాగైనా జీతం వస్తుందన్న ఉద్దేశంతో కొందరు ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టి, ఇతర వ్యాపకాలు పెట్టుకుంటున్నారన్న విమర్శ ఉంది.

ఉద్యాన వర్సిటీ 2011 నుంచి ఇన్‌చార్జులే

పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెం వద్ద డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీని 2007లో స్థాపించారు. వర్సిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రెగ్యులర్ వీసీలు ముగ్గురు మాత్రమే పని చేశారు. మిగతా కాలమంతా ఇన్‌చార్జులతోనే నడిపించారు. 2011 తర్వాత అంతా ఇన్‌చార్జుల పాలనే. వీసీలుగా వ్యవహరించే వారు వారికి నచ్చిన వారిని కీలక పోస్టుల్లో నియమించుకుంటున్నారు. ఉద్యాన పంటల్లో ఫుడ్ ప్రాసెసింగ్‌కు.. ఉద్యాన వర్సిటీలో ఫామ్ మెకనైజేషన్‌కు అవకాశం ఉన్నా.. ఆ దిశగా పరిశోధనల ఊసే లేదు.

రంగా వర్సిటీలో ఆధిపత్య పోరు..

60ఏళ్ల చరిత్ర ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక వర్గపోరు, రాజకీయాలకు నిలయంగా మారిందన్న విమర్శలున్నాయి. తమకు అనుకూల ప్రభుత్వం వచ్చినప్పుడు ఆధిపత్యం చెలాయిస్తూ తోటి వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన ఈ వర్సిటీకి రెండేళ్ల నుంచి సీనియర్ శాస్త్రవేత్తనే ఇన్‌చార్జి వీసీగా కొనసాగిస్తున్నారు. వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో వివిధ కోర్సులకు సకాలంలో సీట్లు భర్తీ కాక పదేపదే కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్న పరిస్థితి. గత ప్రభుత్వంలో దొడ్డిదారిన పదోన్నతులు పొందిన శాస్త్రవేత్తలపై ప్రస్తుత ప్రభుత్వం తాజాగా చర్యలు తీసుకుంది.

వెటర్నరీ వర్సిటీలో ఇష్టారాజ్యం

2006లో తిరుపతిలో ఏర్పాటైన శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కూడా నామమాత్రపు సేవలతోనే నడుస్తోంది. దీనిలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారన్న ఫిర్యాదులపైనా, దొడ్డిదారి పదోన్నతులపైనా చర్యలు కొరవడ్డాయి. ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వారు వర్సిటీ నిధుల్ని తమకు నచ్చినట్లు కేటాయిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆర్టీఐ చట్టం కింద సమాచారం అడిగినా వర్సిటీ అధికారులు ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి.

సొంత భవనాలు లేని ఫిషరీస్ వర్సిటీ

ఏపీ ఫిషరీస్ వర్సిటీకి మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ స్పెషల్ ఆఫీసర్‌గా, ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్నారు. ఒక ప్రొఫెసర్ నాలుగు పోస్టులు, మరో ప్రొఫెసర్ రెండు పోస్టులు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా ఇన్‌చార్జి వీసీ, ఇన్‌చార్జి అధికారులతోనే వర్సిటీని నడిపిస్తున్నారు. సొంత భవనాలు కూడా లేకుండా అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు.

యోగాంధ్ర నిర్వహణకు అపెక్స్ కమిటీ

» చైర్మన్‌గా సీఎస్ విజయానంద్

» కమిటీలో 13 మంది సీనియర్ ఐఏఎస్‌లు

అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర - 2025 పర్యవేక్షణకు, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అపెక్స్ కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనికి చైర్మన్‌గా ఉంటారు. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ యోగాంధ్రకు అవసరమైన వస్తువులు కొనుగోలుకు టెండర్ కమిటీని నియమించడం, అందుకు ప్రత్యేక మార్గదర్శకాలు సిద్ధం చేయడం వంటి పనులు నిర్వహిస్తుంది. ఈ కమిటీలో సీఎస్‌తో పాటు ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్, జీఏడీ ముఖ్య కార్యదర్శి, ఫైనాన్స్ ముఖ్య కార్యదర్శి, టూరిజం స్పెషల్ సీఎస్, సోషల్ ఎడ్యూకేషన్ సెక్రటరీ, ఐటీఈ అండ్ సీ ముఖ్య కార్యదర్శి, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ స్పెషల్ సీఎస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్, ఆరోగ్యశాఖ కమిషనర్ మెంబర్లుగా ఉంటారు. ఈ కమిటీకి ఆయుష్ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

అధికారులకు విధులు...

యోగాంధ్రా నిర్వహణ బాధ్యతలను ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబుకు ప్రభుత్వం అప్పగించింది. ఆరోగ్య శాఖ కమిషనర్ జి.వీరపాండియన్‌కు ప్రధాన మంత్రి కార్యక్రమం ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి కార్యాలయాలతో సమన్వయం చేసుకోవడంతో పాటు ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చూస్తారు.

కేటీఆర్‌కు మళ్లీ శ్రీముఖం

» ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏసీబీ నోటీసు

» రేపు విచారణకు హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసులో మరో కీలక పరిణామం. ఈ కేసులో అవినీతి, అవకతవకలకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, అప్పటి మునిసిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 28న (బుధవారం) తమ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ కారు రేసు నిర్వహించిన సంగతి తెలిసిందే. రేసు నిర్వహణలో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ ఖజానాకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని, దీనిపై దర్యాప్తు జరపాలంటూ గత ఏడాది అక్టోబరు 18వ తేదీన మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఒకసారి కేటీఆర్‌ను ఏసీబీ ప్రత్యేక బృందం సుదీర్ఘంగా విచారించింది. ఏసీబీ నోటీసులపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'ముందుగా నిర్ణయించిన షెడ్యూలు మేరకు యూకే, అమెరికాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్నా. తిరిగి వచ్చిన వెంటనే విచారణకు హాజరవుతాను' అని పోస్ట్ చేశారు.

కవితతో రాయబారం.. విఫలం!!

ఫలించని కేసీఆర్ దూతల ప్రయత్నాలు

కుమార్తెతో ఫోన్లో మాట్లాడిన బీఆర్ఎస్ అధినేత

హైదరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ అధినాయకత్వం జరిపిన రాయబారం విఫలమైందా!? వరుసగా రెండు సార్లు ప్రయత్నాలు చేసినా.. ఆమె మెత్తబడలేదా!? పార్టీలో తన ప్రాధాన్యం.. పార్టీ అధికారంలోకి వస్తే తన పరిస్థితిపై ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని పట్టుబట్టారా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. పార్టీలో తన పరిస్థితిపై ముందే స్పష్టత ఇవ్వాలని, లేకపోతే తన దారి తాను చూసుకుంటానని కాస్త ఘాటుగానే స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో కేసీఆర్‌కు కవిత లేఖ రాయడం, ఆమె అమెరికాలో ఉన్నప్పుడు అది బహిర్గతం కావడం.. దానిని తానే రాశానని స్పష్టం చేసిన కవిత.. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలే దానిని లీకు చేశాయని తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ఆదివారం కేటీఆర్‌ను పిలిపించుకుని కేసీఆర్ సంప్రదింపులు జరిపారు. కవిత వ్యవహారాన్ని ఓ కొలిక్కి తీసుకురాకుంటే మరింత నష్టం తప్పదన్న భావనకు వచ్చి.. సోమవారం ఆమె వద్దకు రాయబారం పంపారు. ఆయన ఆదేశాలతో పార్టీ దూతలు కవిత నివాసానికి వచ్చారు. తొలుత, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు, బీఆర్ఎస్ ఎంపీ దివికొండ దామోదర రావు సోమవారం మధ్యాహ్నం కవిత నివాసానికి చేరుకున్నారు. కొంతసేపు చర్చించి వెళ్లిపోయారు. అనంతరం, పార్టీ లీగల్ సెల్ బాధ్యతలు చూసే గండ్ర మోహన్‌రావు కూడా కొంతసేపు ఆమెతో మాట్లాడి.. వెళ్లిపోయారు. చర్చల్లో భాగంగా కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడించినట్లు విశ్వసనీయ వర్గాలు వివరించాయి. పదవులు, హోదాల విషయంలో తొందరపడవద్దని ఆమెకు కేసీఆర్ సూచించినట్లు తెలిపాయి. అయినా కవిత మెత్తబడలేదని తెలుస్తోంది. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆరే ముఖ్యమంత్రి అవుతారని, అప్పుడు తన సంగతేంటని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ సీఎం అయితే పార్టీలో గానీ, ప్రభుత్వంలోని గానీ తనకు ఇచ్చే హోదా ఏమిటో ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని కవిత పట్టుబట్టినట్లు జాగృతి వర్గాలు వెల్లడించాయి. ఆ స్పష్టత ముందే ఇవ్వాలని, లేకపోతే, తన దారి తాను చూసుకుంటానని ఆమె కాస్త ఘాటుగా చెప్పినట్లు సమాచారం.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేమ.. ప్రతీకారం.. మోసం



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా షానియల్ డియో దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా చిత్రం 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫైర్ గ్లింప్స్ విడుదల చేశారు. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య నెలకొన్న ఉద్రిక్త క్షణాల్లో గ్లింప్స్ ప్రారంభమౌతుంది. సానుభూతితో నిండిన వాయిస్‌లో శేష్ ఆమెను 'జూలియట్' అని పిలుస్తాడు. అందరూ ఆమెకు అన్యాయం చేశారని చెబుతాడు. కానీ వెంటనే అతని స్వరం మారుతుంది. 'నేను నిన్ను మోసగించడానికి రాలేదు. అంత కంటే ఎక్కువ చేస్తా' అంటూ అనుమానాస్పద నవ్వుతో శేష్ చెప్పే డైలాగ్ అదిరిపోయింది. మరో ఎపిసోడ్‌లో.. ఖైదీ యూనిఫాంలో జైలు వ్యాన్‌లో ఉన్న శేష్ కూల్‌గా తన నోటి నుంచి ఒక కీని బయటకు తీస్తాడు. తర్వాత ఓ రైలు ఆ వ్యాన్ మీదుగా దూసుకెళ్తుంది. చివరి సన్నివేశంలో.. మృణాల్ అతని పక్కన కూర్చుంటుంది. శేష్ కాల్పులు జరుపుతాడు. మొత్తానికి గ్లింప్స్‌ని బట్టి ప్రేమ, ప్రతీకారం, మోసంతో నిండిన కథ అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో నేపథ్య సంగీతం అందించారు.

సినీ థియేటర్ల బంద్‌పై విచారణ జరుగుతోంది

● ఏపీ మంత్రి కందుల దుర్గేశ్



సినిమా థియేటర్ల బంద్ వ్యవహారంలో హోంశాఖ విచారణ చేస్తోందని.. నివేదిక రాగానే వివరాలు వెల్లడిస్తామని ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే నూతన ఫిల్మ్ పాలసీ తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తాము విచారణ మాత్రమే చేయమన్నామని, ఎవర్నీ అరెస్ట్ చేయమని చెప్పలేదని పేర్కొన్నారు. జూన్ 12న విడుదల కానున్న 'హరిహర వీరమల్లు' చిత్రం విషయంలోనే కొందరు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో తెలియాల్సి ఉందన్నారు. సినిమాల విడుదల సమయంలో టికెట్ల ధరలు పెంచాలని నిర్మాతలు తమను కలిసి అడుగుతున్నారని, అందుకు తాము అంగీకరిస్తున్నామని అన్నారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకుంటామని కొందరు అహంభావంతో మాటాడడం సరైన విధానం కాదన్నారు. సినిమా ప్రజలను ప్రభావితం చేసే మాధ్యమం అని, అందువల్ల ప్రభుత్వానికి సంబంధం ఉంటుందన్నారు. సినిమాటోగ్రఫీ శాఖ నిర్వహించిన వైసీపీకి చెందిన మాజీ మంత్రి వక్రభాష్యాలు చెబుతున్నారని, సినీ పరిజ్ఞానం లేకుండా అజ్ఞానంతో మాట్లాడడం సరికాదన్నారు.

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

పవన్ కల్యాణ్ మాకు పెద్దన్న ఆయన తిట్టినా పడతాం


దిల్‌రాజు



"కొవిడ్‌లో తప్పితే అంతకుముందెన్నడూ థియేటర్లను బంద్ చేయలేదు. 'జూన్ 1 నుంచి థియేటర్లు బంద్' అనే విషయం ప్రజల్లోకి తప్పుగా వెళ్లింది. ఈ విషయంలో చొరవ తీసుకుని వివాదానికి తెరదించిన ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కి కృతజ్ఞతలు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని ఆపే దమ్ము ఎవ్వరికీ లేదు. ఇకనైనా ఈ సమస్యను ముగిద్దాం" అని తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత దిల్‌రాజు హితవు పలికారు. థియేటర్ల బంద్ విషయంతో పాటు ఏపీ ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. "ఏప్రిల్ 19న తూర్పు గోదావరిలోని పంపిణీదారులు, ఎగ్జిబిటర్ల మధ్య ఓ సమావేశం జరిగింది. అందులో సినిమాలు పర్సెంటేజ్ విధానంలో ఆడితే తమకు లాభదాయకంగా ఉంటుందని థియేటర్ ఓనర్స్ చెప్పారు. ప్రస్తుతం ఏడాదికి 150 సినిమాలు విడుదలవుతుంటే, 90 శాతం పర్సెంటేజీ విధానంలోనే ప్రదర్శితమౌతున్నాయి. సహజంగానే పెద్ద సినిమాలకు మొదటివారం రెంట్ ఇస్తున్నాం. ఆ తర్వాత పర్సెంటేజీ ఇస్తున్నాం. ఇది కొందరు ఎగ్జిబిటర్స్‌కు నచ్చడం లేదు. దీంతో వారు ఈ విషయంలో సమస్యలు లేవనెత్తి, అభ్యంతరం వ్యక్తం చేయడం మొదలు పెట్టారు. అలా, తూర్పు గోదావరి ఎగ్జిబిటర్స్ తమ ఆలోచనను హైదరాబాద్‌లోని ఎగ్జిబిటర్స్‌కు తెలిపారు. దీనిపై ఏప్రిల్ 26న జరిగిన గిల్డ్ మీటింగ్‌లో చర్చించాం. గిల్డ్ సమావేశ సమయానికి 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్ ఫిక్స్ కాలేదు. కాబట్టి ఇది ఆ సినిమాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం అనేది కరెక్ట్ కాదు. తెలంగాణలో 370 సింగిల్ స్క్రీన్లు ఉంటే ఎస్వీసీ సహా మా వద్ద ఉన్నవి 30 మాత్రమే. ఏషియన్ ఫిల్మ్స్ సునీల్ నారంగ్, సురేశ్ బాబుకు 90 ఉన్నాయి. మిగిలిన వాటిని ఓనర్స్ లేదా వారికి సంబంధించిన వారు మాత్రమే నడుపుతున్నారు. 'ఆ నలుగురు' అంటూ మాపై ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు. 'ఆ నలుగురి'లో నేను లేను. మా గిల్డ్ మీటింగ్ తర్వాత తెలంగాణలోని సింగిల్ థియేటర్స్ ఓనర్స్ కూడా పర్సంటేజ్ గురించి శిరీష్‌ను అడిగారు. ఆయన ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే మే 18న ఏపీ, తెలంగాణ ఎగ్జిబిటర్స్ మీటింగ్ నిర్వహించారు. ఆ రోజున మీటింగ్‌లో ఏం జరిగిందో పూర్తిగా తెలుసుకోకుండానే 'జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్' అనే ప్రచారం మొదలైంది. ఈ నెల 30న జరిగే చాంబర్ ఈసీ మీటింగ్ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటారు" అని దిల్ రాజు తెలిపారు.

'నిర్మాతలంతా కలసి ఎగ్జిబిటర్లుకు సమస్యలు ఉన్నాయని అంగీకరించారు. జాయింట్ మీటింగ్‌లో ఓ పరిష్కారానికి వద్దామని నిర్ణయించుకున్నాం. ఈ నెల 24 అందుకే జాయింట్ మీటింగ్ పెట్టాం. అంతలోపే సమస్యను పవన్‌కల్యాణ్‌గారి చిత్రంపైకి డైవర్ట్ చేశారు. థియేటర్ల బంద్ విషయం పవన్‌కల్యాణ్‌గారి దగ్గరికి నెగెటివ్ కోణంలో వెళ్లింది. అందుకే ఆయన ఆగ్రహానికి గురయ్యారు. అయినా, ఆయన తిట్టినా మేం పడతాం. పెద్దన్న స్థానంలో ఉన్న ఆయనకు ఆ హక్కు ఉంది' అన్నారు దిల్ రాజు.

రైలుపై సాహస కృత్యాలు



తేజ సజ్జా హీరోగా కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'మిరాయ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈనెల 28న సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ చిత్రబృందం పోస్టర్‌ని విడుదల చేసింది. తేజ సజ్జా చేతిలో మంత్రదండం పట్టుకొని నడుస్తున్న రైలుపై నిలబడి, సాహస కృత్యాలు చేస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది.ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే మంచు మనోజ్ విలన్‌గా, రీతికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన తేజ సజ్జా, మంచు మనోజ్ ఫస్ట్ లుక్ పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి.

మంచి సందేశంతో హృదయాన్ని బరువెక్కిస్తుంది

పవన్‌ప్రభ



నూతన దర్శకుడు పవన్‌ప్రభ తెరకెక్కించిన చిత్రం 'షష్టిపూర్తి'. డాక్టర్.రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో నటించారు. రూపేశ్ నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు పవన్‌ప్రభ. "సమాజంలోని పరిస్థితులను గమనిస్తున్నప్పుడు పుట్టిన కథ ఇది. వాణిజ్యాంశాలతో ఆకట్టుకుంటూనే, మంచి సందేశంతో హృదయాన్ని బరువెక్కిస్తుంది. కథానాయకుడు రూపేశ్ ఇందులో లాయర్‌గా కనిపిస్తారు. సినిమాలోని ప్రతీ పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. కథనం సరికొత్తగా ఉంటుంది. తల్లితండ్రుల విలువను హృద్యంగా ఆవిష్కరించి, అందరినీ మెప్పించే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఇది" అని చెప్పారు.

చిన్ని చిన్ని తప్పులేవో



'అర్ధనారి' చిత్రంతో హీరోగా పరిచయమైన అర్జున్ అంబటి ఆ తర్వాత 'తెప్ప సముద్రం', 'వెడ్డింగ్ డైరీస్' చిత్రాల్లో నటించారు. ఆయన తాజా చిత్రం 'పరమపద సోపానం'. జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర శిష్యరికం చేసిన నాగ శివ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గిడిమిట్ల శివ ప్రసాద్ నిర్మాత. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ థ్రిల్లర్ మూవీ జూలై 11న విడుదల కానుంది.ఈ సందర్భంగా 'చిన్ని చిన్ని తప్పులేవో' పాటను విడుదల చేశారు. రాంబాబు గోశాల రాసిన పాటను పృథ్వీ చంద్ర, అదితి భావరాజు పాడారు. దేవ్ జాండ్ సంగీత దర్శకుడు. ఈ చిత్రానికి గుడిమెట్ల ఈశ్వర్ సహ నిర్మాత.

రక్త పిశాచి



పూర్వాజ్ స్వీయ దర్శకత్వంలో కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'కిల్లర్'. పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఏ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. తాజాగా ఈ చిత్రం నుంచి హీరోయిన్ జ్యోతి పూర్వజ్ నటించిన 'రక్తిక' క్యారెక్టర్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. రక్త పిశాచి పాత్రలో ఆమె భీతి గొలుపుతున్నారు. విశాల్ రాజ్, దశరథ్, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సినిమా రూపుదిద్దుకుంటున్నట్లు చిత్రబృందం తెలిపింది. సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

స్థిరమైన వృద్ధిపై దృష్టి


ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: క్రమశిక్షణతో కూడిన వ్యయ నిర్వహణ, తక్కువ ఖర్చుతో డిపాజిట్ల సేకరణ, రుసుము ఆదాయ విస్తరణ ఆధారంగా స్థిరమైన రాబడుల కోసం క్రమమైన వృద్ధి నమూనాను నిర్మిస్తున్నామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. "ఈ వ్యూహాల కలయిక మమ్మల్ని దేశంలో అతిపెద్ద బ్యాంక్‌గానే కాకుండా భవిష్యత్ దృక్పథంతో కూడిన సంస్థగా నిలబెట్టనుంది" అని ఎస్‌బీఐ వార్షిక నివేదికలో ఆయన పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రూ.70,901 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24లో గడించిన రూ.61,077 కోట్ల లాభంతో పోలిస్తే 16 శాతం వృద్ధి కనబరిచింది.

వార్షిక నివేదికలో ఎస్‌బీఐ చైర్మన్ ప్రస్తావించిన మరిన్ని విషయాలు..

- స్థిరమైన, రిస్కును సర్దుబాటు చేసుకోగలిగే వృద్ధిని సాధించేందుకు ఎస్‌బీఐ క్రెడిట్ అండర్ రైటింగ్, పోర్ట్‌ఫోలియో మానిటరింగ్, సంస్థాగత ముప్పుపై ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు వీలుగా ఆధునిక అనలిటిక్స్ టూల్స్‌ను ఉపయోగిస్తున్నాం.
- ఆస్తుల నాణ్యతను పెంచడంతోపాటు ఎంఎస్ఎంఈ, మౌలికం వంటి ప్రాధాన్య రంగాలకు రుణ మద్దతిచ్చేలా రంగాల వారీ రిస్క్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాం.
- కార్యనిర్వహణ దక్షత, కస్టమర్ల అనుభూతిని మరింత మెరుగుపరచడంతో పాటు స్థిరమైన మార్కెట్ ఆధిపత్యం, మానవ వనరుల సామర్థ్యాల బలోపేతం, రిస్కును సర్దుబాటు చేసుకోగలిగే వృద్ధికి మద్దతు, లాభదాయకతను పెంచుకోవడంపై ఎస్‌బీఐ దృష్టిసారించింది.

టీసీఎస్ ఏఐ.క్లౌడ్ వ్యాపార విభజన

ముంబై: ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఏఐ.క్లౌడ్ వ్యాపారాన్ని రెండుగా విభజించింది. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ వ్యాపారాల్లో మరింత అధిక వృద్ధి లక్ష్యంగా కంపెనీ ఈ పునర్‌వ్యవస్థీకరణ చేపట్టినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. టీసీఎస్ 2023 ఆగస్టులో ఏఐ.క్లౌడ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఏఐ.క్లౌడ్‌కు ఉప అధిపతిగా ఉన్న కృష్ణ మోహన్ ఇకపై క్లౌడ్ విభాగానికి సారథ్యం వహించనున్నారు. ఆశోక్ క్రిష్ ఏఐ గ్లోబల్ హెడ్‌గా వ్యవహరించనున్నారు. కాగా, సతీష్ భైరవన్ డేటా విభాగ గ్లోబల్ హెడ్‌గా సేవలందించనున్నారు.

మార్కెట్లకు తొలకరి పులకరింత

25,000 పైన నిఫ్టీ

ముంబై: రుతుపవనాలు అంచనాల కన్నా ముందుగా ప్రవేశించిన ఉత్సాహంలో స్టాక్ మార్కెట్ సూచీలు వారం రోజుల గరిష్ఠ స్థాయికి దూసుకుపోయాయి. కేంద్రానికి ఆర్‌బీఐ రూ.2.69 లక్షల కోట్ల భారీ డివిడెండ్ పంచడం, భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని నీతి ఆయోగ్ ప్రకటించడం, ఈయూపై 50 శాతం సుంకాల అమలును ట్రంప్ జూలై 9కి వాయిదా వేయడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. మదుపరులు ఆటో, ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో సెన్సెక్స్ 455.37 పాయింట్ల లాభంతో 82,176.45 వద్ద ముగిసింది. ఒకదశలో సూచీ 771 పాయింట్లకు పైగా ఎగిసి 82,492 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 148 పాయింట్లు పెరిగి 25,001.15 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు పెరిగి రూ.444.79 లక్షల కోట్లకు చేరింది.

- డాలర్‌తో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి రూ.85.10 వద్ద ముగిసింది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.550 పెరిగి రూ.99,300కు చేరగా.. కిలో వెండి రూ.1,170 పెరుగుదలతో రూ.1,00,370కి ఎగబాకింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 25 డాలర్లు పెరిగి 3,332 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

గ్రో ఐపీఓ.. రూ.8,500 కోట్ల వరకు సమీకరణ

ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్ 'గ్రో' మాతృ సంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు(డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ 70-100 కోట్ల డాలర్ల (రూ.5,950-8,500 కోట్లు) స్థాయిలో నిధులు సమీకరించే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల సమాచారం.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ.20.69 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.448.92 కోట్ల ఆదాయంపై రూ.20.69 కోట్ల నికరలాభం ఆర్జించింది. ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 55%, లాభం 39% పెరిగాయి. ఈ త్రైమాసికంలో తాము 219 వాహనాలను డెలివరీ చేశామని, గత ఏడాది అందించిన 131 వాహనాలతో పోల్చితే ఇది 67% అధికమని కంపెనీ తెలిపింది. ఇప్పటికి మొత్తం 2,718 బస్సులను అందించినట్లు పేర్కొంది. ప్రస్తుతం తమ చేతిలో 10,022 బస్సుల సరఫరా ఆర్డర్లున్నట్టు తెలియచేసింది. మార్చి 31తో ముగిసిన ఏడాది కాలానికి ఒక్కో షేరుపై రాబడి (ఈపీఎస్) రూ.9.36 నుంచి రూ.16.92కి పెరిగినట్టు కంపెనీ సీఎండీ కేవీ ప్రదీప్ ప్రకటించారు. ఇదిలా ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.1801.9 కోట్ల ఆదాయంపై రూ.139.21 కోట్ల నికరలాభం ఆర్జించింది.

స్వల్పంగా తగ్గిన అరబిందో ఫార్మా లాభం

న్యూఢిల్లీ: అరబిందో ఫార్మా లాభాలు మార్చి త్రైమాసికంలో స్వల్పంగా తగ్గాయి. 2024 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.907 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించిన ఈ కంపెనీ ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో రూ.903 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అయితే ఇదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.7,580 కోట్ల నుంచి రూ.8,382 కోట్లకు చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ.3,484 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.29,002 కోట్ల నుంచి రూ.31,724 కోట్లకు పెరిగింది. అమ్మకాలు, స్థూల లాభంపరంగా చూస్తే ఇది తమకు అత్యుత్తమ త్రైమాసికమని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు.

రోటెర్‌డ్యామ్ పోర్టుతో ఏఎం గ్రీన్ ఒప్పందం

భారత-యూరప్ మధ్య గ్రీన్ ఫ్యూయల్ కారిడార్

న్యూఢిల్లీ: ఏఎం గ్రీన్ పెద్ద ఎత్తున యూరప్ దేశాలకు గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు సిద్ధమవుతోంది. ఇందుకోసం రోటెర్‌డ్యామ్ పోర్టుతో ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఏటా దాదాపు 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,500 కోట్లు) విలువైన 10 లక్షల టన్నుల హరిత అమ్మోనియా, హైడ్రోజన్ యూరప్‌కు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. రోటెర్‌డ్యామ్ రేవు అధికారులు ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తారు. ఈ ఒప్పందం ప్రకారం ఏఎం గ్రీన్ కంపెనీ యూరప్ వాయువ్య ప్రాంతంలోని కంపెనీలకు అవసరమైన హరిత నౌకా, విమాన ఇంధనాలు సరఫరా చేస్తుంది.

కాకినాడ ప్లాంటు: వచ్చే ఏడాది ద్వితీయార్థానికల్లా కాకినాడ ప్లాంటులో హరిత అమ్మోనియా, హైడ్రోజెన్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఏఎం గ్రీన్ ప్రకటించింది. దాదాపు రూ.12,500 కోట్ల పెట్టుబడితో కంపెనీ ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఇందులో తొలి దశలో ఏటా 10 లక్షల టన్నుల హరిత అమ్మోనియా ఉత్పత్తి చేస్తారు. ఈ మొత్తాన్ని దిగుమతి చేసుకునేందుకు యూరప్‌నకు చెందిన వివిధ కంపెనీలు ఇప్పటికే ఏఎం గ్రీన్ కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

సిమెంట్ రంగంలో మరిన్ని కొనుగోళ్లు

మూడీస్ అంచనా

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ పరిశ్రమలో కన్సాలిడేషన్ కొనసాగుతుందని మూడీస్ రేటింగ్స్ ఒక నివేదికలో తెలిపింది. చిన్న కంపెనీలే ఇందుకు లక్ష్యమవుతాయని పేర్కొంది. గత ఐదేళ్లలో టాప్-10 కంపెనీలు రూ.89,000 కోట్ల పెట్టుబడితో 14 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్రాంతీయ చిన్న కంపెనీలను కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. మార్కెట్‌పై పట్టు బిగించేందుకు అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ వంటి పెద్ద కంపెనీలు ఇక ముందు కూడా తక్కువ ఉత్పత్తి సామర్థ్య వినియోగం, అరకొర లాభాలతో పని చేసే చిన్న చిన్న కంపెనీల కొనుగోళ్లు కొనసాగిస్తాయని మూడీస్ రేటింగ్స్ అంచనా. ఒక్క దక్షిణ భారతంలోనే ఇలాంటి చిన్న కంపెనీలు 70 వరకు ఉన్న విషయాన్ని గుర్తు చేసింది.

మరింత ఉత్పత్తి సామర్థ్యం : పెరుగుతున్న గృహ నిర్మాణం, ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో 2030 వరకు దేశంలో సిమెంట్ గిరాకీ ఏటా ఆరు నుంచి ఏడు శాతం వరకు పెరుగుతుందని అంచనా వేసింది. డిమాండ్‌ను తట్టుకునేందుకు కంపెనీలు వచ్చే ఐదేళ్లలో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 30 శాతం (20 కోట్ల టన్నులు) పెంచాల్సి ఉంటుందని మూడీస్ స్పష్టం చేసింది. ఇందులో 17 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం 2028 మార్చి నాటికి అందుబాటులోకి రానుంది. 2030 నాటికి ఏర్పడే 20 కోట్ల అదనపు ఉత్పత్తి సామర్థ్యంలో 30 శాతం (ఆరు కోట్ల టన్నులు) అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ కంపెనీల ద్వారానే అందుబాటులోకి రానుంది. మరో 25 శాతం ఉత్పత్తి శ్రీ సిమెంట్, దాల్మియా భారత్ కంపెనీల ద్వారా అందుబాటులోకి వస్తుందని అంచనా.

ధరలు మరింత పైకి : మరోవైపు సిమెంట్ కంపెనీలు ధరల పెంపు ప్రారంభించాయి. వారం పది రోజుల క్రితం వరకు తెలుగు రాష్ట్రాల్లో 50 కిలోల సిమెంట్ బస్తా ధర కంపెనీని బట్టి రూ.310 నుంచి రూ.350 వరకు ఉండేది. ఇపుడది రూ.360 నుంచి రూ.400 పలుకుతోంది. గత రెండు నెలల్లో కంపెనీలు ధరలు పెంచడం ఇది రెండో సారి. ధరలు పెంచడంతో అమ్మకాలు మరింత తగ్గాయని రిటైల్ డీలర్లు చెబుతున్నారు. బస్తా సిమెంట్ ధర కనీసం రూ.400 ఉంటే తప్ప గిట్టుబాటు కాదని కంపెనీలు చెబుతున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	510
వరంగల్	512	గోదావరి	505
చిత్తూరు	603	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	111	అనంతపురం	110
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▼	89,500 ▼	1,11,000 ▲
విజయవాడ	99,000 ▼	93,000 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	98,830 ▲	89,950 ▲	1,11,000 ▲
రాజమండ్రి	97,640 ▼	89,500 ▼	1,09,000 ▲
ప్రొద్దుటూరు	96,300 ▲	88,600 ▲	99,000 ▼
ముంబై	95,810 ▲	95,430 ▲	97,400 ▲

ఇండిగోలో మరో 3.4 శాతం షేర్ల అమ్మకం

న్యూఢిల్లీ: ఇండిగో ప్రమోటర్లలో ఒకరైన రాకేశ్ గంగ్వాల్ మరో విడత షేర్ల అమ్మకానికి సిద్ధమయ్యారు. మంగళవారం తనకు, తన కుటుంబ ట్రస్టుకు ఇండిగో ఈక్విటీలో ఉన్న 13.5% వాటాలో 3.4% వాటా (1.32 కోట్ల షేర్లు) అమ్మకానికి పెడుతున్నారు. ఒక్కోటి రూ.5175 చొప్పున ఆయన, ఆయన కుటుంబ సభ్యులు ఈ షేర్లను అమ్మకానికి పెట్టారు. ఈ అమ్మకం ద్వారా గంగ్వాల్ కుటుంబానికి రూ.6,831 కోట్లు లభిస్తాయని అంచనా.

ఈక్విటీ డెరివేటివ్‌ల ముగింపునకు మంగళ లేదా గురువారం

స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సెబీ నిర్దేశం

అన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లోనూ ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు ఒకే రోజున జరిగేందుకు సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు మంగళవారం లేదా గురువారాన్ని ఎంచుకోవాలని ఎక్స్ఛేంజ్‌లను సెబీ నిర్దేశించింది. ఈ జూన్ 15 కల్లా ఎక్స్ఛేంజ్‌లు తమ ప్రతిపాదనను పంపాలని కోరింది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్టుల ముగింపు రోజు గురువారం కాగా.. బీఎస్ఈలో మంగళవారంగా ఉంది.

డ్రూల్స్‌లో నెస్లేకు మైనారిటీ వాటా

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన పెంపుడు జంతువుల ఆహారోత్పత్తుల బ్రాండ్ డ్రూల్స్‌లో మైనారిటీ వాటాను అంతర్జాతీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఎస్ఏ కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం వివరాలను మాత్రం వెల్లడించలేదు. నెస్లే ఎస్ఏ భారత బ్రాండ్లలో పెట్టుబడి పెట్టడం ఇదే తొలిసారి. దేశీయ ఎఫ్ఎంసీజీ కంపెనీ నెస్లే ఇండియా మాతృసంస్థే నెస్లే ఎస్ఏ.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — వేదిక: లఖ్‌నవూ

లఖ్‌నవూ x బెంగళూరు — రా.7.30 నుంచి

పారా అథ్లెట్ మహేంద్ర ప్రపంచ రికార్డు



న్యూఢిల్లీ: భారత పారా అథ్లెట్ మహేంద్ర గుర్జార్ పురుషుల జావెలిన్ ఎఫ్ 42 విభాగంలో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో భాగంగా జావెలిన్‌ను 61.17 మీటర్ల దూరం విసిరిన 27 ఏళ్ల మహేంద్ర నూతన రికార్డుతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో 2022లో బ్రెజిల్ త్రోయర్ రాబెర్టో ఫ్లోరియాని 59.19 మీటర్ల దూరంతో నమోదు చేసిన గత ప్రపంచ రికార్డ్‌ను గుర్జార్ తిరగ రాశాడు. ఇక..పురుషుల ఎఫ్64 జావెలిన్ త్రోలో రెండుసార్లు పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత సుమిత్ అంటిల్ (72.35 మీటర్లు) స్వర్ణం చేజిక్కించుకున్నాడు.

తేజస్వినికి స్వర్ణం



సుహ్ల్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో హరియాణా షూటర్ తేజస్విని పసిడి పతకంతో మెరిసింది. సోమవారం ఇక్కడ జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 31 పాయింట్లు సాధించిన తేజస్విని ప్రథమ స్థానంలో నిలిచింది. అలీనా నెస్ట్‌యారోవిచ్ (తటస్థ అథ్లెట్) రజతం, మిరియం (హంగేరి) కాంస్యం సాధించారు. ఈ పోటీల్లో భారత్‌కిది మూడో స్వర్ణం కాగా.. మొత్తంగా 11వ పతకం. ఈ మెడల్‌తో చైనాను వెనక్కి నెట్టి వరల్డ్‌కప్ పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది.

బరిలో సాత్విక్ జోడీ

నేటి నుంచి సింగపూర్ ఓపెన్



సింగపూర్: ఫిట్‌నెస్ సమస్యలతో కొన్ని టోర్నీలకు దూరమైన భారత డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి.. సింగపూర్ ఓపెన్‌లో రీఎంట్రీ ఇవ్వనున్నారు. మంగళవారం నుంచి జరిగే టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మలేసియాకు చెందిన చూంగ్ హాన్ జియాన్-హైకల్ జంటతో సాత్విక్ జోడీ తలపడనుంది. కిడాంబి శ్రీకాంత్ ఈ టోర్నీ నుంచి తప్పుకొన్నా.. ప్రణయ్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోడ్, పీవీ సింధు, ఉన్నతి హుడా, అనుపమ బరిలోకి దిగనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, కవిప్రియ-సిమ్రన్, అమృత-సోనాలి, మిక్స్‌డ్‌లో రుత్విక శివాని-రోహన్, తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంటలు ఆడనున్నాయి.

ఇన్‌స్టాలో అమ్మాయితో అర్ష్‌దీప్ చాటింగ్!



వైరల్‌గా మారిన స్క్రీన్‌షాట్లు

న్యూఢిల్లీ: టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ సోషల్‌మీడియా వివాదంలో చిక్కుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ అమ్మాయితో అర్ష్‌దీప్ చాట్ చేసినట్టుగా ఉన్న స్క్రీన్‌షాట్లతో కూడిన వీడియో ఒకటి బయటికొచ్చింది. సదరు అమ్మాయితో అర్ష్‌దీప్ వ్యక్తిగత సంభాషణ చేసినట్టున్న ఆ సందేశాల్లో అసభ్యపదజాలం లేదు కానీ, ఆ స్క్రీన్‌షాట్ల వీడియో మాత్రం వైరల్‌గా మారింది. ఈ చాటింగ్‌పై సోషల్‌మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 26 ఏళ్ల అర్ష్‌దీప్ ప్రస్తుతం ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు.

వావ్..పంజాబ్

- క్వాలిఫయర్-1కు అయ్యర్ సేన
- అదరగొట్టిన ఆర్య, ఇంగ్లిస్
- 7 వికెట్లతో ముంబై చిత్తు


ఇంగ్లిస్ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 73)

జైపూర్: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో టాప్-2 బెర్త్‌ను ఖరారుచేసుకొంది. జోష్ ఇంగ్లిస్ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 73), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో..సోమవారం జరిగిన కీలక మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్లతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 184/7 స్కోరు చేసింది. సూర్యకుమార్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57) హాఫ్ సెంచరీ చేయగా.. రికెల్టన్ (27), హార్దిక్ (26), రోహిత్(24) పర్వాలేదనిపించారు. అర్ష్‌దీప్, జాన్సెన్, వైశాక్ తలో 2 వికెట్లు తీశారు. ఛేదనలో పంజాబ్ 18.3 ఓవర్లలో 187/3 స్కోరు చేసి గెలిచింది. శ్రేయాస్ (26 నాటౌట్) రాణించాడు. శాంట్నర్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఇంగ్లిస్ నిలిచాడు.

సునాయాసంగా..: ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (13) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. ఆర్య, ఇంగ్లిస్ రెండో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నిలిపారు. ముంబై పేసర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పవర్‌ప్లేలో పంజాబ్ 47/1తో నిలిచింది. వీరిద్దరూ 12వ ఓవర్‌లో అర్ధ శతకాలు పూర్తి చేసుకొన్నారు. అయితే, 15వ ఓవర్‌లో ఆర్యను అవుట్ చేసిన శాంట్నర్.. వీరి భాగస్వామ్యాన్ని విడదీశాడు. చివరి 5 ఓవర్లలో పంజాబ్ విజయానికి 39 పరుగులు కావల్సి ఉండగా.. ఇంగ్లిస్, శ్రేయాస్ అయ్యర్ 28 పరుగుల భాగస్వామ్యంతో వేగంగా ముగించే ప్రయత్నం చేశారు. 15 బంతుల్లో 14 పరుగులు అవసరపడగా.. ఇంగ్లిస్‌ను శాంట్నర్ ఎల్బీ చేశాడు. కానీ, రెండు సిక్స్‌లు బాదిన అయ్యర్.. మరో 9 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించాడు.

ఆదుకొన్న సూర్య: సూర్యకుమార్ అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. ముంబై పోరాడగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శర్మ తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. ఆరో ఓవర్‌లో రికెల్టన్‌ను జాన్సెన్ క్యాచవుట్ చేశాడు. 9వ ఓవర్‌లో జేమిసన్ బౌలింగ్‌లో సూర్య 6,4,4 బాదినా.. ఆ తర్వాతి ఓవర్‌లో బ్రార్ బౌలింగ్‌లో వధేరా అద్భుత క్యాచ్‌తో రోహిత్ వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తిలక్ వర్మ (1), విల్ జాక్స్ (17) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో హార్దిక్ పాండ్యా కొంత ఊపుతెచ్చాడు. డకౌటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకొన్న పాండ్యా.. ఆ తర్వాత స్కోరువేగం పెంచే ప్రయత్నం చేశాడు. కానీ, 17వ ఓవర్‌లో జాన్సెన్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన హార్దిక్.. ఆ తర్వాతి బంతికే వెనుదిరిగాడు. చివరి మూడు ఓవర్లలో సూర్య, నమన్(20) ఆరో వికెట్‌కు వేగంగా 31 పరుగులు జోడించడంతో.. ముంబై స్కోరు 180 దాటింది. 19వ ఓవర్‌లో వైశాక్ బౌలింగ్‌లో నమన్ రెండు సిక్స్‌లు, సూర్య రెండు బౌండ్రీలు సాధించడంతో మొత్తం 23 రన్స్ లభించాయి. ఆఖరి ఓవర్‌లో నమన్, సూర్యను అర్ష్‌దీప్ అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (సి) అయ్యర్ (బి) జాన్సెన్ 27, రోహిత్ (సి) వధేరా (బి) బ్రార్ 24, సూర్య (ఎల్బీ) అర్ష్‌దీప్ 57, తిలక్ (సి) అర్ష్‌దీప్ (బి) వైశాక్ 1, జాక్స్ (సి) జాన్సెన్ (బి) వైశాక్ 17, హార్దిక్ (సి) ఇంగ్లిస్ (బి) జాన్సెన్ 26, నమన్ (సి) ఆర్య (బి) అర్ష్‌దీప్ 20, శాంట్నర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 184/7; వికెట్ల పతనం:** 1-45, 2-81, 3-87, 4-106, 5-150, 6-181, 7-184; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-28-2, జేమిసన్ 4-0-42-0, జాన్సెన్ 4-0-34-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-36-1, వైశాక్ 4-0-44-2.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) సూర్య (బి) శాంట్నర్ 62, ప్రభ్‌సిమ్రన్ (సి) అశ్వని కుమార్ (బి) బుమ్రా 13, ఇంగ్లిస్ (ఎల్బీ) శాంట్నర్ 73, శ్రేయాస్ (నాటౌట్) 26, నేహల్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 18.3 ఓవర్లలో 187/3; వికెట్ల పతనం:** 1-34, 2-143, 3-171; **బౌలింగ్:** బౌల్ట్ 3.3-0-36-0, దీపక్ చాహర్ 3-1-28-0, బుమ్రా 4-0-23-1, శాంట్నర్ 4-0-41-2, హార్దిక్ 2-0-29-0, అశ్వని కుమార్ 1-0-16-0, విల్ జాక్స్ 1-0-11-0.

'టాప్-2' లక్ష్యంగా..

నేడు లఖ్‌నవూతో ఆర్‌సీబీ పోరు

లఖ్‌నవూ: ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో చోటే కాకుండా టాప్-2లో నిలవాలని ప్రతీ జట్టు భావిస్తుంటుంది. ఎందుకంటే వీటి మధ్య జరిగే క్వాలిఫయర్1లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్లడంతో పాటు ఓడిన టీమ్‌కు మరో చాన్స్ ఉంటుంది. ఇక.. ముంబైపై గెలుపుతో 19 పాయింట్లతో పంజాబ్ అగ్రస్థానంలో నిలిచింది. క్వాలిఫయర్1లో ఆ జట్టుతో పోటీ పడేందుకు ఆర్‌సీబీ ఉవ్విళ్లూరుతోంది. అయితే అంతకంటే ముందు మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగే మ్యాచ్‌లో పటీదార్ సేన కచ్చితంగా గెలవాల్సిందే. లేకపోతే 18 పాయింట్లతో ఉన్న గుజరాత్ టైటాన్స్ రెండో స్థానం దక్కించుకుంటుంది. లఖ్‌నవూ తమ చివరి మ్యాచ్‌లో టైటాన్స్‌ను చిత్తుగా ఓడించి ఊపు మీదుంది. బెంగళూరు మాత్రం సన్‌రైజర్స్‌పై రెండు విభాగాల్లోనూ నిరాశపరిచింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	14	9	4	1	19	0.372
గుజరాత్	14	9	5	0	18	0.254
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	14	8	6	0	16	1.142
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్వియటెక్ సులువుగా..

రెండో రౌండ్‌లో ప్రవేశం

- అల్కారజ్ కూడా..
- టేలర్ ఫ్రిట్జ్‌కు షాక్
- ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: డిఫెండింగ్ చాంపియన్స్ ఇగా స్వియటెక్, కార్లోస్ అల్కారజ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. సోమవారం జరిగిన మహిళల తొలి రౌండ్‌లో ఐదో సీడ్ స్వియటెక్ 6-3, 6-3తో రెబెక్కా స్కమ్‌కోవాను ఓడించింది. గంటా 24 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో స్వియటెక్ 25 విన్నర్లు సంధించగా, నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది. ఇక గతేడాది యూఎస్ ఓపెన్ సెమీస్‌కు చేరిన తొమ్మిదో సీడ్ ఎమ్మా నవ్రో 0-6, 1-6తో అన్‌సీడెడ్ బౌజాస్ చేతిలో, నవోమి ఒసాక 7-6, 1-6, 4-6తో పాలా బడోసా చేతిలో ఓడారు. అలాగే ఎమ్మా రడుకాను, ఎలెనా రిబకినా తమ ప్రత్యర్థులపై నెగ్గి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. పురుషుల విభాగంలో రెండో సీడ్, స్పెయిన్ స్టార్ అల్కారజ్ 6-3, 6-4, 6-2తో జెప్పిరిపై గెలిచాడు. ఏడో సీడ్ కాస్పర్ రూడ్ 6-3, 6-4, 6-2తో అల్బర్ట్ రామోస్‌పై నెగ్గాడు. అయితే ప్రపంచ నాలుగో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ తొలి రౌండ్‌లోనే కంగుతిన్నాడు. జర్మనీ ఆటగాడు డానియెల్ అల్ట్‌మెర్ 7-5, 3-6, 6-3, 6-1తో అతడిపై గెలిచాడు. మాజీ చాంపియన్ స్టాన్ వావ్రింకా 6-7, 3-6, 2-6తో జేకబ్ ఫెన్లీ చేతిలో ఓడాడు. 20వ సీడ్ సిట్సిపాస్ 7-5, 6-3, 6-4తో టోమస్‌పై నెగ్గి రెండో రౌండ్ చేరారు.

గంగూలీ సోదరుడికి తప్పిన ప్రాణాపాయం

పూరీ: బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు స్నేహాశీష్ గంగూలీ, అతడి భార్య అర్పితలకు సముద్రంలో పెను ప్రమాదం తప్పింది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి అన్న అయిన స్నేహాశీష్.. భార్యతో కలిసి గత శనివారం ఒడిషాలోని పూరీకి విహారయాత్రకు వెళ్లాడు. అక్కడి సముద్ర తీరంలో బోటింగ్ చేస్తుండగా భారీ అలల కారణంగా వీరి స్పీడ్ బోట్ బోల్తా పడింది. దీంతో ఈ దంపతులను గమనించిన అక్కడి ఫిషర్‌మెన్, లైఫ్‌గార్డ్స్ వెంటనే వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఇది తమకు రెండో జీవితం లాంటిదని, ఆ జగన్నాథుడే కాపాడినట్టు స్నేహాశీష్ భావోద్వేగానికి గురయ్యాడు. కాగా మొదటి భార్యకు విడాకులిచ్చిన స్నేహాశీష్ (60) గతేడాది జులైలో అర్పితను రెండో పెళ్లి చేసుకున్నాడు.

ప్రియాంక్ గుడ్‌బై



అహ్మదాబాద్: గుజరాత్ మాజీ కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ (35) కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన ప్రియాంక్.. భారత్-ఎ జట్టుకు సారథ్యం వహించాడు. టీమిండియాకు రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైనా ఆడే అవకాశం మాత్రం దక్కలేదు. 17 ఏళ్ల కెరీర్‌లో 127 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 45.18 సగటుతో 8,856 పరుగులు సాధించాడు. 97 లిస్ట్-ఎ మ్యాచ్‌లు, 59 టీ20లు ఆడాడు. 2016-17 సీజన్‌లో గుజరాత్‌ను రంజీ విజేతగా నిలబెట్టడంలో ప్రియాంక్ కీలకపాత్ర పోషించాడు. విజయ్ హజారే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టైటిళ్లు గెలిచిన గుజరాత్ జట్టులో సభ్యుడు.

వరల్డ్ యూత్ ఆర్చరీ పోటీలకు ముగ్గురు తెలుగోళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ యూత్ ఆర్చరీ పోటీలకు ముగ్గురు తెలుగోళ్లు అర్హత సాధించారు. పుణెలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ ట్రయల్స్‌లో భీమవరం ఆర్చర్లు గణేష్, సూర్యహంసిని, పెద్దపల్లికి చెందిన చికితరావు సత్తా చాటారు. ఈ ప్రదర్శనతో వీరు ఆగస్టులో కెనడా వేదికగా జరిగే ప్రపంచ యూత్ ఆర్చరీ పోటీలకు అర్హత సాధించారు. గణేష్, చికిత.. జూన్‌లో సింగపూర్‌లో జరిగే ఆసియా కప్ స్టేజ్-2 పోటీలకు కూడా బెర్త్‌లు దక్కించుకున్నారు.

జీవనశైలి

ఉరుకుల పరుగుల జీవితం మనది. ఈ పరుగులో ఆహారం, నిద్రలు నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటాయి. ఒత్తిడిలు, ఆందోళనలు ఆవరిస్తూ ఉంటాయి. దాంతో ఒక్కసారిగా నిస్సత్తువకు లోనై, అడుగు వేయలేని పరిస్థితులు కూడా తలెత్తుతూ ఉంటాయి. ఇదే పరిస్థితి అరుదుగా కాకుండా తరచూ వేధిస్తుంటే, మూలాల్లోకి వెళ్లి అసలు కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దుకోవాలి.



నీరసం నలతగా మారితే...

మనలో చాలా మంది నీరసాన్ని పెద్దగా పట్టించుకోరు. దాన్నొక చిన్నపాటి నలతగా సరిపెట్టుకుని, దానంతట అదే సర్దుకుంటుందిలే అనే ఆలోచనతో బలవంతంగా పనులను చేసుకుపోతూ ఉంటారు. కానీ రాత్రంతా కంటి నిండా నిద్రపోయినా, ఉదయం నిద్ర లేచిన వెంటనే నిస్సత్తువ ఆవరిస్తున్నా, చిన్నపాటి పనులకే అలసట వేధిస్తున్నా పరిస్థితిని తీవ్రంగానే పరిగణించాలి.

ఆరోగ్యపరమైన కారణాలు ఇవే!

శరీర జీవక్రియలు గాడి తప్పినప్పుడు బయల్పడే మొట్టమొదటి సంకేతం నీరసం. ఈ పరిస్థితి ఎన్నో సందర్భాల్లో బయల్పడుతూ ఉంటుంది. అవేంటంటే...

- **హైపో థైరాయిడ్:** థైరాయిడ్ సమస్యల్లో కనిపించే ప్రధాన లక్షణం నీరసం. వీటితో పాటు కండరాల నొప్పులు, అతి నిద్ర, వెంట్రుకలు ఊడిపోవడం, చర్మం పొడిబారడం, నెలసరి క్రమం తప్పడం లాంటి లక్షణాలు తోడైతే వైద్యులను కలిసి థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి
- **మధుమేహం:** మధుమేహం తలెత్తినా, ఉన్న మధుమేహం క్రమం తప్పినా నీరసం వేధిస్తుంది. నీరసంతో పాటు దాహం, ఆకలి పెరగడం, గాయాలు మానకపోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తే వెంటనే వైద్యులను కలవాలి
- **పోషకలోపాలు:** బి12 పోషకలోపం ఎక్కువ మందిలో ఉంటుంది. మరీముఖ్యంగా శాకాహారుల్లో ఈ సమస్య ఎక్కువ.
- **క్యాల్షియం లోపం:** విటమిన్ డి లోపంతో, శరీరంలోకి చేరుకునే క్యాల్షియాన్ని శరీరం శోషించుకోలేదు.
- **అనీమియా:** రక్తహీనతలో కూడా నిస్సత్తువ వేధిస్తుంది. పోషకాహార లోపంతో పాటు, పెద్దపేగుల్లో సమస్యలతో విరోచనంలో రక్తస్రావం మూలంగా కూడా నీరసం వేధిస్తుంది. మహిళల్లో ఫైబ్రాయిడ్స్ వల్ల అధిక రక్తస్రావంతో రక్తహీనత తలెత్తి, నిస్సత్తువ ఆవరిస్తుంది
- **నిద్రలేమి:** మన జీవగడియారం రాత్రి నిద్రకు తగ్గట్టు రూపొంది ఉంటుంది. కాబట్టి ఆ జీవగడియారం క్రమం తప్పకుండా చూసుకోవాలి. రాత్రుళ్లు మేలుకుంటూ పగలు ఏడు గంటలు నిద్రపోయినా నిస్సత్తువ వేధించడానికి కారణం ఇదే!
- **ఒత్తిడి:** వృత్తిపరమైన, వ్యక్తిగతమైన ఒత్తిళ్లు నిద్రకు దూరం చేస్తాయి. శరీరాన్ని నీరసింపజేస్తాయి. కాబట్టి వాటిని తగ్గించుకునే మార్గాలను కనిపెట్టాలి. అందుకోసం యోగా, ధ్యానం సహాయపడతాయి

ఇలా నిస్సత్తువ బలాదూర్

- సరైన సమయంలో సరిపడా నిద్ర
- నిద్రకు గంటకు ముందు నుంచి అన్ని రకాల స్ర్కీన్స్‌కు దూరంగా ఉండాలి
- ప్రొటీన్లు, పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి
- రోజు మొత్తంలో మూడు ప్రధాన భోజనాలు, రెండు అల్పాహారాలు తీసుకోవాలి
- కనిష్ఠంగా రోజుకు 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి
- ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి



సప్లిమెంట్లు ఎప్పుడు?

పోషక లోపాలను ఆహారంతో భర్తీ చేసుకోవడం కొంత వరకూ తేలికే! విటమిన్ బి12 లోపం ఉన్న వ్యక్తులు మాంసాహారులైన పక్షంలో మాంసాహారంతో ఆ లోపాన్ని భర్తీ చేసుకోవచ్చు. అయితే శాకాహారులకు ఇది సాధ్యపడకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో పోషకాలను సప్లిమెంట్ల రూపంలో తీసుకోక తప్పదు. అయితే వీటిని వాడుకునే సమయంలో ఏ పోషక లోపం కొరవడిందో దాన్ని మాత్రమే భర్తీ చేసే సప్లిమెంట్లు వాడుకోవాలి. బదులుగా ఇతరత్రా విటమిన్లు, ఖనిజలవణాల లోపాలను కూడా భర్తీ చేసే సప్లిమెంట్లను వాడుకోకూడదు.

మెనోపాజ్ మహిళల్లో...

నెలసరి ఆగిపోయిన తర్వాత శరీరంలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోయి, ఎముకలు గుల్లబారే సమస్య తలెత్తుతుంది. దాంతో ఎముకల నొప్పులు వేధిస్తూ ఉంటాయి. కానీ ఎక్కువ మంది మహిళలు ఈ సమస్యను తీవ్రంగా పరిగణించకుండా, పైబడే వయసులో ఇవన్నీ సహజమే అని సరిపెట్టుకుంటూ ఉంటారు. కానీ నిస్సత్తువను దూరం చేయడంతో పాటు ఎముకలను దృఢంగా ఉంచుకోవడం కోసం సప్లిమెంట్లు తప్పక వాడుకోవాలి.

ఈ పరీక్షలు అవసరం

నిస్సత్తువకు అసలు కారణాన్ని కనిపెట్టడం కోసం కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సిబిపి), విటమిన్ డి3, బి12, థైరాయిడ్, మధుమేహ పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. ఫలితాన్ని బట్టి సమస్యను మందులతో సరిదిద్దుకోవడం ద్వారా నిస్సత్తువను దూరం చేసుకోవచ్చు.

వ్యాయామం కీలకం

శరీరం చురుగ్గా ఉండడానికి వ్యాయామం చేయడం తప్పనిసరి. గుండె సమస్యలు, కీళ్ల సమస్యలు లేనివాళ్లు కార్డియో వ్యాయామంలో భాగంగా ఏరోబిక్స్ చేయొచ్చు. ప్రతి రోజూ నడవడం ఆరోగ్యకరమే! కానీ కార్డియోతో పాటు కండరాలను బలపరిచే స్ట్రెంగ్త్‌నింగ్ వ్యాయామాలు కూడా జోడించాలి. ఇలా బరువులతో కూడిన వ్యాయామాలతో కండరాలను బలపరుచుకోవడం వల్ల, మన శరీర బరువును మోసే బాధ్యతను కేవలం ఎముకలే కాకుండా కండరాలు కూడా తీసుకుంటాయి. దాంతో శరీరం తేలిక అవుతుంది.

డాక్టర్ శ్రద్ధా సంఘాని,
కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్,
రెనోవా సెంచరీ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్



పరిశోధన

మైక్రోప్లాస్టిక్స్ ఇలా మాయం



శరీరంలోకి చేరుకునే మైక్రోప్లాస్టిక్స్ ఆరోగ్యానికి ఎంత హాని కరమో మనందరికీ తెలిసిందే! ఇవి నీళ్ల ద్వారా మన శరీరంలోకి చేరుకుంటూ ఉంటాయి. కాబట్టి బెండకాయ, మెంతులతో వాటిని నిర్మూలించే ఒక చిన్న చిట్కాను శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అదేంటంటే...

నీటి శుద్ధి ప్రక్రియలో మెంతులు, బెండకాయ పొడులను కలపడం ద్వారా నీళ్లలో కలిసిన మైక్రోప్లాస్టిక్స్‌తో పాటు ఇతరత్రా కలుషితాలను నిర్మూలించవచ్చని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అందుకోసం ఒక లీటరునీళ్లలో ఒక గ్రాము బెండకాయ, మెంతి పొడిని కలపడం ద్వారా గంట సమయంలో 67% మైక్రోప్లాస్టిక్స్ తొలగిపోయినట్టు వాళ్లు ప్రయోగాలతో కనిపెట్టారు. సముద్రపు నీళ్లలో కలిపిన బెండ, మెంతి పొడులు సహజసిద్ధ పాలిమర్స్‌లా ప్రవర్తిస్తూ, సింథటిక్, వాణిజ్యపరమైన పాలిమర్స్ కంటే ఎంతో సమర్థంగా వ్యర్థనీటి శుద్ధికి తోడ్పడుతున్నట్టు వాళ్లు తెలుసుకున్నారు. ఈ తాజా ప్రయోగంతో నీటిశుద్ధి ప్రక్రియ మరింత మెరుగుపడి, నీటిలో కలిసిన మైక్రోప్లాస్టిక్స్, కలుషితాలు తొలగిపోయి, వాటితో ముడిపడి ఉండే అనారోగ్యాల ముప్పు తప్పుతుందని వాళ్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోషకాహారం

క్యాల్షియం కావాలా?

క్యాల్షియం ఏఏ ఆహార పదార్థాల్లో దొరుకుతుందో తెలిసినా, వాటిని ఎంత పరిమాణంలో తింటే ఎంత క్యాల్షియం దక్కుతుందనే అవగాహన అందరికీ ఉండదు. ఒక కప్పు పరిమాణంలోని భిన్నమైన పదార్థాల్లో ఎంత క్యాల్షియం ఉంటుందో తెలుసుకుందాం!



రాగి	:	344 మిల్లీ గ్రాములు
మినుములు	:	124 మిల్లీ గ్రాములు
తోటకూర	:	500 మిల్లీ గ్రాములు
కరివేపాకు	:	830 మిల్లీగ్రాములు
బాదం	:	230 మిల్లీగ్రాములు
మునగాకు	:	440 మిల్లీ గ్రాములు
నువ్వులు	:	1450 మిల్లీ గ్రాములు
పెరుగు	:	150 మిల్లీ గ్రాములు
అటుకులు	:	238 మిల్లీ గ్రాములు

అవగాహన

డార్క్ చాక్లెట్‌తో బీపీకి చెక్



చాక్లెట్‌ను ఇష్టపడని వారుండరు. అయితే డార్క్ చాక్లెట్ రక్తపోటును తగ్గిస్తుందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు తెలుసుకుందాం..

యూకే యూనివర్సిటీ ఆఫ్ సర్రే పరిశోధకులు తాజాగా చేపట్టిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. డార్క్ చాక్లెట్, ద్రాక్ష, యాపిల్, టీలను రోజూ తీసుకుంటే అధిక రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని యూరోపియన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ కార్డియాలజీలో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఫ్లేవనాయిడ్ సమ్మేళనాలు రక్తపోటును నియంత్రిస్తాయనీ, గుండె ఆరోగ్యంలో ముఖ్య పాత్ర పోషించే రక్తనాళాల లోపలి సన్నని పొర ఎండోథీలియం పనితీరును మెరుగుపరుస్తాయనీ పరిశోధకులు అధ్యయనంలో కనుగొన్నారు. కోకో, బ్లాక్ టీ, గ్రీన్ టీ, యాపిల్స్, బెర్రీలు, ద్రాక్షలు వంటి వాటిలో ఫ్లేవనాయిడ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అందుకే ఈ ఆహార పదార్థాలను కొద్దిమొత్తంలో రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు. అయితే ఈ ఆహార పదార్థాలు వైద్యులు సూచించే మందులకు ప్రత్యామ్నాయం కాదని కూడా వారు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 128 కోట్ల మంది ప్రజలు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. అధిక రక్తపోటు... గుండెపోటు, గుండె వైఫల్యం, మూత్రపిండాల వ్యాధులు లాంటి ప్రాణాంతక సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి రక్తపోటును నియంత్రించే మందులు వాడుకోవడంతో పాటు, సమతులాహారం తీసుకుంటూ, శారీరకంగా చురుగ్గా ఉంటూ, ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలి.

అప్రమత్తం

కండరాల మీద ఓ కన్నేసి...

ప్రతి క్షణం మన శరీరంలో ఏదో ఒక కండరం పని చేస్తూనే ఉంటుంది. మన శరీర కదలికలన్నీ కండరాల మీదే ఆధారపడి ఉంటాయి. కాబట్టి అవి మొండికేసినా, దెబ్బ తిన్నా, క్షీణించినా నొప్పులు, అసౌకర్యాలు తప్పవు. కాబట్టి కండరాల మీద ఓ కన్నేసి ఉంచాలంటున్నారు వైద్యులు.



> నొప్పి, వాపు, అవయవాన్ని కదిలించలేకపోవడం.. దెబ్బతిన్న కండరం ప్రధాన లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలవాలి. వారు సూచించినంత కాలం ఆ కండరాలకు విశ్రాంతినివ్వాలి.

మనకు తెలియకుండానే మనమెన్నో మార్గాల్లో కండరాలను ఇబ్బంది పెడుతూ ఉంటాం. తప్పుడు కోణంలో చేతులను, కాళ్లను వంచుతాం. అవసరానికి మించి ఒకే అవయవ కండరాలను ఒత్తిడికి లోను చేస్తాం. అంతే కాదు, కండరాలను బలపరిచే ఆహారాన్ని నిర్లక్ష్యం చేస్తూ, కండరాల బలహీనత బారిన పడుతూ ఉంటాం. ఫలితంగా నొప్పులు వేధించినా అవి స్వీయ తప్పిదాలనే విషయాన్ని గ్రహించకుండా, అవే పొరపాట్లు మళ్లీ మళ్లీ చేస్తూ, అంతిమంగా వైద్యులను కలిసే పరిస్థితిని కొని తెచ్చుకుంటూ ఉంటాం.

కండరాల బలహీనత ఇందుకే...

సాధారణంగా 60 ఏళ్ల వయసులో కీళ్ల నొప్పులు మొదలవుతాయి. కానీ నేడు 40 ఏళ్లకే కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. మెట్లు ఎక్కినా, కొద్ది దూరం నడిచినా మోకాళ్ల నొప్పి పెడుతూ ఉంటాయి. ఇందుకు కారణం మోకీళ్లకు దన్నుగా ఉండే కండరాలు బలహీనపడడమే! ఇలా మోకాళ్లలోని కండరాలు బలహీనపడడానికి అధిక బరువు, కండర బలహీనత, ఇండియన్ టాయిలెట్స్ వాడకం ప్రధాన కారణాలు. సమస్య ఏ కారణంతో ముడిపడి ఉన్నప్పటికీ కండరాల నొప్పులు దరి చేరకుండా ఉండాలంటే ఎత్తుకు తగిన బరువును కలిగి ఉండాలి. భారతీయ మహిళలు సగటున 158 సెంటీమీటర్ల ఎత్తు ఉంటారు కాబట్టి 58 నుంచి 60 కిలోల బరువు ఉంటే సరిపోతుంది. పురుషులు 178 సెంటీమీటర్ల ఎత్తు ఉంటారు కాబట్టి బరువు 72 కిలోలు ఉంటే సరిపోతుంది. కానీ మన దేశంలో సగటున ప్రతి ఒక్కరూ ఐదారు కిలోలు అధిక బరువును కలిగి ఉంటున్నారు

- **అధిక బరువు:** మన శరీరం ఒక కిలో ఎక్కువ బరువు పెరిగితే, శరీరం మీద రెండు కిలోల భారం పడుతుంది. కాబట్టి తప్పనిసరిగా ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి.
- **వ్యాయామం:** రోజుకు కనీసం అరగంట పాటైనా వ్యాయామం చేయాలి. లేదంటే వారంలో నాలుగు రోజుల పాటు అరగంట చొప్పున వారం మొత్తంలో 150 నిమిషాలకు తగ్గకుండా చూసుకోవాలి
- 50 ఏళ్లు దాటిన వాళ్లు మెట్లు, ఇండియన్ టాయిలెట్స్ వాడకపోవడమే మంచిది

మెడ నొప్పి వెనక...

విటమిన్ డి3 లోపం సర్వసాధారణమైపోయింది. దీంతో తలెత్తే ప్రధాన ఇబ్బంది మెడ నొప్పి. ప్రతి వంద మందిలో 80 మందికి విటమిన్ డి3, 30 కంటే తక్కువగా ఉంటోంది. విటమిన్ డి సమృద్ధిగా దొరికే పాల ఉత్పత్తులు, ఆకుకూరలు సరిపడా తీసుకోకపోవడం, సూర్యరశ్మికి బహిర్గతం అవకపోవడం వల్ల ఈ విటమిన్ లోపం ఎక్కువమందిని వేధిస్తూ ఉంటుంది. ఇలాంటి వాళ్లలో మెడ నొప్పితో పాటు, వీపు నొప్పి కూడా ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించడం కోసం విటమిన్ డి3 సప్లిమెంట్లు తీసుకోవడంతో పాటు సూర్యరశ్మికి కూడా బహిర్గతమవుతూ ఉండాలి. అలాగే ఆకుకూరలు, పాల ఉత్పత్తులు సరిపడా తీసుకోవాలి.

డైటింగ్‌తో... కండర నష్టం

బరువు తగ్గడం కోసం పలురకాల డైట్స్‌ను అనుసరించడంలో భాగంగా తీసుకునే ఆహారంలో కోత విధిస్తే, కొవ్వుతో పాటు కండర నష్టం కూడా జరుగుతుంది. డైట్ చేశాం కాబట్టి బరువు తగ్గినట్టు భావిస్తూ ఉంటారు. కానీ సరిపడా పోషకాలు అందక, కండరాలు కూడా నష్టపోతున్నామనే విషయాన్ని చాలా మంది గ్రహించరు. కండరాలు దృఢంగా ఉండాలంటే సరిపడా పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు అవసరం. బరువు తగ్గే క్రమంలో కండరాలు వదులుగా మారి, సాగిపోతున్నట్టు తయారైతే, దాన్ని కండర నష్టంగానే పరిగణించాలి. సరిపడా పోషకాలు అందేలా ఆహార పరిమాణాన్ని తగ్గించుకోగలిగితే, బరువు తగ్గడంతో పాటు కండర నష్టం జరగకుండా నియంత్రించుకోవచ్చు. అలాగే డైట్ చేస్తున్న వాళ్లు కండరాలు దృఢంగా ఉండడం కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయాలి.

కండరాలు చిరిగితే?

ముఖ్యంగా జిమ్‌లో ప్రత్యేకించి భుజానికి సంబంధించిన వ్యాయామాలు చేసే వారిలో రొటేటర్ కఫ్ కండరం ఒత్తిడికి లోనవుతుంది. వ్యాయామం చేసే క్రమంలో తప్పుడు కోణంలో భుజాలను కదిలించినప్పుడు ఈ కండరం కందిపోవడం మొదలుపెడుతుంది. దాంతో విపరీతమైన నొప్పితో పాటు, భుజాన్ని పైకి లేపలేని పరిస్థితి తలెత్తుతుంది. కొన్నిసార్లు ఈ కండరం పాక్షికంగా లేదా పూర్తిగా చిరిగిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి. ఎక్స్‌రే, ఎమ్మారైలతో ఈ చిరుగును వైద్యులు సులువుగా గుర్తించగలుగుతారు. సమస్య పాక్షికంగా ఉంటే, విశ్రాంతితో సమస్య పరిష్కారమవుతుంది. ఒకవేళ చిరుగు ఎక్కువగా ఉంటే, కీహోల్ సర్జరీ చేయవలసి ఉంటుంది. ఈ సర్జరీతో సమస్య పూర్తిగా సర్దుకుంటుంది. వ్యాయామం మూలంగా కండరాలు చిరిగిపోకుండా ఉండాలంటే ఒకేసారి అధిక బరువులతో వ్యాయామం చేయకుండా బరువులను క్రమేపీ పెంచుకుంటూ పోవాలి. ఎక్కువ బరువులను బలవంతంగా వ్యాయామాలు చేయడానికి బదులుగా తక్కువ బరువులతో ఎక్కువ రిపిటీషన్స్ చేయాలి. ఇలాంటి వ్యాయామాలతో కండరాలు పెరుగుతాయి. దృఢంగా పెరుగుతాయి.

> కండరాలు శ్రమకు, ఒత్తిడికీ లోనైనప్పుడు అసౌకర్యం, నొప్పులు మొదలవుతాయి. ఆయా కండరాలకు 72 గంటల పాటు విశ్రాంతిని ఇచ్చినప్పుడు అవి పూర్తిగా కోలుకుంటాయి. కానీ చాలా మంది ఉపశమనం కోసం నూనెలతో మర్దనలు మొదలుపెట్టేస్తారు. ఇలా చేయడం వల్ల కండరం మరింత ఒత్తిడికి లోనవుతుంది. కాబట్టి విశ్రాంతి, చల్లనీటి కాపడం, అవయవాన్ని ఎత్తులో ఉంచడం లాంటివి చేయాలి. వీటితో అలసిన కండరాలు స్వాంతన పొందుతాయి. ఒకవేళ అప్పటికీ నొప్పి అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి.

కండరాల ఆరోగ్యం ఇలా...

కండరాలు ఆరోగ్యంగా ఉండాలంటే సరిపడా మాంసకృత్తులు తీసుకోవాలి. గుడ్డు తెల్లసొన, డ్రైఫ్రూట్స్, సలాడ్స్, మొలకలు క్రమం తప్పకుండా తింటూ ఉండాలి. శాకాహారులు ప్రొటీన్ కోసం సోయా ఉత్పత్తులను ఎంచుకోవచ్చు. అలాగే విటమిన్ డి3, క్యాల్షియం, శరీరానికి అవసరమైన ఖనిజలవణాలు కూడా సరిపడా అందేలా చూసుకుంటూ ఉండాలి. మరీ ముఖ్యంగా ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పరిమితంగా చేపలు తీసుకోవాలి. రెడ్ మీట్, మటన్ తగ్గించాలి. సోయా, పాల ఉత్పత్తులతో పాటు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నువ్వుల లడ్లు తింటూ ఉండాలి. వీటితో సరిపడా క్యాల్షియం దక్కుతుంది. అలాగే మధ్యాహ్న భోజనంలో సలాడ్ తప్పనిసరిగా తినాలి. ఉదయం లేదా సాయంత్రం సెనగలు, పెసలు, బొబ్బర్లు... వీటిలో ఏదో ఒక మొలకలు తినాలి. వారంలో కనీసం నాలుగు సార్లు, 30 నుంచి 35 నిమిషాల పాటు లేదా వారం మొత్తంలో 150 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

డాక్టర్ బాలరాజు నాయుడు,
రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
స్పోర్ట్స్ మెడిసిన్ అండ్ ట్రామా స్పెషలిస్ట్,
ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ హైదరాబాద్



విటమిన్ డి లేదా చేప నూనె? ఏదిమేలు?



విటమిన్ డి, చేప నూనె రెండూ ఆరోగ్యానికి మేలు చేసేవే, ఒకే విధమైన ప్రయోజనాన్ని అందించేవే! అయితే వీటిలో దేన్ని ఎంకుకోవాలి? తెలుసుకుందాం!

విటమిన్ డి మేలు : విటమిన్ డి ఎముల ఆరోగ్యానికీ, వ్యాధినిరోధకతకూ సహయాపడుతుంది. అలాగే మానసిక ఆరోగ్య మెరుగుదలలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. శరీర వాపులను తగ్గిస్తుంది. శరీరానికి అవసరమైన కాల్షియం అందించడంలో సహాయపడుతుంది. అమెరికాలో 35 శాతం మంది పెద్దలు(ముఖ్యంగా శీతాకాలంలో) విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. విటమిన్ డి లోపం వలన ఎముకలు బలహీనపడడంతో పాటు డిప్రెషన్ ఆవహిస్తుంది. సాధారణంగా విటమిన్ డి, సూర్యరశ్మి నుంచి అందుతుందని మనకు తెలుసు. పాలు, చీజ్, గుడ్డు సొన, చేప కొవ్వుల నుంచి కూడా విటమిన్ డి అందుతుంది. అయితే సూర్యరశ్మి సరిగ్గా అందని వారు, డి విటమిన్ లోపంతో బాధపడేవారు విటమిన్ డి సప్లిమెంట్స్ వాడుకోవలసిన అవసరం ఉంటుంది. అయితే ఈ విటమిన్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల అనర్థాలు కూడా ఉన్నాయి. అధిక మోతాదు విటమిన్ డి శరీరంపై విషంలా పనిచేస్తుంది. హైపర్ కాల్సీమియా(అధిక కాల్షియం), వికారం, మూత్రపిండాల సమస్యలకు దారి తీస్తుంది.

చేప నూనె మంచిదే! : ఇది గుండె, మెదడు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడుతుంది. చేపనూనె మెదడును చురుగ్గా ఉండడతో పాటు జ్ఞాపక శక్తిని మెరుగుపరుస్తుంది. చేపనూనెలో ఓమేగా 3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. అలాగే దీన్లో విటమిన్ ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగుపరుస్తుంది. చర్మ ఆరోగ్యానికి దోహదపడుతుంది. అమెరికా హార్ట్ అసోసియేషన్, వారినికి రెండు సార్లు చేపలు(వీలైతే కొవ్విన చేపలు) తినాలని సిఫార్సు చేస్తోంది. తరచూ చేపలను తినలేని వారు దానికి ప్రత్యమ్నాయంగా చేపనూనె సప్లిమెంట్లను తీసుకుంటారు. అయితే ఈ సప్లిమెంట్ల వలన జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి.

విటమిన్ డి క్యాప్సూల్, చేపనూనె సప్లిమెంట్లు... ఈ రెండూ ఆరోగ్యానికి లాభం చేకూర్చేవే! కానీ వీలైనంత వరకూ విటమిన్లు, పోషకాలు మన శరీరానికి సహజసిద్ధంగా అందేలా చూసుకోవాలి. ఆ తర్వాత మనకున్న సమస్యను బట్టి వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకు వీటిలో ఏది మన శరీరానికి అవసరమో దాన్ని సప్లిమెంట్ రూపంలో తీసుకోవాలి.

తెలుసుకుందాం

పిల్లలకు అదనపు పోషకాలు అవసరమా?



పిల్లలకు సరిపడా పోషకాలు అందాలంటే బహుళ విటమిన్ మాత్రలు వాడడం అవసరమని కొన్ని కంపెనీలు ప్రకటనలతో ఊదరకొడుతూ ఉంటాయి. అయితే ఆ మాత్రలు పిల్లలకు అవసరమా? దీని గురించి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

విటమిన్ ఎ, బి- కాంప్లెక్స్, సి, డి, ఇ, కె, ఐరన్, జింక్, అయోడిన్, క్యాల్షియం మాత్రలు, గమ్మీలు, ద్రావణాల రూపంలో అందుబాటులో ఉంటాయి. సాధారణంగా వీటిని పోషకాల లోపం ఉంటేనే వాడతారు. అయితే ఇటీవల చాలా బ్రాండ్లు తమ మల్టీవిటమిన్ సప్లిమెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయనీ, మెదడును చురుగ్గా ఉంచుతాయనీ, పిల్లలకు శక్తినిస్తాయనీ ప్రచారం చేసుకుంటున్నాయి. అయితే పిల్లలకు ఇలాంటి సప్లిమెంట్లకు బదులుగా, ఆహారం ద్వారానే సరిపడా పోషకాలు అందేలా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు.. వాటి ద్వారా శరీరం పోషకాలను బాగా గ్రహించుకోలదని సలహా ఇస్తున్నారు. అయితే సమతుల్య ఆహారం తినని పిల్లలు, శాకాహార పిల్లలు, దీర్ఘకాలిక రుగ్మతలు, అనారోగ్య సమస్యలు, జీర్ణకోశ వ్యాధుల బారిన పిల్లల్లో కొన్ని పోషకాల లోపం ఉండొచ్చు. అలాంటి వారికి వైద్యుల సలహా మేరకు అవసరమైన విటమిన్ సప్లిమెంట్లను అందించాలి. మల్టీవిటమిన్ సప్లిమెంట్లు శరీరానికి పోషకాలను అందిస్తాయి. అయితే వీటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లల్లో అధిక పోషకాలు మరింత హాని చేస్తాయి. కొవ్వులో కరిగే ఎ, డి, ఇ, కె విటమిన్లు శరీరంలో పేరుకుపోయి విషంగా మారతాయి. దీనివల్ల వికారం, తలనొప్పి, అలసటతో పాటు కొన్నిసార్లు అవయవాలు కూడా దెబ్బతింటాయి.

'జమిలి'తో దేశ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

కలిగిస్తున్నాయని, తరచూ ఎన్నికల నిర్వహణతో భారీ ఖర్చుతో పాటు సమయం కూడా వృథా అవుతుందని అన్నారు. ఒక ప్రభుత్వ ఐదేళ్ల పాలనా కాలంలో దాదాపు 800 రోజులు ఎన్నికల నిర్వహణకే కేటాయించాల్సి వస్తోందని గుర్తు చేశారు. జమిలి ఎన్నికల వల్ల దేశానికి లాభమే తప్ప.. ఎలాంటి నష్టం ఉండదన్నారు. భారత్‌లో జమిలి ఎన్నికల ఆచరణ సాధ్యమేనని వ్యాఖ్యానించారు. కానీ తమిళనాట ఈ వ్యవహారంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఇండియా కూటమి పక్షాలు ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. జమిలి ఎన్నికలు కావాలని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి గతంలో బలంగా కోరుకున్నారని, 'నెంజిక్కు నీది' పుస్తకంలో కూడా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారని పవన్ తెలిపారు. కానీ.. ఆయన సమర్థించిన ఈ వ్యవహారాన్ని ఆయన కుమారుడైన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలినే వ్యతిరేకించడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ఇప్పుడు ప్రధాని మోదీ కూడా జమిలి ఎన్నికలు అంటుంటే ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా స్టాలిన్ ఈ వ్యవహారంపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. గత 2019 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వైసీపీ.. 2024 ఎన్నికల్లో ఓడిపోయిందని గుర్తు చేస్తూ.. గెలిచినప్పుడు తమ గొప్పగా ప్రకటించుకున్న వైసీపీ.. ఓడిపోతే మాత్రం ఈవీఎంలు ట్యాంపర్ అయ్యాయంటూ అసత్య ప్రచారం చేసిందన్నారు. ఎన్నికల్లో గెలిచినపుడు ఈవీఎంలు సూపర్ అని, ఓడినపుడు ట్యాంపర్ అని గగ్గోలు పెట్టడం ఎంతమేరకు న్యాయమని ప్రశ్నించారు. తాను చాలాకాలం చెన్నైలోనే ఉన్నానని, తమిళనాడును వీడి మూడు దశాబ్దాలు దాటినా తనను ఈ గడ్డ వదలడం లేదని వ్యాఖ్యానించారు. "నాపై ఈ నేల ప్రభావం చాలా ఎక్కువ. తిరుక్కురళ్, మార్షల్ ఆర్ట్స్‌తో పాటు సినిమా ప్రభావం నాపై ఎక్కువగా ఉండటానికి చెన్నైలో నివశించడమే కారణం. తమిళనాడు నేర్పిన పాఠాలు జీవితాంతం నాకు స్ఫూర్తి కలిగిస్తాయి" అని పవన్ అన్నారు. జమిలి అప్రజాస్వామికమని, దానివల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం వాటిల్లుతుందన్న వాదన నిజం కాదన్నారు.

జనసేనను విస్తరించాలన్న ఆలోచన లేదు

పార్టీ అధినేతగా ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాల్సింది నటుడు విజయ్‌యేనని పవన్ అన్నారు. ఎవ్వరినీ అనుసరించకపోవడం ఆయనకు మంచిదన్నారు. నటుడిగా రాణించడం వేరు... నటుడు రాజకీయాల్లో రాణించడం వేరని వ్యాఖ్యానించారు. ఎన్డీయే కూటమిలోకి విజయ్‌ని రప్పించడంపై ఇప్పటివరకూ ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. ఎన్డీఏ కూటమికి మద్దతుగా ప్రచారం చేయడం తన బాధ్యత అని, గతంలో మహారాష్ట్ర, కర్నాటక ఎన్నికల్లోనూ ప్రచారం చేశానని గుర్తు చేశారు. అవసరమైతే తమిళనాడు ఎన్నికల్లో కూడా ఎన్డీఏ కూటమికి ప్రచారం చేస్తానన్నారు. ఈసారి ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీఏ కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. దేశానికి సేవ చేసుకునేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెబుతూ.. జనసేనను ఇతర రాష్ట్రాలకు విస్తరించాలన్న ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ఉత్పత్తికి హబ్‌గా ఏపీ: చంద్రబాబు

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ విషయంలో 2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్య సాధనకు దేశీయ ఉత్పత్తి సామర్థ్యాల అభివృద్ధిపై మన దేశం దృష్టి పెట్టిందని సీఎం చంద్రబాబు చెప్పారు. సోమవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. సోలార్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి సమగ్రమైన పాలసీని ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే ఇది ఫలితాలు ఇస్తోందన్నారు. దేశంలోనే సౌర విద్యుత్ ఉత్పత్తికి హబ్‌గా ఏపీ మారుతోందని పేర్కొన్నారు. మరింత మంది సోలార్ ఉత్పత్తిదారులను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా దేశం హరిత ఇంధనంవైపు మారుతున్న క్రమంలో కీలకంగా మారుతున్నామన్నారు. అదే సమయంలో మన వాళ్ల కోసం లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తున్నామని చెప్పారు.

మానవ బాంబులుగా స్లీపర్ సెల్స్!

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసనీయ సమాచారం. సిరాజ్ ఈ స్లీపర్ సెల్స్‌ను మానవ బాంబులుగా మార్చాలనుకున్నాడని, ఇందుకోసం దేశంలో సుమారు 12 మంది యువకులతో కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకున్నట్లు తేలింది. ఈ కోవలోనే 4వ రోజు సోమవారం విచారణ కొనసాగినట్లు సమాచారం.



స్లీపర్ సెల్స్‌గా 12 మంది?

12 మంది యువకులను స్లీపర్ సెల్స్‌గా ఏర్పాటు చేసి, వారిని మానవ బాంబులుగా పేల్చాలని సిరాజ్ పన్నాగం పన్నినట్లు తెలిసింది. దీనిపై సిరాజ్ నోరు విప్పాడని, దీంతో అధికారులు నిర్ఘాంతపోయారని సమాచారం. అహిం గ్రూపు సభ్యుల కోసం దేశంలోని పలు నగరాల్లో పోలీసులు గాలిస్తున్నారు. నేరస్థులను కలిసి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. సిరాజ్, సమీర్‌లకు ఆర్థిక, ఇతర సహకారం అందించిన వరంగల్‌కు చెందిన ఫర్హాన్ మొహిద్దీన్, యూపీకి చెందిన బాదర్, ఇమ్రాన్ అక్రమ్ కోసం కూడా వెతుకుతున్నారు. వీరి అడ్రస్‌లు తప్పుగా చూపిస్తున్నట్లు గుర్తించారు. అయితే వారు తమకు సిగ్నల్ యాప్‌లో పరిచయమని, చిరునామాలు తెలియదని సిరాజ్, సమీర్ బుకాయించినట్లు తెలిసింది.

- పేలుళ్ల సామగ్రి ఎక్కడిది? ఇందుకు మీకు ఆర్థిక సాయం ఎవరు చేశారు? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? అని దర్యాప్తు అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే సామగ్రి తయారీ ప్రదేశం ఎక్కడ? దాడులకు ఏఏ ప్రాంతాలను ఎంచుకున్నారు? విజయనగరానికి చెందిన నువ్వు.. బీహార్‌లో ఉన్న అబూతలేమ్ కలిసి ఏం పథక రచన చేశారు? అని కూడా సిరాజ్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. విజయనగరంలోని కేఎల్ పురం, కన్యాకాపరమేశ్వరి ఆలయం వద్ద ఏ షాపుల్లో పేలుడు సామగ్రి తీసుకున్నారు? అనే అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. అంతేకాకుండా వలాన చోట ఈ సామగ్రి దొరుకుతుందని సిరాజ్‌కు ఎవరు చెప్పారని కూడా ప్రశ్నించినట్లు సమాచారం.
- సిరాజ్ పేలుళ్లకు విజయనగరాన్నే ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మొదటి పేలుడు హైదరాబాద్‌లో చేపట్టాలని సౌదీ హ్యాండ్లర్స్ చెప్పినట్లు సమాచారం. అయితే విజయనగరంలోనే పేల్చితే అహిం సంస్థకు పేరు వస్తుందని, హైదరాబాద్‌లో అయితే నిఘా సంస్థలతో ఇబ్బంది అని వారికి సిరాజ్ చెప్పినట్లు సమాచారం.
- సిరాజ్ పాస్‌పోర్టు పొందే సమయంలో వెరిఫికేషన్‌కు సంబంధించి తండ్రి ఆజీజ్ రెహ్మాన్ ఏఎస్ఐ కావడంతో పెద్దగా విచారణ జరగలేదని తేలినట్లు సమాచారం. సిరాజ్, అతని కుటుంబసభ్యుల ఆస్తులు, బ్యాంక్ వివరాలు, ఆర్థిక లావాదేవీల గురించి కూపీ లాగుతున్నారని తెలిసింది.

'మ్యాజిక్ లాంతర్' మర్మమేంటి?

సిగ్నల్ యాప్ ద్వారా తరుచూ 'మ్యాజిక్ లాంతర్' అంటూ చాటింగ్ చేసుకోవటం, మాట్లాడటం జరిగేదని దర్యాప్తులో తేలినట్లు తెలిసింది. అసలు మ్యాజిక్ లాంతర్ అనేది కోడ్‌నా? లేదా ఓ ప్రాంతమా? లేదా అది కూడా ఓ వెబ్‌సైటా? అనేదానిపై సిరాజ్‌ను అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై సిరాజ్ నోరు మెదపక పోవటంతో గట్టిగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

సిరాజ్‌తో సీన్ రీ కన్‌స్ట్రక్షన్?

ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, కౌంటర్ ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసు అధికారులు సిరాజ్‌ను తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయనున్నట్లు సమాచారం. దీని ద్వారా విజయనగరంలో సిరాజ్ ఏఏ ప్రాంతాల్లో తిరిగాడు? ఏఏ కార్యకలాపాలు రూపొందించాడు? అన్న అంశాలపై మరిన్ని వివరాలను తెలుసుకోనున్నట్లు తెలిసింది. అలాగే విజయనగరంలో పేలుడుకు విజ్జీ స్టేడియంనే ఎందుకు ఎంచుకున్నారు? పేలుడు జరిపిన తర్వాత తప్పించుకునేందుకు అనుకూలమని భావించాడా? అనే కోణంలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించనున్నట్లు సమాచారం.

అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్‌లో శంకుస్థాపన

- డిప్యూటీ సీఎం పవన్, ఎంపీ పురందేశ్వరి హాజరు
- పోలవరం ప్రాజెక్టు వద్ద రెండు స్టార్ హోటళ్లు
- గండికోట, సూర్యలంక ప్రాజెక్టు పనుల్లో కదలిక
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

రాజమహేంద్రవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చేపడుతున్న అఖండ గోదావరి ప్రాజెక్టు పనులకు జూన్ మొదటి వారంలో శంకుస్థాపన చేస్తామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు మానసపుత్రిక అఖండగోదావరి ప్రాజెక్టుకు కేంద్రం ఇప్పటికే సుమారు రూ.100 కోట్లు ఇచ్చిందని.. పుష్కర ఘాట్ అభివృద్ధికి రూ.37 కోట్లతో టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా హేవలాక్ బ్రిడ్జి, కొవ్వూరు గోష్పాద క్షేత్రం, కడియం నర్సరీలలో



పర్యాటక అభివృద్ధి, నిడదవోలు, కడియపులంకలో బోటు షికారు, కోట సత్తెమ గుడి వద్ద భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు డిజైన్లు సిద్ధమవుతున్నాయని చెప్పారు. పుష్కరాల నాటికి రాష్ట్రంలో 50 వేల గదులు ఉండాలనే సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే 7 వేల నుంచి 8 వేల గదులు సిద్ధం చేశామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి రెండు స్టార్ హోటళ్లు నిర్మిస్తామన్నారు. కడప జిల్లాలోని గండికోట ప్రాజెక్టుకు టెండర్లు ఖరారయ్యాని, గుంటూరు జిల్లాలోని సూర్యలంక బీచ్ పనుల్లోనూ కదలిక వచ్చిందని చెప్పారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మండువా లోగిళ్లను లీజుకు తీసుకుని, పర్యాటకులు అక్కడ స్టే చేసి, ఆయా ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కుంభమేళా స్ఫూర్తితో రాష్ట్రంలో 21 ప్రధాన పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల సౌకర్యార్థం టెంట్ సిటీలు, హోంస్టేలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో రాజమండ్రి సిటీ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా

- 28న బాధ్యతలు.. రెండేళ్లపాటు సేవలు



అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఏపీ ఇన్‌చార్జి డీజీపీగా ఉన్న హరీశ్ కుమార్ గుప్తా పూర్తిస్థాయి డీజీపీగా నియమితులయ్యారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సిఫారసు మేరకు ఆయనను డీజీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2014 జూలైలో జేవీ రాముడు నియామకం తర్వాత ఏపీలో యూపీఎస్సీ ద్వారా నియమితులైన పూర్తిస్థాయి డీజీపీ.. హరీశ్ కుమార్ గుప్తా కావడం విశేషం. జమ్ముకశ్మీర్‌కు చెందిన హరీశ్ కుమార్ గుప్తా.. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఈ నెల 28న మూడోసారి డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్న హరీశ్ గుప్తా 2027.. మే 27 వరకూ డీజీపీగా కొనసాగుతారు. కాగా, నిష్పక్షపాతంగా పని చేస్తారనే పేరున్న హరీశ్ గుప్తాను గతేడాది మే 6న ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ డీజీపీగా నియమించింది. రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం స్థానిక బీసీలకు ప్రాధాన్యమిచ్చే క్రమంలో హరీశ్ గుప్తాను తప్పించి ద్వారకా తిరుమలరావుకు గతేడాది జూన్ 19న అవకాశం కల్పించింది. ఈ ఏడాది జనవరిలో ఆయన పదవీ విరమణ తర్వాత కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 1న గుప్తాకు మరోమారు డీజీపీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. రెండోసారి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన గుప్తా మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యమిస్తూ 'శక్తి' పోలీసింగ్‌ను అమలు చేశారు. పోలీసింగ్‌లోకి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ప్రవేశపెట్టి రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేశారు. నేరాల కట్టడితోపాటు రాష్ట్రంలో పోలీసింగ్ తీరుతెన్నుల్నే మార్చేశారు. ఆయన పనితీరును గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల కలెక్టర్ల సమీక్షా సమావేశంలో ఏపీ పోలీసు పనితీరు అద్భుతమంటూ ప్రశంసించారు. అదే తనకన్నా సీనియర్లను కాదని పోలీసు బాస్‌గా గుప్తాను ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది.

ఖాళీ అయిన మున్సిపల్ పదవుల భర్తీకి నోటిఫికేషన్లు

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్, మాచర్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, నిడదవోలు వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ ఎన్నికల కోసం జూన్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, ఆ మేరకు ఆయా మున్సిపాలిటీ, నగర పంచాయతీలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈ నెల 29లోపు జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది.



గడ్డి మొక్క కాదు... ఇదీ పురుగే!

ఆకుపచ్చ రంగులో గడ్డి మొక్కలా కనిపిస్తున్న ఇది అరుదైన జాతి పురుగు. సోమవారం చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానంలో కెమెరాకు చిక్కింది. గొంగళి పురుగు జాతికి చెందిన ఈ పురుగును ఫోకోడెర్మా వెలుటినా అంటారని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కీటక విభాగం టీచింగ్ అసోసియేట్ కె.బాబూజీనాయుడు చెప్పారు. ఈ పురుగు శరీరాన్ని తాకితే దురద వస్తుందని తెలిపారు.

- చింతపల్లి, ఆంధ్రజ్యోతి

టెండర్ నియమావళినే అనుసరించాం

- పౌర సరఫరాల శాఖ మేనేజర్

భీమవరం, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలలకు, హాస్టళ్లకు నాణ్యమైన బియ్యం సరఫరాలో టెండర్ నియామవళిని అనుసరించే ఏడు ఏజెన్సీలను ఖరారు చేశామని పశ్చిమగోదావరి జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ టి.శివరామప్రసాద్ తెలిపారు. 'టెండర్లు లేకుండానే బియ్యం రవాణా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సోమవారం ఆయన వివరణ ఇచ్చారు. ప్యాకింగ్‌తోపాటు, రవాణాకు టెండర్ నియమావళిని అనుసరించి ఏజెన్సీలను ఖరారు చేశామన్నారు. ప్యాకింగ్ అనుభవం ఉన్న వారికే ఈ బాధ్యతలను అప్పగించామన్నారు.

పేరుకే ప్రైవేటు డాబు!

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన ప్రమాణాలున్న పాఠశాలలు చాలా తక్కువే. చాలా ప్రైవేటు పాఠశాలల్లో అరకొర ప్రమాణాలే ఉన్నాయి. విద్యా హక్కు చట్టం కింద అడ్మిషన్లకు ఫీజులు నిర్ణయించేందుకు ప్రైవేటు పాఠశాలల వసతుల ప్రమాణాల(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)పై పాఠశాల విద్యా శాఖ వివరాలు సేకరించగా.. అసలు డొల్లతనం బయటపడింది. 18 అంశాలపై వివరాలు సేకరించగా వాటిని నూరు శాతం అమలు చేస్తున్న పాఠశాల రాష్ట్రంలో ఒక్కటి కూడా లేదు. మొత్తం ప్రమాణాలు పాటిస్తే ఆ పాఠశాలలకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. రాష్ట్రంలో 9,953 ప్రైవేటు పాఠశాలలుంటే వాటిలో ఒక్కటి కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేదు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెప్పే మాటలకు, వాస్తవంగా ఉన్న వసతులకు పొంతన లేదని తేలిపోయింది. అత్యంత నాసిరకం, అంతంత మాత్రం, మధ్యస్థం, కొంత మెరుగైన ప్రమాణాలను బట్టి వరుసగా వన్, టూ, త్రీ, ఫోర్ స్టార్ రేటింగ్‌లు కేటాయించారు. వీటి ఆధారంగా ఫీజులు నిర్ణయించనున్నారు. ఫోర్ స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలు కొన్ని జిల్లాల్లో చాలా తక్కువగా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు, కోనసీమలో ఏడు, మన్యంలో ఐదు, అభివృద్ధి చెందిన జిల్లాగా చెప్పుకొనే ఎన్టీఆర్‌లో రెండు పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ రేటింగ్ సాధించాయి. కాగా అత్యంత తక్కువ ప్రమాణాలున్న వన్ స్టార్ రేటింగ్‌తో కర్నూలు జిల్లాలో అత్యధికంగా 22, శ్రీకాకుళంలో 10 బడులు ఉన్నాయి.

స్టార్ రేటింగ్‌కు ప్రామాణికాలు

స్టార్ రేటింగ్ ఇచ్చేందుకు 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. అవి... సరిపడా తరగతి గదులు, పాఠశాల భవనానికి ప్రహరీ, అన్ని తరగతి గదులు-కామన్ ఏరియాలో విద్యుత్ సదుపాయం, నీటి సదుపాయంతో మరుగుదొడ్లు, విద్యార్థులందరికీ పరిశుభ్రమైన తాగునీరు, సరిపడా స్థాయి పుస్తకాలతో లైబ్రరీ, క్రీడా ప్రాంగణం, డస్ట్ బిన్‌లు, విద్యార్థుల వయసుకు తగ్గట్టుగా తరగతి గదుల్లో ఫర్నీచర్, సైన్స్ లేబొరేటరీలు, హైస్పీడ్ ఇంటర్నెట్, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు లేదా స్మార్ట్ టీవీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఈ-లైబ్రరీ, ఒకేషనల్ లైబ్రరీ, కిచెన్ గార్డెన్, దివ్యాంగులకు ర్యాంపులు-మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం మార్గదర్శకాలతో కిచెన్ షెడ్. వీటిలో మధ్యాహ్న భోజనం షెడ్ మినహా మిగిలినవి ప్రైవేటు పాఠశాలల్లో ఉండాలి. ఈ-లైబ్రరీ, సైన్స్ లేబొరేటరీలు, స్మార్ట్ టీవీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, దివ్యాంగులకు ర్యాంపులు చాలా పాఠశాలల్లో లేవు.

ఫీజులు ఇలా..

స్టార్ రేటింగ్ ఆధారంగా విద్యా హక్కు చట్టం ఫీజులు ఖరారు చేయాలని నిర్ణయించారు. 1 నుంచి 8 తరగతుల వరకు మూడు రకాలుగా ఫీజులు ప్రతిపాదించారు. ప్రైవేటు స్కూళ్లకు ఒక స్టార్ రేటింగ్ ఉంటే రూ.6 వేల నుంచి రూ.8 వేలు, రెండు స్టార్లు ఉంటే రూ.7,500 నుంచి రూ.9 వేలు, మూడు స్టార్లు ఉంటే రూ.8,600 నుంచి రూ.10 వేలు, నాలుగు స్టార్లు ఉంటే రూ.10 వేల నుంచి రూ.12 వేలు, ఐదు స్టార్లు ఉంటే రూ.12,500 నుంచి రూ.15 వేలుగా ఫీజులు నిర్ణయించారు. అయితే ఈ ఫీజులు కేవలం విద్యాహక్కు చట్టం కింద కేటాయించే 25 శాతం సీట్లకు మాత్రమే వర్తిస్తాయి. మిగిలిన సీట్లకు పాఠశాల యాజమాన్యాలే ఫీజులు నిర్ణయిస్తారు. అయితే మొత్తం ఫీజులను పాఠశాల విద్యా శాఖే నిర్ణయించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పెద్దగా సౌకర్యాలు లేని పాఠశాలలు కూడా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఆ ఫీజులను కూడా ప్రభుత్వమే నిర్ణయిస్తే అందరికీ మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పాఠశాలల వ్యూహం

'మీ పిల్లల్ని చేర్పించి వారిని అంతర్జాతీయ స్థాయి విద్యార్థులుగా మార్చండి' అంటూ అడ్మిషన్ల సమయంలో ప్రైవేటు పాఠశాలలు గొప్పలు చెబుతుంటాయి. పాఠశాలలో వసతులన్నీ అద్భుతమంటూ కరపత్రాల్లో ఫొటోలు వేసి కలరింగ్ ఇస్తుంటాయి. ఏదో ఒకవిధంగా తల్లిదండ్రులను పాఠశాల గేటు వరకూ రప్పిస్తే వారిలో కొందరైనా పిల్లల్ని చేర్చకపోతారా అనేది వారి వ్యూహం. అక్కడి వరకూ వెళ్లాకా తల్లిదండ్రులకూ చెప్పుకోదగ్గ ప్రత్యామ్నాయం ఉండదు. అడ్మిషన్ల సమయంలో పాఠశాలల ప్రతినిధులు చెప్పేవన్నీ మాయమాటలని తెలిసినా వేరేదారి లేక ఏదో ఒక ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తుంటారు.

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

- 105 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆహారశుద్ధి పరిశ్రమలకు రూ. 75 కోట్లు, ఆక్వా ఉత్పత్తుల (చేపలు, రొయ్యలు) ప్రాసెసింగ్ యూనిట్లకు రూ. 30 కోట్లు కలిపి మొత్తం రూ. 105 కోట్ల ప్రోత్సాహకాల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతినిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో మొదటి త్రైమాసికానికి సంబంధించి రూ. 26.33 కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. అయితే క్వార్టర్లీగా కాకుండా ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన మొత్తం బడ్జెట్ రూ. 105.33 కోట్లు విడుదల చేయాలని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఆ మేరకు నిధుల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

అమరావతిలో ఎన్ఐఆర్‌డీ అండ్ పీఆర్

- ఏర్పాటుకు పరిశ్రమల సమాఖ్య వినతి

అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీ అండ్ పీఆర్)ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రామీణ, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలకు మద్దతుగా నరేగా (ఎంఎన్ఆర్ఈజీఏ) తరహాలో గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు. నిరుద్యోగ యువతకు పరిశ్రమల సంబంధిత నైపుణ్యాలను పెంపొందించేందుకు గ్రామీణ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పంట ప్రాసెసింగ్, ఎగుమతులకు మద్దతుగా మామిడి, అరటి, పామాయిల్ కోసం కమోడిటీ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పెద్ద పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఎంపిక చేసిన ప్రదేశాల్లో రక్షణ, ఏరోస్పేస్ తయారీ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. నెట్‌వర్క్ నాణ్యతను పెంచడానికి సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించడం ద్వారా ఏపీలోని వెనుకబడిన ప్రాంతాల్లో టెలికం కవరేజీని మెరుగుపరచాలని సూచించారు.

పోలీసుల ఆధ్వర్యంలో నంబాల అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాకు షేర్ చేశారు. నారాయణపూర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్ సమీపంలోని చెట్లు, పొదల మధ్య.. అందుబాటులో ఉన్న ఎండుకర్రలను పేర్చి, వాటి మధ్యలో మృతదేహాలను వేసి.. కిరోసిన్‌తో నిప్పుపెట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధుమిత్రులకు అప్పగిస్తామంటూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు ఆ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ శనివారం స్పష్టమైన హామీ ఇచ్చినా.. అయినవారు లేరని చెబుతూ నారాయణపూర్ పోలీసులు ఏకపక్షంగా అంత్యక్రియలు నిర్వహించారు. హనుమకొండ జిల్లా చింతగుట్టకు చెందిన బూర రాకేశ్ అలియాస్ వివేక్(32) మృతదేహం కోసం అతని తండ్రి బూర బాబు, కుటుంబ సభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. అయితే.. మృతదేహాలను ఇచ్చేది లేదంటూ నారాయణపూర్ పోలీసులు తేల్చిచెప్పారని వారు వాపోయారు. దాంతో మృతుల బంధుమిత్రులు నారాయణపూర్ ప్రభుత్వాస్పత్రి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే.. పోలీసులు మాత్రం ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది నక్సల్స్ చనిపోయినట్లు చెప్పారు. 20 మంది నక్సల్స్ మృతదేహాలను బంధుమిత్రులకు అప్పగించామని.. ఒక మృతదేహాన్ని నారాయణపూర్‌లో దహనం చేయడానికి అనుమతించామని చెప్పారు. మిగతా 6 మృతదేహాల విషయంలో బంధుమిత్రులు, అయినవారు లేకపోవడంతో చట్టపరంగా వాటిని తామే దహనం చేశామని పేర్కొన్నారు. "కోసి అలియాస్ హంగి అనే మావోయిస్టు బంధుమిత్రులకు మృతదేహాన్ని అప్పగించాం. అయితే.. కుళ్లిపోతున్న ఆ మృతదేహం వల్ల అంటువ్యాధుల ముప్పు ఉందని బంధుమిత్రులు మాకు చెప్పారు. ఈ కారణంతో.. నారాయణపూర్‌లోనే అంత్యక్రియలకు అవకాశం కల్పించాలని కోరారు. మేము అందుకు అనుమతించాం. మిగతా ఆరు మృతదేహాలను చట్టపరంగా.. నారాయణపూర్ మేజిస్ట్రేట్ ఆదేశాలతో దహనం చేశాం" అని నారాయణపూర్ ఎస్పీ కార్యాలయం సోమవారం సాయంత్రం ఓ ప్రకటనను విడుదల చేసింది. అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలను మీడియాకు షేర్ చేసింది. అందులో ఎండు కర్రలను కుప్పలుగా పోసి.. అందులో మృతదేహాలను వేసి.. కిరోసిన్‌తో మంట పెట్టినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఉద్యమం కోసం జీవితాలను త్యాగం చేసిన మావోయిస్టులకు ఇది తీవ్ర అవమానమని



ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఉద్దేశపూర్వకంగా మృతదేహాలను.. ముఖ్యంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని దహనం చేశారని వాపోయాయి.

అప్పట్లో ఎత్తుకెళ్లిన ఆయుధాలు

2010లో గవాడి(నారాయణపూర్ జిల్లా), అదే సంవత్సరం ఏప్రిల్‌లో తాడ్మెట్ల, 2017 బుర్కపాల్(సుక్మా జిల్లా)లో జరిగిన దాడుల్లో మావోయిస్టులు అపహరించిన ఆయుధాల్లో కొన్ని తాజా ఎన్‌కౌంటర్‌లో లభ్యమైనట్లు నారాయణపూర్ పోలీసులు తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌లో మూడు ఏకే-47, నాలుగు ఎస్ఎల్ఆర్, ఆరు ఇన్సాస్, ఒక కార్బైన్, ఆరు .303 తుపాకులను, ఒక బీజీఎల్ లాంచర్, రెండు రాకెట్ లాంచర్లు, మూడు 12-బోర్ తుపాకులు, ఒక నాటు పిస్టల్, రెండు భర్మార్లు, పెద్దమొత్తంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

సజీవంగా పట్టుకుని, చంపారు

- దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ ప్రకటన




అమరావతి/చర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును పోలీసు బలగాలు పట్టుకుని, కాల్చి చంపాయని మావోయిస్టు దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ ఆరోపించింది. విప్లవ ద్రోహుల కారణంగా అబూజ్‌మడ్‌లో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిందని పేర్కొంటూ.. కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేరిట మీడియాకు ఓ లేఖను విడుదల చేసింది. "భద్రతాబలగాలు నంబాల కేశవరావును సజీవంగా పట్టుకుని, కాల్చి చంపాయి. ఈనెల 19 నుంచి 21 వరకు భీకరపోరు జరిగింది. మావైపు 35 మంది ఉంటే.. భద్రతాబలగాల వైపు 25 వేల మంది ఉన్నారు. వేల మంది మాపై ఊచకోతకు పాల్పడ్డారు. 60 గంటల పాటు చుట్టుముట్టి, నిర్బంధించారు. 10 గంటల వ్యవధిలో ఐదు ఎన్‌కౌంటర్లు జరిగాయి. నంబాలను కాపాడుకునేందుకు 27 మంది నాయకులు ప్రాణాలను త్యాగం చేశారు. నంబాలను సజీవంగా పట్టుకున్నారు. ఆ తర్వాత కాల్చి చంపారు. ఆయనను మేము కాపాడుకోలేకపోయాం. ఈ ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మరణించారు. ఒక మృతదేహాన్ని మేము వెంట తీసుకెళ్లాం. మరో ఏడుగురు నేతలు సురక్షితంగా బయటపడ్డారు" అని ఆ లేఖలో వికల్ప్ తెలిపారు. "నంబాల రక్షణ దళంలో ఉన్న ఆరుగురు కీలక వ్యక్తులు పోలీసులకు సహకరించారు. అందుకే.. నంబాల ఉన్న ప్రాంతానికి డీఆర్జీ, ఇతర బలగాలు సులభంగా చేరుకున్నాయి. భారత చరిత్రలోనే మే 21 చీకటి రోజు. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా.. అమరవీరులను స్మరించుకుంటూ.. 'షాహిద్ సంస్మరణ సభ'లను నిర్వహించాలి" అని ఆయన పిలుపునిచ్చారు. నంబాల అబూజ్‌మడ్‌లోనే ఉన్నట్లు బలగాలు, నిఘావర్గాలకు ఆర్నెల్ల ముందే తెలుసన్నారు. "మొదట్లో నంబాలకు 60 మందితో పటిష్ఠ భద్రత ఉండేది. ఆపరేషన్ కగార్ తర్వాత క్లిష్ట పరిస్థితులు ఎదురవ్వడంతో.. భద్రతను 35కు కుదించాం. వ్యూహాత్మకంగా పలువురు పోలీసుల ఎదుట లొంగిపోయేలా చేశాం. అయితే.. అలా లొంగిపోయిన వారిలో ఆరుగురు ద్రోహులు పోలీసులకు నంబాల సమాచారం ఇచ్చారు. నిజానికి 17వ తేదీనే బలగాలు చుట్టుముట్టాయి. అదే రోజు పీపీసీ కమిటీ సభ్యుడొకరు తన జీవిత సహచరితో కలిసి పారిపోయాడు. దాంతో.. ఏదో కుట్ర జరిగిందని మాకు అర్థమైంది. వెంటనే శిబిరాన్ని మార్చాం. అయినా.. 19వ తేదీన బలగాలు మాదాకా రాగలిగాయి. నంబాలను షెల్టర్ జోన్‌కు వెళ్లాలని కోరాం. ఆయన నిరాకరించారు. యువ నాయకత్వాన్ని కాపాడుకోవాలంటూ ఆయన ముందు నిలిచారు. ఆయనను కాపాడుకోవడంలో మేం విఫలమయ్యాం" అని వికల్ప్ వివరించారు.



తెలుగుదేశం ప్రతినిధుల సమావేశానికి సిద్ధమైన వేదిక, మహానాడుకు ముస్తాబైన కడప నగరం





నేటి నుంచే పసుపు పండుగ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ కుప్పం నుంచి రోడ్డు మార్గాన వచ్చారు. నాలుగు రోజులుగా మంత్రుల బృందం కడపలోనే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఏడాది పాలనలో కూటమి సాధించిన విజయాలను చర్చించడంతోపాటు ప్రజాపాలనపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను మహానాడు వేదికగా చర్చించనున్నారు. కడపలో తొలిసారి నిర్వహిస్తున్న ఈ వేడుక ద్వారా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. లోకేశ్ యువగళం పాదయాత్ర సమయంలో ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్‌ను సవివరంగా చర్చించనున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదు కార్యక్రమంతో మహానాడు ప్రారంభమవుతుంది. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతో ఇది మొదలవుతుంది. ఉదయం 10.30కు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. 10.30-10.45 వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తారు. 10.45 నుంచి 11 గంటల వరకు పార్టీ అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు ఇతర ముఖ్య నాయకులను వేదికపైకి ఆహ్వానించి పార్టీ జెండా ఆవిష్కరిస్తారు. జ్యోతిప్రజ్వలన, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి, తెలుగు తల్లి గీతాలాపన జరుగుతాయి. 11.10 నుంచి 11.20 వరకు మరణించిన కార్యకర్తలకు సంతాపం.. 11.20 నుంచి 11.30 వరకు జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదిక, 11.30 నుంచి 11.45 వరకు రాష్ట్ర అధ్యక్షుడి ప్రసంగం ఉంటాయి. 23 వేల మంది పార్టీ ప్రతినిధుల సభలో సంస్థాగత నిర్మాణం, విధివిధానాలు, సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కేడర్‌కు నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. రెండో రోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చిస్తారు. మాజీ మంత్రి యనమల కన్వీనర్‌గా ఉన్న మహానాడు తీర్మానాల కమిటీ కసరత్తు పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 14 తీర్మానాలు ప్రతిపాదిస్తారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి సంబంధించి ఐదు తీర్మానాలపైన, ఉమ్మడిగా నాలుగు తీర్మానాలపైన చర్చించి ఆమోదిస్తారు. అవసరాన్ని బట్టి తీర్మానాల సంఖ్య పెరిగే అవకాశముందని టీడీపీ వర్గాలు తెలిపాయి. చివరి రోజు గురువారం 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.



సోమవారం రాత్రి 8.50కు మహానాడు వేదిక వద్దకు చేరుకున్న లోకేశ్



సోమవారం రాత్రి 8గంటలకు మహానాడు వేదిక వద్దకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు ఏర్పాట్లను వివరిస్తున్న మంత్రి నిమ్మల, చిత్రంలో మంత్రి సవిత, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

గతానికి భిన్నంగా కడపలో..

కడపలో నిర్వహించే మహానాడును టీడీపీ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మాజీ సీఎం జగన్ జిల్లా కావడం, సీమలో గతంలో ఎన్నడూ లేని విధంగా 45 అసెంబ్లీ స్థానాలను కూటమి గెలుచుకోవడం, అన్నిటినీ మించి ఉమ్మడి కడప జిల్లాలో ఏడు స్థానాల్లో టీడీపీ కూటమి విజయంతో.. గతానికి భిన్నంగా ఈసారి కడపలో మహానాడు జరపాలని నిర్ణయించారు. ఏర్పాట్లకు వర్షం అడ్డంకిగా మారినా 19 కమిటీలు వేసుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన చకచకా చేసేశారు. గత మహానాడుల కన్నా మించి ఇక్కడ ఏర్పాట్లు చేయడం గమనార్హం. అతిథులకు సీమ వంటకాలతో విందు ఇస్తారు. 450 మంది కూర్చునే విధంగా వేదికను రూపొందించారు. పక్కనే సీఎంవో క్యాంపు ఆఫీసు, రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్, డైనింగ్, మీడియా పాయింట్, సమీపంలోనే 300 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం వర్షంతో ఏర్పాట్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి.

మంత్రుల బృందం బిజీబిజీ

మహానాడు ఏర్పాట్లపై మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. బహిరంగ సభకు జన సమీకరణపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నారాయణ, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అమరనాథ్‌రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితర నేతలు కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మహానాడులో క్లీనింగ్, బ్యూటిఫికేషన్ కార్యక్రమాలను మంత్రి వాసంశెట్టి సుభాశ్ పరిశీలించారు. స్వచ్ఛ మహానాడు కార్యక్రమానికి డ్రెస్‌కోడ్ జాకెట్లు ధరించాలన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, నిమ్మల, స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభిరాం, బీసీ కార్పొరేషన్ చైర్మన్ సత్యబాబు, పద్మరాజు ఈ కమిటీలో ఉన్నారు. భోజన వసతులపై మంత్రులు అనిత, అనగాని, సవిత, సంధ్యారాణి సమీక్ష నిర్వహించారు. కాగా మహానాడు బందోబస్తులో 5 వేల మంది పాల్గొంటున్నారు.

చంద్రబాబు, లోకేశ్‌లకు స్వాగతం

చంద్రబాబు రాత్రి 7.35 గంటలకు కడప ఎయిర్‌పోర్టులో దిగారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కలెక్టర్, ఎస్పీ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన 8 గంటలకు మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. వేదిక వద్ద మంత్రులు అనగాని, సవిత, నిమ్మల, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, పులివర్తి నాని తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. మహానాడు ఏర్పాట్లపై చంద్రబాబు సమీక్షించారు. జిల్లా పేరును వైఎస్ఆర్ కడపగా మార్చడంతో టీడీపీ నేతలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. లోకేశ్ కుప్పం నుంచి రోడ్డు మార్గాన రాత్రి 8.50 గంటలకు మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. టీడీపీ నేతలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

టీడీపీ శ్రేణులతో ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న హోటళ్లు, ప్రైవేటు ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు విద్యా సంస్థలన్నీ కిటకిటలాడుతున్నాయి. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వారితో కడప విమానాశ్రయం కూడా విమానాలతో బిజీ కానుంది. ఇక పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు సోమవారం కడపకు వచ్చి మహానాడు వేదిక వద్ద లోకేశ్‌ను కలిశారు.



ప్రతి మహానాడులో పాల్గొన్నా



ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చా. ఇప్పటి వరకు నిర్వహించిన ప్రతి మహానాడుకూ హాజరయ్యాను. తెలుగుగంగ, గాలేరు-నగరి, గండికోట సాగునీటి ప్రాజెక్టులన్నీ ఎన్టీఆర్ హయాంలో మొదలయ్యాయి. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టులను కొనసాగించడంతో పాటు దూరదృష్టితో ఐటీ కంపెనీలు తీసుకొచ్చారు. ఇప్పుడు టీడీపీలోకి రాబోయే కాలానికి కొత్త తరం నేతలు రావాలి. యువకుడు లోకేశ్ ఆధ్వర్యంలో యువతరం రాజకీయాల్లోకి అడుగు పెట్టాలి. - మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ఏపీ తీర్మానాలివీ..

1. ఎన్డీయే ప్రభుత్వం తొలి ఏడాది ఘనవిజయాలు.
2. శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం(నదుల అనుసంధానం, బనకచర్లకు గోదావరి జలాలు)
3. ఒకే రాజధాని అమరావతి, అభివృద్ధి వికేంద్రీకరణ. (ప్రజారాజధాని నిర్మాణం. పట్టణ, గ్రామీణాభివృద్ధి, పెట్టుబడులతో వికేంద్రీకరణ. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు. జగన్ పాలనలో దోపిడీకి గురైన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధిపై దృష్టి)
4. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు.
5. మహిళ, యువత సంక్షేమానికి పెద్దపీట.
6. సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం.
7. కట్టుదిట్టంగా శాంతిభద్రతలు.
8. చంద్రన్న విజన్‌తో సంక్షేమ రాజ్యం. అన్ని వర్గాలకు ప్రాధాన్యం.
9. మౌలిక సదుపాయాల అభివృద్ధి, కేంద్రం తోడ్పాటు.
10. పేదరికం లేని సమాజ నిర్మాణ సంకల్పంతో 'పీ-4'.
11. సాకారమైన విజన్ 2020.. విజన్-2047 సాధనకు అడుగులు.
12. విద్యుత్ రంగంలో విప్లవాత్మక విజయాలు.
13. విపక్ష నేతగా విఫలమైన జగన్.
14. సహజ వనరుల పరిరక్షణ, అక్రమార్కులపై చర్యలు.

ఉమ్మడి తీర్మానాలు

1. తెలుగువారి చరిత్రలో ఎన్టీఆర్ ప్రత్యేకత.
2. తెలుగువారి చరిత్రలో చంద్రన్న మైలురాళ్లు/ముద్ర.
3. అమరులైన టీడీపీ కార్యకర్తలు, నాయకులకు ఘన నివాళి.
4. కార్యకర్తల సంక్షేమం.



శాంతిపురంలో టీడీపీ కార్యకర్త చెంగాచారి దుకాణం వద్ద పార్టీ నాయకులతో కలిసి టీ తాగుతున్న మంత్రి లోకేశ్

టీ అదిరింది అన్నా..!

- ఓ చాయ్‌వాలాకు లోకేశ్ ప్రశంస
- కుప్పం నుంచి కడప వెళ్తూ మార్గం మధ్యలో రోడ్డుపై ఓ బంకు వద్ద ఆగిన మంత్రి

కుప్పం/శాంతిపురం, మే 26(ఆంధ్రజ్యోతి): 'టీ చాలా బాగుంది..' ఓ చాయ్‌వాలాకు మంత్రి లోకేశ్ ఇచ్చిన ప్రశంస ఇది. సీఎం చంద్రబాబు దంపతులతో కలిసి నూతన గృహప్రవేశానికి హాజరైన ఆయన సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మహానాడు జరగనున్న కడప జిల్లాకు వెళ్తూ మార్గమధ్యలో కుప్పం మండల సచివాలయ సమీపంలోని చెంగాచారి టీ బంకు వద్ద ఆగారు. వాహనం దిగి నేరుగా బంకు దగ్గరకు వెళ్లి తనతో పాటు వెంట ఉన్న ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులందరికీ టీ ఆర్డర్ చేశారు. బంకు యజమాని చెంగాచారితో మాటలు కలిపి, క్షేమ సమాచారాలు కనుక్కున్నారు. తాను టీడీపీ వీరాభిమానినని, యువగళం పాదయాత్రలో లోకేశ్‌తో కలిసి నడిచానని చెంగాచారి చెప్పారు. 1994 నుంచి పార్టీలో కొనసాగుతున్నానని తెలిపారు. టీడీపీ వాడినన్న కక్షతో ఐదేళ్లుగా తన టీ అంగడి మూయించేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మళ్లీ టీడీపీ అధికారంలోకొచ్చాక జూన్ 17న తిరిగి దుకాణం ప్రారంభించానని పేర్కొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ ఇక ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం వద్దంటున్నా టీకి డబ్బులు చెల్లించిన లోకేశ్.. అక్కడి నుంచి కడప బయల్దేరి వెళ్లారు.

మహానాడుకు అన్ని డిపోల నుంచి బస్సులు: రవాణా మంత్రి రాంప్రసాద్

కడప మారుతీనగర్, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజుల పాటు జరగనున్న మహానాడులో భాగంగా చివరి రోజైన గురువారం నిర్వహించే బహిరంగ సభకు ఐదు లక్షల మంది వరకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుంచి కడపకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ భవనంలో ఆర్టీసీ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహానాడుకు టీడీపీ శ్రేణులు, అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో.. వారిని సురక్షితంగా కడపకు చేరవేసేందుకు వీలుగా అవసరమైన బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూలనాగరాజు, కడప జోన్ ఈడీ చంద్రశేఖర్, ఆర్ఎం గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల మహా వేడుక!

- పార్టీ అధ్యక్షుడి నుంచి కార్యకర్త వరకు అందరూ కలిసి చేసుకునే 'పసుపు పండుగ'
- భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు, తీర్మానాలు
- 1983లో తొలి మహానాడుకు బెజవాడ వేదిక
- ఆనాడు పెద్దఎత్తున జాతీయ నేతలు హాజరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాలుగు దశాబ్దాలుగా తెలుగువాడి ఆత్మగౌరవ ప్రతీకగా ఉన్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు. జాతీయ అధ్యక్షుడి నుంచి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ కలిసి చేసుకునే సంబరం ఇది. 1982లో టీడీపీ ఆవిర్భవించింది. మహానాడు కార్యక్రమం కూడా అదే ఏడాది నుంచి ప్రారంభమైంది. పార్టీలో మహానాడుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పార్టీ నిర్మాణం, సిద్ధాంతాలు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై అందరూ కలిసి చర్చించి, తీర్మానాలు ఆమోదించుకోవడం పార్టీ ఆరంభం నుంచి వస్తున్న సంప్రదాయం. పార్టీ భూత, భవిష్యత్తు, వర్తమానాలపై చర్చలకు మహానాడు వేదికగా నిలుస్తుంది. పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఇక్కడే జరుగుతుంది.

పలుమార్లు బ్రేక్

అధికారంలో ఉన్నా లేకున్నా ప్రతియేటా మహానాడును క్రమం తప్పకుండా నిర్వహిస్తుంటారు. అయితే 1985, 1991, 1996, 2012, 2019, 2024 సంవత్సరాల్లో మహానాడు జరగలేదు. 1985లో మధ్యంతర ఎన్నికల కారణంగా, 1991లో రాజీవ్‌గాంధీ హత్య తర్వాత దేశంలో ఏర్పడిన రాజకీయ పరిస్థితుల కారణంగా, 1996లో 1995 ఆగస్టు సంక్షోభం కారణంగా మహానాడు నిర్వహించలేదు. 2012లో ఎన్నికల కారణంగా జరగలేదు. 2019లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వారంలోపే మహానాడు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కారణంగా నాయకులు, కార్యకర్తల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని నాడు కూడా నిర్వహించలేదు. ఇక 2024లో ఎన్నికల కారణంగా నిర్వహించలేకపోయారు.



తొలి మహానాడులో పాల్గొన్న జాతీయ నేతలు

డిజిటల్ వేదికగా నిర్వహణతో రికార్డు

2020, 2021లో కరోనా కారణంగా మహానాడును బహిరంగంగా నిర్వహించలేదు. అయితే 2020లో జూమ్ ద్వారా నిర్వహించారు. ఇలా జూమ్ ద్వారా పార్టీ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించడం టీడీపీతోనే మొదలైంది. సుమారు 14 వేల మందితో ఆన్‌లైన్‌లో భారీ సమావేశాన్ని నిర్వహించిన తొలి రాజకీయ పార్టీ తెలుగుదేశం ఒక్కటే. 2021లోనూ డిజిటల్ వేదికపైనే నిర్వహించారు.

2022 మహానాడు ప్రత్యేకత

టీడీపీ ఆవిర్భవించి 2022కి 40 ఏళ్లు పూర్తయింది. ఆ ఏడాది ఒంగోలులో మహానాడు నిర్వహించారు. ఎన్టీఆర్ జన్మించి 99 ఏళ్లు పూర్తి కావొస్తుండటంతో ఆయన శతజయంతి ఉత్సవాలనూ ఇక్కడి నుంచే మొదలుపెట్టారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు చంద్రబాబు డిజిటల్ సంతకం చేసిన ఆహ్వానపత్రికలను పంపించారు. నాటి వైసీపీ పాలన అణచివేతను ఎదుర్కొని పార్టీలో ఊపునకు ఈ మహానాడు కారణమైంది. కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు.

2018 నుంచి విదేశాల్లో..

విదేశాల్లో మహానాడును నిర్వహించే సంప్రదాయం 2018లో ప్రారంభమైంది. ఆ ఏడాది ఉత్తర అమెరికాలోని డల్లా‌స్‌లో నిర్వహించిన పసుపు పండుగ విదేశాల్లో నిర్వహించిన తొలి మహానాడు. 2022లోనూ అమెరికాలోని బోస్టన్‌లో వైభవంగా నిర్వహించారు.

ఏర్పాటుపై మహా కసరత్తు

మహానాడు ఏర్పాట్లు పకడ్బందీగా ఉంటాయి. మంత్రివర్గంలో ఎన్ని శాఖలు ఉంటాయో అన్ని కమిటీలను ఏర్పాటు చేస్తారు. నిర్వహణ, వసతి, వాహనాలకు.. ఇలా ప్రతి పనికీ ఒక కమిటీ ఉంటుంది. సాధారణంగా మహానాడు ఎండాకాలంలో వస్తుంటుంది కాబట్టి ఐదు నిమిషాలకోసారి మజ్జిగ, మంచినీరు అందించే కమిటీ కూడా ఉంటుంది.

మెనూలో ఎన్టీఆర్‌కు ఇష్టమైన వంటలు

మహానాడులో నాయకులు, కార్యకర్తలకు వడ్డించే వంటకాలకూ ప్రత్యేకత ఉంది. ఎన్టీఆర్ పుట్టిన రోజైన మే 28న ఆయనకు ఇష్టమైన ప్రత్యేక మెనూతో వంటలు చేస్తారు. రవ్వ కేసరి, ఇడ్లీ, కట్టె పొంగలి లేదా చక్కర పొంగలి, మసాలా వడ, చింతపండు దప్పళం, కొత్త మామిడి పచ్చడి, ఉలవచారు, పూతరేకులు, విక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ వంటివి తప్పనిసరిగా ఉంటాయి.

పసుపు పండుగకు పేరు వచ్చిందిలా..

మహానాడుకు ఆ పేరు ఎలా వచ్చిందంటే.. 1982 మార్చి 29న టీడీపీ ఆవిర్భవించాక పార్టీ జెండా, గుర్తు వంటి అంశాలపై నాయకులతో చర్చించి ఎన్టీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ విధివిధానాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భారీసభ నిర్వహించాలని నేతలంతా ఏకాభిప్రాయానికి వచ్చారు. ఆ ఏడాది ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో నిర్వహించిన సభనే మహానాడు సభగా చెబుతారు. కానీ 1982 మే 28న ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని తిరుపతిలో భారీసభ ఏర్పాటుచేశారు. దీనికి ఎన్టీఆర్ 'మహానాడు' అనే పేరు పెట్టారు. అప్పటి నుంచి 'మహానాడు' వాడుకలోకి వచ్చింది. అయితే ఈ రెండు సభలు టీడీపీ అధికారంలోకి రాకముందు నిర్వహించినవి. 1983 ఎన్నికల్లో ఘన విజయం తర్వాత 1983 మే 26, 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన మహానాడును అధికారికంగా తొలి మహానాడుగా పరిగణిస్తారు. ఈ కార్యక్రమానికి ఎంజీ రామచంద్రన్, బాబూ జగ్జీవన్‌రాం, ఫరూఖ్ అబ్దుల్లా, హెచ్ఎన్ బహుగుణ, చంద్ర రాజేశ్వరరావు, ఎల్‌కే ఆడవాణీ, వాజపేయీ, రామకృష్ణ హెగ్డే, అజిత్‌సింగ్, శరద్‌పవార్, ఉన్నికృష్ణన్, ఎస్ఎస్ మిశ్రా, రవీంద్ర వర్మ, మేనకా గాంధీ లాంటి బడా నాయకులు వచ్చారు.

పౌరుషాల నేలలోన.. పసుపు దమ్ము చూపించగా..

- యువగళాల వేదికగా.. నవతరాల పూనికగా
- మహానాడుకు పాట రాసిన త్రిపురనేని కల్యాణ్ చక్రవర్తి



హైదరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): "పౌరుషాల నేలలోన పసుపు దమ్ము చూపించగా... కదలరా కదలరా కడపవైపు. యువగళాల వేదికగా.. నవ తరాల పూనికగా... నాడు నాడు మహానాడు" అంటూ టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు కోసం పాటల రచయిత త్రిపురనేని కల్యాణ్ చక్రవర్తి పాట రాశారు. ఆ పాటను తెలుగుదేశం పార్టీ యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేశారు. గతంలో ఎన్నికల సమయంలోనూ ఈయన టీడీపీ కోసం పలు పాటలు అందించారు.

కాలంతోపాటు మార్పు అనివార్యం!

- లోకేశ్‌కు అశోక్ గజపతిరాజు మద్దతు



అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో లోకేశ్‌కు కీలక బాధ్యతలు అప్పగించేందుకు కడప మహానాడు వేదికగా నిలువనుంది. ఈ క్రమంలో పలువురు సీనియర్ నాయకులు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ అంశంపై టీడీపీ సీనియర్ నేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కాలంతో పాటు మార్పు అనివార్యమన్నారు. పార్టీలో కూడా మార్పు రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. టీడీపీని ఎన్టీఆర్ స్థాపించి 8 నెలల్లో అధికారంలోకి తీసుకొచ్చి చరిత్ర సృష్టించారని.. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో చంద్రబాబుతోపాటు తామంతా పార్టీని దుష్టశక్తి నుంచి కాపాడుకున్నామని అన్నారు. 2019కి ముందు లోకేశ్‌పై విపరీతమైన దుష్ప్రచారం జరిగిందని, వాటన్నింటినీ ఎదుర్కొని ప్రతిపక్షంలో ఉంటూ తన పోరాటాల ద్వారా తానేమిటో ఆయన నిరూపించుకున్నారని.. పార్టీని ముందుకు నడిపించే లక్షణాలు ఆయనలో ఉన్నాయని చెప్పారు. 'తెలుగుభాష ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ సజీవంగా ఉంటుంది. తెలుగువారు ఎవరికీ తక్కువ కాకుండా ఉండాలన్నదే ఎన్టీఆర్ సంకల్పం. విలువలతో కూడిన పార్టీ టీడీపీ' అని అశోక్ గజపతిరాజు తెలిపారు.

పెద్దిరెడ్డి కోట నుంచే మహానాడుకు సైకిల్ యాత్ర

- నాడు ఆపిన చోటే నేడు ఘనంగా ప్రారంభం.. పసుపు చొక్కాలు విప్పించిన చోటే ఘన సన్మానం



పుంగనూరులో పసుపు జెండాలు తొలగించాలని కార్యకర్తలను బెదిరిస్తున్న పెద్దిరెడ్డి అనుచరుడు సూరి(ఫైల్)

పుంగనూరు, రణస్థలం, మే 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు కాళ్లతో తొక్కిపడేసిన పసుపు జెండాలు సోమవారం అదే ప్రదేశంలో సగర్వంగా రెపరెపలాడాయి. తెలుగు తమ్ముళ్లకు నాడు ఎక్కడైతే అవమానం జరిగిందో అక్కడే వారికి ఘనంగా సన్మానం జరిగింది. 2023 అక్టోబరు 19న శ్రీకాకుళం నుంచి కుప్పంకు సైకిల్ యాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తలు నిద్రబంగి రామకృష్ణ, చిన్నరామసూరి, ఎస్.ఆదినారాయణ, బి.పెంటయ్య, ఎన్.సుందర్రావులపై చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణ సమీప సుగాలిమిట్టలో పెద్దిరెడ్డి అనుచరుడు చెంగళాపురం సూరి దౌర్జన్యానికి తెగబడ్డాడు. 'ఇది పెద్దిరెడ్డి ఇలాకా. ఇక్కడ వైసీపీ జెండా తప్ప మరొకటి కనిపించకూడదు' అని హూంకరించాడు. పసుపు చొక్కాలు విప్పించి, సైకిళ్లకు ఉన్న పసుపు జెండాలను కిందపడేసి కాళ్లతో తొక్కి దుర్భాషలాడాడు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ ఓటమిపాలైంది. తాజాగా కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు శ్రీకాకుళం జిల్లా తెలుగు తమ్ముళ్లు సైకిల్ యాత్రను పుంగనూరులోని సుగాలిమిట్ట నుంచే సోమవారం ప్రారంభించారు. వారికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పూల మాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు.



సోమవారం పుంగనూరు నుంచి మహానాడుకు ఘనంగా సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న టీడీపీ శ్రీకాకుళం జిల్లా కార్యకర్తలు

వంశీ ఆరోగ్యం ఓకే

- గుంటూరు జీజీహెచ్ వైద్యుల వెల్లడి
- న్యూరాలజీ, పల్మనాలజీ టెస్టులు పూర్తి
- ఆరోగ్యం నిలకడగానే ఉందని నిర్ధారణ
- ఆస్పత్రిలో అందుబాటులో లేని స్లీప్ టెస్ట్
- వేరేచోట చేయించాలని సూపరింటెండెంట్ సూచన
- పరీక్షల అనంతరం విజయవాడ జైలుకు


వల్లభనేని వంశీని వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తున్న పోలీసులు

గుంటూరు, మే 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు స్పష్టం చేశారు. పోలీసు కస్టడీ సందర్భంగా ఆయన ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. కంకిపాడు పీహెచ్‌సీలో, విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసి.. అంతా బాగానే ఉందని వైద్యులు చెప్పారు. అయితే నిద్రలేమి సమస్యతో పాటు నిద్రలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నట్లు వంశీ చెప్పారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్య పరీక్షలు నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. దీంతో ఆయనకు స్లీప్ టెస్టు చేయాలని వైద్యులు పేర్కొన్నారు. అయితే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆ టెస్ట్ లేకపోవడంతో గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లడానికి పోలీసులు కోర్టు అనుమతి తీసుకున్నారు. ఇక్కడ గతంలో అందుబాటులో ఉండే స్లీప్ టెస్ట్.. ప్రస్తుతం లేదు. ఇది తెలుసుకోకుండానే ఉదయం పోలీసులు వంశీని ఇక్కడకు తీసుకొచ్చారు. శ్వాసలో ఇబ్బందులు ఉన్నాయని వంశీ చెప్పిన నేపథ్యంలో గుంటూరు వైద్యులు నరాలు, శ్వాసకోస సంబంధ పరీక్షలు చేశారు. వంశీకి సమస్యలు లేవని న్యూరాలజీ, పల్మనాలజీ వైద్యులు నిర్ధారించారు. పరీక్షలు ముగిసిన వెంటనే మధ్యాహ్నం 12 గంటల సమయంలో పటిష్ఠ బందోబస్తు మధ్య ఆయనను విజయవాడ జైలుకు తరలించారు.

నిలకడగానే వంశీ ఆరోగ్యం: జీజీహెచ్ సూపరింటెండెంట్

వంశీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. విజయవాడ వైద్యులు స్లీప్ టెస్ట్ రాశారని, ఆ టెస్టు గుంటూరు జీజీహెచ్‌లో ప్రస్తుతం అందుబాటులో లేదని చెప్పారు. స్లీప్ టెస్ట్ కోసం అందుబాటులో ఉన్న ఏ ఆస్పత్రికైనా వెళ్లవచ్చని సూచించారు.

ఆస్పత్రి వద్ద పకడ్బందీగా బందోబస్తు

పటిష్ఠ బందోబస్తు మధ్య విజయవాడ నుంచి పోలీసులు వంశీని గుంటూరుకు తీసుకొచ్చారు. ఆస్పత్రి వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు పోలీస్ స్టేషన్‌లోనే రాచమర్యాదలు, ఎస్కార్ట్ పోలీసులతో విందు భోజనం, అదేవిధంగా వైసీపీ నేత గోరంట్ల మాధవ్ పోలీసుల అదుపులో ఉన్న టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై దాడి, పోలీసులపై దౌర్జన్యం చేయడం వంటి ఘటనల్లో 20 మందికిపైగా పోలీసులు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఇలాంటి పరిణామాలకు తిరిగి అవకాశం కల్పించకూడదనే ఉద్దేశంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వంశీకి వైద్య పరీక్షల సమయంలో జీజీహెచ్ మెయిన్ గేట్‌ను మూసివేశారు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమర్శలు వ్యక్తం కావడంతో గంట తర్వాత గేట్లు తెరిచారు. వంశీని కలవడానికి ఆయన భార్య పంకజశ్రీ గుంటూరు ఆస్పత్రి వద్దకు వచ్చారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో ఆయనతో మాట్లాడేందుకు వీలు లేదని పోలీసులు స్పష్టం చేశారు. వంశీ వస్తున్నారని తెలుసుకుని గుంటూరు తూర్పు వైసీపీ ఇన్‌చార్జి నూరి ఫాతిమా, వైసీపీ కార్పొరేటర్లు ఆస్పత్రి వద్దకు వచ్చారు. వారెవరినీ పోలీసులు లోనికి అనుమతించలేదు.

వంశీ బెయిల్ పిటిషన్ కొట్టివేత

నూజివీడు, మే 26 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌ను ఏలూరు జిల్లా నూజివీడు సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ సోమవారం కొట్టివేశారు. బాపులపాడు మండలం పరిధిలో నకిలీ నివాస స్థలాల పట్టాల జారీ వ్యవహారంలో హనుమాన్‌జంక్షన్ పోలీసులు వంశీపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో బెయిల్ కోరుతూ వంశీ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై కోర్టులో సోమవారం వాదనలు జరగగా పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

క్వార్ట్జ్ అక్రమ తవ్వకంలో..

కాకాణే సూత్రధారి



(మొదటి పేజీ తరువాయి)

అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. సోమవారం కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం ఆయనకు రెండు వారాలు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వెంటనే ఆయన్ను నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

చింతామణిలో అరెస్టుచేసిన అన్నమయ్య పోలీసులు

మైనింగ్ కేసులో ఏ-4గా ఉన్న కాకాణి కోసం నెల్లూరు పోలీసులు రెండు నెలలు విస్తృతంగా గాలించారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో నాలుగు బృందాలు జల్లెడపట్టాయి. చివరకు బెంగళూరు శివార్లలోని చింతామణి ప్రాంతంలో ఆయన ఉన్నారని సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అప్రమత్తమయ్యారు. చింతామణికి పొరుగునే ఉన్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌తో మాట్లాడారు. అక్కడి నుంచి ఓ పోలీసు బృందాన్ని పంపారు. ఆ బృందం ఆదివారం రాత్రి చింతామణి ప్రాంతంలోని వెంకటపురం గ్రామంలో కాకాణిని అదుపులోకి తీసుకుంది. అక్కడి నుంచి నేరుగా నెల్లూరు డీటీసీకి తీసుకొచ్చి నెల్లూరు పోలీసులకు అప్పగించింది. అక్కడ ఆయన్ను జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సోమవారం విచారించారు. అయితే ఏ ప్రశ్నకూ ఆయన జవాబివ్వలేదు. ఆయన వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వెంకటాచలంలో వైద్య పరీక్షలు చేయించి, తిరిగి డీటీసీకి తీసుకొచ్చారు. ఆ తర్వాత వెంకటాచలంలో వైద్య పరీక్షలు నిర్వహించి వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తీసుకొచ్చారు. వాస్తవానికి ఈ కేసు గూడూరు కోర్టు పరిధిలోకి వస్తుంది. అక్కడి న్యాయాధికారి సెలవులో ఉండడంతో వెంకటగిరి కోర్టు మేజిస్ట్రేట్ విష్ణువర్మ ముందు హాజరుపరిచారు. ఇది రాజకీయ కక్షతో పెట్టిన అక్రమ కేసు అని, వాస్తవాలు లేవని, కేసును కొట్టివేయాలని కాకాణి తరఫు న్యాయవాదులు న్యాయాధికారిని కోరారు. అయితే ఈ కేసులో కనీసం పదేళ్ల శిక్ష పడే అవకాశం ఉందని, ఇలాంటి కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారుచేసే ప్రమాదం ఉందని పోలీసుల తరఫు న్యాయవాది వివరించారు. కాకాణికి పలుమార్లు నోటీసులు ఇచ్చినా విచారణకు సహకరించలేదని.. రెండు నెలలు తప్పించుకుని తిరిగారని.. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని.. పైగా ఆయనకు పెద్ద నేరచరిత్రే ఉందని.. బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని తెలిపారు. దీనికి సంబంధించిన సుదీర్ఘ రిమాండ్ రిపోర్టును కోర్టు ముందుంచారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత కాకాణికి న్యాయాధికారి రిమాండ్ విధించారు. ఈ కేసులో ఆయన్ను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు మంగళవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. మరోవైపు.. తమ క్లయింటుకు జైలులో ప్రత్యేక వసతులు కల్పించాలని కాకాణి తరఫు న్యాయవాదులు కోరారు. ఆయన సమాజంలో పరువు ప్రతిష్ఠలు కలిగిన నాయకుడని, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేశారని.. వెన్నునొప్పితో బాధపడుతున్నారని.. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జైలులో ఆయనకు ఏసీ గది, వార్తా పత్రికలు, ఇంటి భోజన సౌకర్యాలు కల్పించాలని కోరారు. అయితే కోర్టు ఈ విన్నపంపై విచారణను పెండింగ్‌లో పెట్టింది. కాగా.. కాకాణిని వెంకటగిరి కోర్టుకు తీసుకొస్తారన్న సమాచారంతో వైసీపీ నాయకులు తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు అక్కడకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరుగకుండా పోలీసులు కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు.

కాకాణి నేర చరిత్ర ఇదీ..!

కాకాణిపై మొత్తం 11 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వైసీపీ అధికారం కోల్పోయాక గతేడాది తన అనుచరుడిని పోలీసులు అరెస్టు చేసిన సందర్భంలో వెంకటాచలం సీఐని ఆయన పరుష పదజాలంతో దూషిస్తూ, పోలీసులను బెదిరించేలా మాట్లాడారు. గుడ్డలూడదీస్తాం.. అంటూ అసభ్యకరంగా మాట్లాడడంతో నెల్లూరులోని వేదాయపాలెం, కావలి వన్‌టౌన్ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అలాగే వెంకటాచలం, ముత్తుకూరు, నెల్లూరు దర్గామిట్ట పోలీసు స్టేషన్లలోనూ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో 2016లో ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విదేశాల్లో ఆస్తులు ఉన్నాయంటూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆయన పరువుకు నష్టం కలిగించేలా వ్యవహరించారన్నది అభియోగం. ఇందులో చార్జిషీటు కూడా దాఖలైంది. 2014 ఎన్నికల సమయంలో కల్తీ మద్యం తయారీ, రవాణా, పంపిణీ చేశారన్న అభియోగాలతో కాకాణిపై ఇంకో 3 కేసులు దాఖలయ్యాయి. నెల్లూరు-2, రాపూరు ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలోనూ కేసులు ఉన్నాయి. ఈ కేసులను విచారించిన సీఐడీ.. చార్జిషీటు కూడా దాఖలుచేసింది. నెల్లూరు రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రస్తుతం ఈ కేసులు విచారణలో ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ఎవరూ రాకుండా చూసుకుంటానన్నారు..

ఈ అక్రమ మైనింగ్‌లో కాకాణే సూత్రధారి అని, ప్రభుత్వ శాఖలేవీ మైనింగ్ ప్రాంతానికి రాకుండా చూసుకుంటానని చెప్పి.. వెనుక ఉండి నడిపించారని ఏ-7 కాటంరెడ్డి కరుణాకరరెడ్డి కీలక వాంగ్మూలమిచ్చారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో తెలిపారు. ఆయన భరోసాతోనే రుస్తుం మైన్స్‌లో అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలు జరిగాయని ఏ-6 వేమిరెడ్డి అరవిందకుమార్ రెడ్డి, ఏ-8 వాకా శివారెడ్డి కూడా వాంగ్మూలాలిచ్చారు. ఈ కేసులో పూర్వపు మైనింగ్ అధికారి (ఎల్‌డబ్ల్యూ-25) స్టేట్‌మెంట్ కూడా కీలకంగా మారింది. అక్రమ మైనింగ్ జరుగుతున్న సమయంలో సదరు అధికారి సంబంధిత శాఖలకు మైనింగ్‌ను అడ్డుకోవాలని సమాచారమిచ్చారు. ఈ సమయంలో కాకాణితోపాటు ఏ-1 పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి వాట్సాప్ కాన్ఫరెన్స్‌లో కాల్‌లో తనను బెదిరించారని ఆ అధికారి వెల్లడించారు. వరదాయపాలెం వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్ నుంచి కూడా మరోసారి కాకాణి తనతో మాట్లాడి బెదిరించారని.. ఆ తర్వాత తాను అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లలేదని స్టేట్‌మెంట్ ఇచ్చారు. కాకాణి అండతోనే మైనింగ్ మాఫియా క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వుకుపోయిందని ప్రత్యక్ష సాక్షి అయిన ఎల్‌డబ్ల్యూ-11 స్టేట్‌మెంట్ ఇవ్వడంతోపాటు అప్పట్లో తీసిన ఫొటోలు, వీడియోలు కూడా పోలీసులకు అందజేశారు.


విజయవాడలో రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు పీఎస్ఆర్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

అధికారముంది..

చేశానంతే!

- కమిషన్ నిర్ణయాలే అమలు చేశాను
- కస్టడీలో పీఎస్ఆర్ సమాధానాలు
- కొన్నింటికి మౌనం, తెలియదని జవాబు
- రెండో రోజు 32 ప్రశ్నలు
- ఏపీపీఎస్సీ గ్రూపు-1 కేసులో ముగిసిన పీఎస్ఆర్, మధుసూదన్ కస్టడీ

విజయవాడ, మే 26(ఆంధ్రజ్యోతి): "నిర్ణయాలను అమలు చేసే అధికారం నాకు ఉంది. అదే చేశాను. నేను సొంతంగా ఏ నిర్ణయాన్నీ అమలు చేయలేదు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలను అమలు చేశాను. అంతకుమించి నేను చేసిందేమీ లేదు".. ఏపీపీఎస్సీ గ్రూపు-1 కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కస్టడీలో దర్యాప్తు అధికారులకు చెప్పిన సమాధానాలు ఇవి. చాలా ప్రశ్నలకు 'అధికారం ఉంది కాబట్టి చేశాను. అంతే.. ఇందులో పెద్దగా చెప్పదగిందేమీ లేదు' అని చెప్పారు. పీఎస్ఆర్‌తో పాటు పమిడికాల్వ మధుసూదన్‌ను సోమవారం పోలీసులు విజయవాడ సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. దర్యాప్తు అధికారి నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ వారిని వేర్వేరుగా ప్రశ్నించారు. రెండో రోజున పీఎస్ఆర్‌కు 32 ప్రశ్నలు, మధుసూదన్‌ను 14 ప్రశ్నలు వేశారు. ఎవరి సిఫార్సుతో కామ్‌సైన్ సంస్థకు డిజిటల్ మూల్యాంకనం కాంట్రాక్ట్ ఇచ్చారని ప్రశ్నించారు. తన అధికారాలను ఉపయోగించుకుని ఈ కాంట్రాక్ట్ ఇచ్చానని పీఎస్ఆర్ చెప్పినట్టు తెలిసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీసుకున్న నిర్ణయాలను కార్యదర్శి హోదాలో అమలు చేశానని సమాధానం చెప్పారు. కామ్‌సైన్ సంస్థకు రూ.1.14 కోట్లను ఎలా చెల్లించారని ప్రశ్నించగా.. అధికారం ఉంది కాబట్టి చెల్లించానని తెలిపారు. తాను కార్యదర్శిగా గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించానని అంగీకరించారు. హాయ్‌ల్యాండ్‌లో జరిగిన మూల్యాంకనంలో ప్రైవేటు ఉపాధ్యాయులు, వెల్డింగ్ పనులు చేసే వారితో పరీక్షాపత్రాలను దిద్దించి ప్రొఫెసర్ల మాదిరిగా ఎందుకు సంతకాలు చేయించారని ప్రశ్నించగా... అది తనకు తెలియదని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. కాంట్రాక్ట్ ఇచ్చిన తర్వాత జరిగే పరిణామాలకు ఆ సంస్థే బాధ్యత వహిస్తుందని వివరించినట్టు సమాచారం. డిజిటల్ మూల్యాంకనంపై వివాదం రేగిన తర్వాత కామ్‌సైన్ నుంచి ఆ డబ్బులను ఎందుకు వెనక్కి తీసుకోలేదని అధికారులు అడిగారు. తాను కొద్దినెలలు మాత్రమే కమిషన్‌కు కార్యదర్శిగా వ్యవహరించానని, ఆ తర్వాత అక్కడ లేనని పీఎస్ఆర్ చెప్పినట్టు సమాచారం. కమిషన్ నిర్ణయాలను అమలు చేసినప్పుడు దానికి సంబంధించిన తీర్మానాల కాపీని చూపించాలని దర్యాప్తు అధికారి తిలక్ అడిగారు. ఆ కాగితాలన్నీ ఏపీపీఎస్సీలో ఉంటాయని పీఎస్ఆర్ సమాధానం చెప్పారు. డిజిటల్ మూల్యాంకనం జరిగినప్పుడు, కామ్‌సైన్ సంస్థకు డబ్బులు చెల్లించినప్పుడు కార్యదర్శి హోదాలో ఉన్నారని ఆధారాలను చూపించగా.. వాటిని చూసిన పీఎస్ఆర్ సమాధానం చెప్పలేదు. విచారణ అనంతరం పీఎస్ఆర్, మధుసూదన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత ఇన్‌చార్జి కోర్టు అయిన రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా అని న్యాయాధికారి అప్పారావు అడిగారు. ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని వారు చెప్పారు. అనంతరం జిల్లా జైల్లో నిందితులను అప్పగించారు.

పీఎస్ఆర్‌ను విచారించిన సీపీ

సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో పీఎస్ఆర్ ఆంజనేయులును విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు కొద్దిసేపు విచారించారు. సోమవారం ఉదయం కమిషనర్ కార్యాలయం నుంచి ఆయన నేరుగా సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే పీఎస్ఆర్‌ను నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ విచారిస్తున్నారు. ఈలోగా పోలీసు కమిషనర్ వెళ్లారు. పీఎస్ఆర్‌ను నాలుగైదు ప్రశ్నలు సంధించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

లిక్కర్ నిందితుల కస్టడీ పిటిషన్‌పై

తీర్పు 29కి రిజర్వు

- దిలీప్ బెయిల్‌పై తీర్పు రేపటికి వాయిదా

విజయవాడ, మే 26(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, కె.ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 29కి న్యాయాధికారి పి.భాస్కరరావు రిజర్వ్ చేశారు. ఈ నలుగురు నిందితులను వారంపాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా, మరో నిందితుడు పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఏసీబీ కోర్టు ఈనెల 28కి వాయిదా వేసింది. ఆయన బెయిల్ పిటిషన్‌పై సోమవారం వాదనలు ముగిశాయి. అనంతరం తీర్పును న్యాయాధికారి పి.భాస్కరరావు వాయిదా వేశారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేశ్



అమరావతి, మే 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు ఆలపాటి సురేశ్‌ను ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే నామినేటెడ్ పదవులు భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం సురేశ్‌ను ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఎంపిక చేసింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. రెండేళ్లపాటు పదవిలో కొనసాగే ఆయనకు జీత భత్యాలు, ఇతర సౌకర్యాల వివరాలతో త్వరలో మరో జీవో వస్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలంటూ సమాచార ప్రజా సంబంధాల శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. పాత్రికేయ రంగంలో ఉన్నత ప్రమాణాలను కాపాడటానికి, జర్నలిస్టుల సంక్షేమానికి ఆలపాటి సురేశ్ కృషి చేస్తారన్న విశ్వాసాన్ని జాప్ నాయకుడు వి.సత్యనారాయణ వ్యక్తం చేశారు.


ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ సలాదివారిపాలెం వద్ద గోదావరి నదిలో యువకులు గల్లంతైన ప్రదేశం

ఒకరిని కాపాడబోయి మరొకరు!

గోదావరి 'లంక'లో ఘోరం

స్నానానికి దిగిన 8 మంది యువకులు గల్లంతు

- కోనసీమ జిల్లా కమినిలంక వద్ద ఘటన
- అంతా కాకినాడ, కోనసీమ జిల్లా వాసులే.. 21 ఏళ్లలోపువారే
- కోనసీమలోని కె.గంగవరంలో వేడుకకు వచ్చి ప్రమాదంలోకి..
- రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్.. గజ ఈతగాళ్లతో గాలింపు

కాకినాడ, మే 26(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఘోరం జరిగింది. ఓ వేడుకకు వచ్చి.. ఆ తర్వాత సరదాగా స్నానానికి వెళ్లిన ఎనిమిది మంది యువకులు నదిలో గల్లంతయ్యారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద ఈ దుర్ఘటన జరిగింది. గల్లంతైనవారంతా 21 ఏళ్లలోపు వాళ్లే కావడంతో బాధిత తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గల్లంతైనవారి ఆచూకీ కోసం కోనసీమ ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం అర్ధరాత్రి వరకు ఎస్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లతో గాలింపు ముమ్మరం చేశారు. వివరాలివీ.. కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం శేరులంకలో సోమవారం కొండేపూడి నాగరాజు ఇంట ఓణీ వేడుక జరిగింది. ఈ శుభకార్యానికి కాకినాడ, ఐ.పోలవరం, శేరులంకకు చెందిన యువకులు వచ్చారు. వేడుకలో సరదాగా గడిపారు. మధ్యాహ్నం 3 గంటలకు అర కిలోమీటరు దూరంలో ఉన్న ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద ఉన్న గౌతమీగోదావరి నది వద్దకు 11 మంది యువకులు స్నానానికి వెళ్లారు. మొదట్లో లోతు తక్కువగా ఉండడంతో లోపలకు వెళ్లారు. తీరా లోతు అధికంగా ఉండడంతో ప్రవాహ ఉధృతికి ఇద్దరు కొట్టుకుపోయారు. వారిని కాపాడేందుకు మరో ముగ్గురు ప్రయత్నించి వారు కూడా కొట్టుకుపోయారు. వారిని కాపాడేందుకు మరో ముగ్గురు ప్రయత్నించి, వారు సైతం ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయారు. ఇలా 8 మంది గల్లంతయ్యారు. వారితోపాటే నదిలో దిగిన మరో ముగ్గురు మాత్రం ఒడ్డుకు చేరారు. గల్లంతైన వారిలో కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సబిత క్రాంతి ఇమ్మాని యేలు(19), సబిత పాల్(18), తాతిపూడి నితీష్(18), ఎలుమర్తి సాయి(18), మండపేటకు చెందిన కులపాక రోహిత్(18), కె.గంగవరం మండలం శేరిలంక ప్రాంతానికి చెందిన ఎలిపే మహేష్(14), ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన అన్నదమ్ములైన వడ్డే మహేష్(16), వడ్డే రాజేష్(14) గల్లంతయ్యారు. క్రాంతి, పాల్ డిగ్రీ చదువుతుండగా, వీరిద్దరూ కాకినాడలోని జగన్నాథపురం చర్చి పాస్టర్ తనయులుగా గుర్తించారు. ప్రాణాలు కాపాడుకున్న ముగ్గురు పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. యానాం వరకు గోదావరిలో గాలించారు. మంత్రి సుభాష్ ఆదేశాలతో కలెక్టర్ స్పందించి ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించారు. జనరేటర్ల సాయంతో అర్ధరాత్రి వరకు గాలింపు చర్యలు కొనసాగించారు.


కమినిలంక పాయ వద్ద యువకులు విడిచిన దుస్తులు

గాలింపు ఆలస్యంపై స్థానికుల ఆగ్రహం

యువకుల కోసం పోలీసులు అన్వేషించే ప్రయత్నం చేయగా, అమలాపురం ఆర్డీవో మాధవి వచ్చారు. స్థానికులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి నాలుగు గంటలైనా అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వెలుతురు ఉండగా గాలింపు చర్యలు ఉధృతం చేయకుండా చీకటిపడ్డ తర్వాత ఏం ఉపయోగమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ మహేష్ ఘటనాస్థలానికి రాత్రి ఏడున్నర గంటలకు చేరుకోగా, కలెక్టర్‌వద్ద స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి..

యువకుల గల్లంతు ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే పవన్.. కలెక్టర్ మహేష్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు.

పోటుతో ఎంత ప్రమాదమో..

కమినిలంక గోదావరి పాయవద్ద స్నానం చేయడం ప్రమాదకరమని స్థానికులు చెప్తున్నారు. ఇక్కడ గోదావరి పాయకు సమీపంలో ఆరు కిలోమీటర్లు ఉన్న యానాం నుంచి నీరు వెనక్కు ఎదగన్నుకుని వస్తుంది. యానాం వద్ద గోదావరి, సముద్రం నీళ్ల పోటుపాటు కారణంగా వెనక్కు ఎగదన్ని కమినిలంక వద్ద గోదావరికి తరచూ పోటుపాటులు కొనసాగుతాయి.

డివైడర్ దాటొచ్చి.. కారును ఢీకొట్టి..

- రాజమండ్రి గామన్ వంతెన హైవేపై లారీ బీభత్సం
- నలుగురి దుర్మరణం.. ఒకరి పరిస్థితి విషమం
- మృతుల్లో ఇద్దరు వయో వృద్ధులు
- మనవరాలి పుట్టినరోజుకు కాకినాడకు వెళ్తుండగా ఘటన


తూర్పుగోదావరి జిల్లా గామన్ వంతెన హైవే లారీ ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

రాజమహేంద్రవరం, మే 26(ఆంధ్రజ్యోతి): కాకినాడలో చదువుకుంటున్న మనవరాలి పుట్టినరోజు సందర్భంగా.. ఆమెను కలిసి ఆశీస్సులు అందించేందుకు ఆ తాతయ్య, అమ్మమ్మలు.. మరో ముగ్గురితో కలిసి కారులో బయలుదేరారు. అయితే, వీరు బయలుదేరిన పది నిమిషాలకే.. మృత్యువు బొగ్గు లారీ రూపంలో ఎదురొచ్చింది. రాజమండ్రి గామన్ బ్రిడ్జి హైవేపై లారీ అదుపుతప్పి డివైడర్‌ను దాటి.. పక్కరోడ్డులో ఎదురుగా వస్తున్న వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు మృతి చెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన ఉప్పులూరి వరప్రసాద్(60) భార్య శివలీలావతి(56)తో కలిసి కొవ్వూరులో నివాసం ఉంటూ కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమార్తె భవానీ ఏడేళ్లక్రితం విద్యుదాఘాతంలో మరణించింది. భవానీకి కుమార్తె భువనేశ్వరి, కుమారుడు శంకర్ ఉన్నారు. కూతురి మరణంతో మనవళ్ల సంరక్షణ భారం వీరిపై పడింది. వీళ్ల భాగస్వామ్యంతోపాటు బంధుమిత్రుల సాయంతో ఇద్దరినీ చదివిస్తున్నారు. సోమవారం భువనేశ్వరి పుట్టినరోజు. కాకినాడలో చదువుకుంటోన్న ఆమె వద్దకు ఉదయం 9గంటల సమయంలో కొవ్వూరు నుంచి కారులో బయలుదేరారు. ఆమెకు ఇష్టమైన తినుబండారాలు సిద్ధం చేసుకుని పెట్టుకున్నారు. కారులో వరప్రసాద్ దంపతులతోపాటు పక్కింటి వారైన.. చాగల్లు మండలానికి చెందిన లక్కంసాని సురేశ్(అవంతి ఫీడ్స్ ఉద్యోగి), బిందు(34) దంపతులు, చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన శివలీలావతి తల్లి ఉప్పులూరి వీరవెంకట సత్యవతి(75) ఉన్నారు. వరప్రసాద్ కారు డ్రైవింగ్‌లో ఉన్నాడు. గామన్ వంతెన హైవే రోడ్డులో ఎడమవైపు లైన్‌లో ఆటోనగర్ జంక్షన్ దగ్గర్లోకి వచ్చారు. పక్కనే కుడివైపు రోడ్డులో దివాన్‌చెరువు వైపునుంచి వచ్చే వాహనాలను ఆటోనగర్ జంక్షన్ వద్ద రోడ్డు రవాణా అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో బొగ్గు లోడుతో విశాఖ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న లారీ వస్తోంది. వాహనాల తనిఖీలు గమనించిన లారీ డ్రైవర్ కంగారులో సడెన్ బ్రేక్ వేశాడు. వాహనంలో 30 టన్నులకుపైగా బొగ్గు లోడు ఉండడంతో వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో లారీ డివైడరును దాటి అవతలి లైన్‌లో వస్తున్న కారును ఢీకొట్టి పది మీటర్ల మేర నెట్టుకుపోయింది. చిన్న చెట్టు అడ్డు రావడంతో చెట్టుకు లారీకి మధ్య కారు నలిగిపోయింది. దీంతో కారులో ఉన్న వరప్రసాద్, సత్యవతి, బిందు ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. లీలావతి ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికి మరణించగా.. సురేశ్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు నడిరోడ్డుపై పోలీసు దండన


రౌడీషీటర్లను రోడ్డుపై కూర్చోబెట్టి లాఠీతో కొడుతున్న పోలీసులు

తెనాలి, మే 26(ఆంధ్రజ్యోతి): తెనాలిలో నెల రోజుల క్రితం గంజాయి మత్తులో నలుగురు యువకులు (వీరిలో ముగ్గురిపై రౌడీషీట్ ఉంది) పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. వారిలో ముగ్గురిని పట్టుకొన్న పోలీసులు కేసు కట్టారు. ఆ క్రమంలో వారిని నడిరోడ్డుపై కూర్చోబెట్టి లాఠీలతో కొట్టారు. ఆ దృశ్యాలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. తెనాలి ఐతానగర్ నివాసి చిరంజీవి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గంజాయి కేసులో తమను పట్టుకున్నారన్న కోపంతో ఉన్న నలుగురు కుర్రోళ్లు... ఏప్రిల్ 25న ఇంటికి వెళ్తున్న కానిస్టేబుల్ చిరంజీవిపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. దీనిపై అప్పట్లోనే టు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులైన చేబ్రోలు జాన్‌విక్టర్, షేక్ బాబులాల్, దోమా రాకేశ్, నవీన్‌లలో ముగ్గురిని అరెస్టు చేసి ఏప్రిల్ 26న కోర్టులో హాజరు పరిచారు. రిమాండ్ విధించడంతో ప్రస్తుతం జైలులోనే ఉన్నారు. నవీన్ మాత్రం అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అయితే ఈ కేసులో పోలీసులు పట్టుకున్న ముగ్గురిని ఐతానగర్‌లో రోడ్డుపై కూర్చోబెట్టి కొడుతున్నట్లుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియో కింద దానికి అనుకూలంగా, వ్యతిరేకంగానూ పలువురు పెట్టిన కామెంట్స్ కూడా వైరల్ అవుతున్నాయి. దీనిపై డీఎస్పీ జనార్దనరావు మాట్లాడుతూ... 'ఆ ముగ్గురిపై రౌడీషీట్ ఉంది. గతంలో ఎన్నోసార్లు హెచ్చరించాం. అయినా వారిలో మార్పు రాలేదు' అని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.